


మార్చి 1964
60 N.P



తప్పక చూడండి!
బంగారు తిమ్మరాజు
(శ్రీవేంకటేశ్వర పూజామహిమ)

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

విడిప్రతి వెల : 60 న.పై. — ఏడాది చందా : ఏడు రూపాయిలే

సంపుటి 2 మార్చి 1964 సంచిక 3

పాఠక మహాశయా ! ఈ నెల

# ఇదిగో వరస....



*గమనిక: ఉగాది పండుగ ఈనెల 15 వ తేదీ కావటంచేత సంచికను పండుగకు దగ్గిరగా, మామూలుకంటె ఆలస్యంగా విడుదల చేస్తున్నాము. వచ్చే నెలనుంచి యథా కాలానికే వెలువడుతుంది.*



Edited and Published by **V. V. Raghavaiah** for **Jyoti Publications** and Printed by him at Thrinadh Art Printers Buckinghampet post, **Vijayawada-2**

# క్షేమంగా వెళ్ళి

# లాభంగా రా!

నాగేశ్వర్రావుకు అమెరికా నుంచి ఆహ్వానం వచ్చిందని తెలిసి వాళ్ళమ్మ అడిగింది: "అమెరికా అంటే ఎంతదూరం ఉంటుందిరా నాగూ" అని.

"చాలా దూరం ఉంటుందమ్మా" అనిచెప్పాడు నాగేశ్వర్రావు.

చాలా అంటే ఎంతో తెలీలేదు ఆవిడకి. మళ్ళీ మనవడిని అడిగింది. అతను బళ్లో జాగర్ఫీ మాస్టారు చెప్పిందంతా జ్ఞాపకం తెచ్చుకుని చెప్పాడు: "అమెరికా అంటే అదొక పెద్దఖండం బామ్మా. అది యిక్కడికి చాలా బోల్డుదూరం. మన భూగోళం గుండ్రంగా బంతిలాగా వుంటుందికదూ. అందుకని అమెరికా, యిప్పుడు మనంవున్న చోటికి కింద సరిగ్గా భూగోళానికి అవతలి పక్క వుంటుందన్నమాట. పూర్వం దాన్నే పాతాళలోకం అనేవారుట." కళ్ళు ఇంతంత చేసుకుని యాక్షన్ చేస్తూ చెప్పాడు. ఆవిడకి భయంవేసింది. అయినా మనవడి మాటమీద నమ్మకం కుదరక మళ్ళీ కొడుకుని అడిగింది:

"హైదరాబాదునుంచి మనవెంకటరాఘవపురానికి వున్నంతదూరం వుంటుందా ఏంరా?"

నాగేశ్వర్రావు ఒక్కసారి తలెత్తి ఆవిడకేసి చూశాడు. "ఇంకా చాలా యెక్కువ దూరమే వుంటుందమ్మా"

అతని మనస్సు పాతిక సంవత్సరాల లోతుకు మునకవేసింది. ఎన్నెన్నో ఆశనిరాశలతో, కష్ట సుఖాలతో, జయాపజయాలతో కూడిన తన పాతికేళ్ళ నటజీవితం మనోనేత్రం ముందు సాక్షాత్కరించింది. జీవితంలోని ఒక్కొక్కముఖ్య సంఘటన ఒక్కొక్కమైలురాయి అయితే, తనజీవితం ఒక సుదీర్ఘ సాహసయాత్ర.

తను నిల్చున్నచోటునుంచి ముందున్న అమెరికాకు, వెనకవున్న వెంకటరాఘవపురానికి మధ్యగల అంతరాలను దూరంలో, కాలంలో అంచనా వేసుకున్నాడు. హైదరాబాదునుంచి అమెరికాకు దూరం 8000 మైళ్ళు, 24 గంటలు. తన గ్రామంనుంచి హైదరాబాదుకు దూరం 200 మైళ్ళు, 25 సంవత్సరాలు. తను పుట్టిన వెంకట రాఘవపురంనుంచి హైదరాబాదు చేరుకోడానికి 25 సంవత్సరాలు పట్టింది.

రాజుగారి రాచపుండు నయం చేయడానికి మూలికకోసం నాగేశ్వర్రావు యిదివరకు చాలాసార్లు పాతాళలోకం వెళ్ళి వచ్చాడు.



"మేమూ, అమ్మా, హీరో"

ఇప్పుడు ఆంధ్రుల కీర్తి ధ్వజాన్ని తీసుకుని వెళ్తున్నాడు. అయితే దానికీ దీనికీ కల్పనకీ వాస్తవానికి మధ్యవున్నంత అంతరంవుంది. కాని సాహసాలు అతను సినిమాలోనూ చేశాడు. జీవితంలోనూ చేశాడు. జీవితంలోనూ సినిమాలోను కూడా రాజకుమారుడిలాగానే వెలిగాడు, వెలుగుతున్నాడు.

• • •

మనకి వున్నది ఒక్కగానొక్క నాగేశ్వర్రావు. మరి అతను యిప్పుడు యెక్కడో భూగోళానికి అవతలపక్కనున్న అమెరికాకి వెళ్తున్నాడంటే, ఇంకా రెండు నెల్లదాకా మనకు కనిపించడంటే బాధగానే వుంటుంది. అతని తల్లికే కాదు తెలుగు సినీమతల్లికే బెంగగావుంటుంది అతనిమీద. అతను లేకపోతే తెలుగు సినిమారంగంలో సందడే వుండదు. ఒక్క సినిమారంగం ఏమిటి? తెలుగు ప్రజారంగంలోనే సందడి వుండదు. అతను ఒక రంగానికి ప్రత్యేకించినవాడుకాదు. అతను అందరికీ చెందినవాడు. అందరికీ కావలసినవాడు.

నాగేశ్వర్రావులో వున్న విశేషమేమిటో కాని, మన ప్రజలు అతనిమీద పెంచుకున్న మమకారం ఇంతా అంతాకాదు. 'కీలుగుర్రం' తీసేటప్పుడు అతనికాలు విరిగిందని తెలిసి ప్రజలు యెంత ఆందోళన పడ్డారో చెప్పడానికి వీల్లేదు. సినిమాల్లో అతను తనకిరెట్టింపు సైజులోవున్న ముక్కామలతో కత్తియుద్ధం చేస్తుంటే ఈ అర్భనాకారి పిల్లాడిని ఆ "రాక్షసుడు" ఏం చేస్తాడోనని ప్రేక్షకులు విలవిలలాడి పోయేవాళ్ళు. ఆ అపేక్ష - ఎవరో కొందరి విషయంలో - అలా లోపల్నుంచి తన్నుకొస్తుంది గానీ తెచ్చిపెట్టుకుంటే వస్తుందా? తెలుగు ప్రజల దగ్గర అంత గారాబం సంపాదించుకోగలిగాడంటే అది నాగేశ్వర్రావు ఒక్కడికే చెల్లింది.

అభిమానుల అభిమతాన్ని కాదనలేక నాగేశ్వర్రావు తనప్రాణాన్ని హైరానపెట్టుకుని ఏడాదికి డజనేసిచిత్రాల్లో నటించినా మనప్రజలకి తనివి తీరలేదు. "నాగేశ్వర్రావు మరీ ఒక్కడై పోయాడే - కనీసం అరడజను మందైనా నాగేశ్వర్రావులుండే ఎంత బావుణ్ణు" అనుకున్నారు ప్రజలు. సినిమా నిర్మాతలు కూడా. కానీ తను ప్రజలకి మరీ యింతే అలవాటు కావటం మంచిదికాదనీ. క్రమంగా అలవాటు మాన్పించాలనీ అనుకున్నాడు నాగేశ్వర్రావు. చిత్రాల సంఖ్య చాలా తగ్గించుకున్నాడు. క్రిందటేడు అతని చిత్రాలు మూడే వచ్చాయి. అవికూడా సంవత్సర పూర్వార్థంలోనే వచ్చాయి. చివరి ఆరు నెలల్లో అతని చిత్రం ఒక్కటి కూడా లేదు. ప్రజలు అప్పుడే అతనికోసం బెంగపడిపోయారు. బెజవాడలాంటి పెద్దపట్టణాల్లో వున్నవారు నాగేశ్వర్రావు చిత్రాలు కొత్తవి లేకపోతే పాతవే మళ్ళీ మళ్ళీ చూసి తృప్తిపడ్డారు. మూడు నాలుగు థియేటర్లు మాత్రమేవున్న వూళ్ళలో ఎప్పటికప్పుడు కొత్త చిత్రాలే గానీ పాతచిత్రాలు వేసే అవకాశం వుండదు. అవిధంగా ఒక వూళ్ళో వరసగా కొన్ని నెలలపాటు నాగేశ్వర్రావు చిత్రం లేకుండా పోయింది. అతనికోసం ప్రేక్షకులు ఆవురావురు మంటున్న సమయంలో ఒక హాల్లో నాగేశ్వర్రావు పాత చిత్రం ఒకటి వేశారు. జనం విపరీతంగా ఎగబడ్డారు. అవూళ్లో ఆడుతున్న కొత్త సినిమాలకంటే యెక్కువగా దీనికి డబ్బులొచ్చాయి. ఇదే సరైన అదను అనుకొని నాగేశ్వర్రావు పాత చిత్రాలని వరసగా నాలుగైదు ఆడించారు. అన్నీ డబ్బులు చేసుకున్నాయి.

నాగేశ్వర్రావును గురించి యింతగా చెప్పాలా మాకుమాత్రం తెలీదా అతన్ని గురించి అనవచ్చు కొందరు. మీకు తెలీదని కాదు. అసలు అమాటకొస్తే నాగేశ్వర్రావును గురించి మాకంటే. నాగేశ్వర్రావు కంటే కూడా ప్రజలకే బాగా తెలుసు. అతని జీవితంలో ఏతారీకున ఏం జరిగిందో అతనికంటే బాగా ప్రజలకే జ్ఞాపకం. అతను బాధపడుతుంటే ఓదార్చిందీ. కృంగిపోతుంటే ప్రోత్సహించిందీ. సంతోషిస్తుంటే ఆ సంతోషం తమదేనని భావించిందీ ప్రజలే. నాగేశ్వర్రావు మనస్సులో ఏముందో అతను చెప్పకముందే ప్రజలకి తెలుసు. మద్రాసులో అతను తన యింటిని సావిత్రికి విక్రయించాలని నిశ్చయించుకున్న క్రిందటి రోజునే అవిషయం ప్రజలకి తెలుసు.

అయినా. పల్లెటూళ్ళో పుట్టి పెరిగి. సంస్కారానికి విద్యకి. ప్రతిభకి పాండిత్యానికి సంబంధంలేదని నిరూపించి. జీవిత నిశ్రేణిలో అడుగు పెట్టునుంచి బయలుదేరి ఒక్కొక్క మెట్టుతోనూ హోరాహోరి పోరాడుతూ అన్నిటినీ జయించి పైమెట్టు నందుకున్న ఒక తెలుగువాణ్ణి గురించి మరొక్కసారి గర్వపడడానికే ఈ వాక్యాలు వ్రాయడం జరిగింది.

అతని అమెరికాయాత్ర అమోఘంగా. అద్భుతంగా. ఆనంద ప్రదంగా జరగాలని మీలాగే మేమూ కోరుకుంటున్నాము.

□□□




# రాజకీయ వాతావరణం

ప్రతిపదానికి అర్థంతీసేవాళ్ళు తప్పితే. మిగతావాళ్ళు తెలుగు సంవత్సరాల పేర్లని గురించి. వాటి అర్థాలని గురించి పట్టించుకోరు. ఈ అర్థాలు తీయటం కొందరు సరదా కోసం చేస్తే. మరికొందరు నిజంగానే చేస్తారు.

శోభకృత్ వెళ్ళిపోతోంది. క్రోధి వస్తోంది. నిజానికిగడచిపోయిన సంవత్సరం ఏమంత శోభ కలిగించిందని? అన్ని సంవత్సరాల లాగే అదీ కొందరికి శోభని. మరి కొందరికి క్షోభని కలిగించింది. రాబోయే సంవత్సరం క్రోధికావచ్చునుగాని. అదికొందరిపై క్రోధం చూపవచ్చు; మరి కొందరికి మోదం కలిగించవచ్చు. అందుకే "పేరులోన నేమి పెన్నిధియున్నది?" అన్నాడు గిరీశం.

ఒకటిమాత్రం నిజం. శోభకృత్ వెడుతూ ఆంధ్ర ప్రదేశ్ కు ఒక కొత్త ముఖ్యమంత్రిని ప్రసాదించివెడుతోంది. ఆయన కొత్త ముఖ్యమంత్రే గాని మనం ఎరగని మంత్రి కాదు. పాత మంత్రే. కొత్త హోదాలోపాతవ్యక్తి.



కొత్త ముఖ్యమంత్రి
శ్రీ బ్రహ్మానందరెడ్డి

ఆయన పరిపాలనలో సమర్థుడని. వ్యక్తిగా చాలా సౌమ్యుడని. మనమెరిగిందే.

అయితే. వారి విషయంలో మాత్రం గిరీశం అన్నదానికి కొంచెం తభావతువుంది. వారి ఇంటిపేరులోనే పెన్నిధివుంది. అంతే కాదు; పేరుకుతగ్గట్టే ఆయన ఎప్పుడూ చిరునవ్వునవ్వుతూ బ్రహ్మానందంగా వుంటారు. ఇక వారి పరిపాలన విషయమా? కొత్త సంవత్సరాదినాడు మనం రుచిచూసే వేపపువ్వు పచ్చడి లాగానే తీపి. చేదుల మిశ్రమంగానే వుంటుంది. మరోలా వుంటుందని యెందుకనుకోవాలి?

• • •

ఇంతకీ - సంజీవరెడ్డి గారు పదవిని పరిత్యజించినట్టా. లేనట్టా? అవుననుకుంటే అవును; కాదనుకుంటే కాదు. మరి ఆయన మాత్రం ఏం చేస్తారు? అందరూ అంత బలవంతం చేస్తే కాదనలేకపోయారు. ముఖ్యమంత్రి పదవిని వదలిపెట్టి పార్టీ నాయకత్వాన్ని తమ చేతిలోనే వుంచుకున్నారు.

సింహాసనం ఒకటే. కాని దానిపై ఇద్దరు

నాయకులు. అంటే సంజీవరెడ్డిగారు బ్రహ్మానందరెడ్డిగారికి, అర్ధసింహాసనమిచ్చి ఆదరించారన్న మాట.

కర్నూలు జిల్లాలో బస్సులను జాతీయం చెయ్యడంలో సంజీవరెడ్డిగారు పక్షపాత బుద్ధిని ప్రదర్శించినట్లు అంగీకరించక తప్ప లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును అనుసరించి. మన్నించి పదవికి రాజీనామా యిచ్చి సంజీవరెడ్డిగారు మన దేశపు ప్రజాస్వామ్యంలో ఒక కొత్తసంప్రదాయాన్ని, చాలా శ్లాఘనీయమైన, ఆదర్శప్రాయమైన దాన్ని ప్రవేశపెట్టారు. చాలా గొప్ప విషయమే. ఎవరు కాదంటారు? ప్రజలు. పత్రికలు అంతా ఆయన నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు కూడా ఔననక తప్పలేదు. ఆయన రాజీనామాకు అది సమ్మతించింది. బాగానే వుంది.

అయితే, ఒక్క చర్యతో, నిర్ణయంతో దేశంలోని మిగతా నాయకులకంటె ఒక ఫర్లాంగు యెత్తున పెరిగిపోయిన సంజీవరెడ్డిగారు మళ్ళీ యథాస్థాయికి ఎందుకు తగ్గిపోవలసి వచ్చింది? అందరూ బలవంతపెట్టే వుండవచ్చు. ఆయన సమర్థుడు; వ్యక్తిగా చాలా పట్టుదల. సాహసం, చొరవ, తొందరగా మంచి నిర్ణయాలకు రాగల దక్షత, అందరినీ కూడగట్టుకొని రాగలనేర్పు, ప్రతిపక్షులను కీలెరిగి వాత పెట్టగలిగిన చతురత అన్నీ వున్నవారే. ఆయన రాష్ట్రానికి నాయకుడుగా వున్నప్పుడల్లా కాంగ్రెసులో గ్రూపులు కకావికలై పోయి కనీసం పైపైనయినా ఐకమత్యం సిద్ధిస్తున్న మాటనిజమే. అందుచేత అందరూ ఏకగ్రీవంగా "మీరే మా నాయకుడుగా వుండా"లని వుండచ్చు.

కాని, దానికి సంజీవరెడ్డిగారు యెందు కొప్పుకోవాలి, ముఖ్యమంత్రిత్వానికి రాజీనామా యివ్వడంతో కలిగిన ఔన్నత్యం దీనివల్ల "న్యూట్రలైజ్" అయిపోవడం లేదా?

అదీగాక, ఒక రాష్ట్రానికి యిద్దరు నాయకులా? ద్వంద్వ ప్రభుత్వమా? పార్టీ నాయకుడుగా సంజీవరెడ్డిగారివంటి అతిరథుఉండగా ముఖ్యమంత్రిగా బ్రహ్మానందరెడ్డిగారి స్థాయి ఏమిటి? ఆ పదవికి యెంత విలువ వుంటుంది? ఇది మరికొంత కాలం పోతేగాని తేలని సమస్య.

• • •

సంజీవరెడ్డిగారు పదవీ విరమణచేస్తూ, దానికి దారితీసిన పరిస్థితులను అసెంబ్లీలో సుదీర్ఘంగా వివరించారు. కర్నూలుజిల్లాలోనే తాను యెందుకు బస్సులను జాతీయం చేయవలసి వచ్చిందీ, ప్రతిపక్షులు ఏ ఉద్దేశంతో తమమీద అభాండాలు వేసిందీ ఆయన తమ ప్రకటనలో తెలిపారు. ఆప్రకటనను సంజీవరెడ్డిగారిపట్ల అభిమానం వున్నవారు విశ్వసిస్తారు. లేనివారు తోసివేస్తారు. ఏమైనా ఆయనమాత్రం తాను త్రికరణశుద్ధిగా రాష్ట్రశ్రేయస్సును కోరి మాత్రమే ఆపని చేశామని చెప్పారు. తనపై ఆరోపణలకు అఫిడవిట్ దాఖలు చేయవలసిన అవసరంలేదని న్యాయవేత్తలు సలహా యిచ్చినందువల్ల సమాధానమివ్వ లేదని కూడా ఆయన చెప్పారు. అఫిడవిట్ దాఖలు చేయకపోవడానికి కారణం మొత్తం డొంకంతా కదులుతుందనే భయమేనని గిట్టనివారనే మాట. (ఏమైనా ఈ వ్యవహారం కారణంగా అడ్వకేట్ జనరల్ శ్రీ దువ్వూరి నరసరాజుగారు పదవిని ఖాళీచేయవలసి వచ్చింది.)

• • •

## బ్రహ్మానందరెడ్డి

రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రి అయిన శ్రీ బ్రహ్మానందరెడ్డి, వినమ్రుడు, వినయశీలి,





సెకండ్ థాట్స్?

"అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించకపోడు" — శ్రీ సంజీవరెడ్డి

["జ్యోతి"కి ప్రత్యేకం ఫొటో: ఎస్. ఎ.]

నవ్వుతూనే 'అ'కు 'ఏ'త్వం చుట్టగల సమర్థుడు.

గుంటూరులో ప్లీడరుగిరి ధాటీగా నే చెలాయించి, జిల్లాబోర్డు పాలిటిక్సుతో ప్రారంభించి హైదరాబాదులో మంత్రి అయ్యారు. మంత్రి అవటం 1956 లో జరిగిన విషయం. అప్పటినుంచీ మంత్రిగానే - ఎందరు మంత్రులు దిగినా, ఎందరు లేచొచ్చి కూర్చున్నా. తానుమాత్రం తన 'గద్దె'ను యేకధాటితో ఆక్రమిస్తూవచ్చారు.

వీరికి శ్రీ సంజీవరెడ్డితో ఇరవై సంవత్సరాల పరిచయం.

1960 లోనే శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిని ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించి ఢిల్లీ వెళదామనుకున్నారు శ్రీ సంజీవరెడ్డి. అయినా ఆఖరు క్షణపు అవాంతరాలు అడ్డంపడి పనిని సాగనియ్యలేదు.

ఇప్పుడు మాత్రం గట్టిగా బండిని లాక్కొచ్చి, బ్రహ్మానందరెడ్డిగారి బుజానికి తగిలించారు. ఆయన వెనుకగా ఎం.ఎల్.ఎ. లకు నాయకత్వం వహించి పార్టీబలాలు చెదరిపోకుండా అప్రమత్తతతో కాపాడుతూ బ్రహ్మానందరెడ్డిగారి హయాంలో ఐకమత్యాన్ని పటిష్ఠం చేస్తామని శ్రీ సంజీవరెడ్డి హామీ యిచ్చారు.

బ్రహ్మానందరెడ్డి గారింటిపేరు కాసువారు. ఈయన కాసులమంత్రి. వీరి కాసుల హయాంలో, ఆంధ్రరాష్ట్రం ఆదాయం అరవైకోట్లనుంచి ఆరేళ్ళలో నూటముప్ఫై అరుకోట్లరూపాయలకు పెరిగింది.

చిన్నప్పుడు హాకీ ఆడేవారు.

1909, జూలై 28 వ తేదీన గుంటూరు జిల్లా చిరుమామిళ్ళలో ఈయన జన్మించారు. 1921 లో గాంధీగారిని బెజవాడలోచూశారు.

● ● ●

రాష్ట్రంలో జరిగిన ఉప యెన్నికల్లో మూడింట రెండు కాంగ్రెసు గెలుచుకుంది. గతరెండు యెన్నికల్లో ప్రతిమాటూ గెలుచుకున్న మూడో స్థానం మాత్రం ఈ సారి కాంగ్రెసు పోగొట్టుకుంది.

కల్వకుర్తిలో శ్రీమతి శాంతాబాయి, వాయల్పాడులో శ్రీ తిమ్మారెడ్డి గెల్చారు. కంకిపాడులో మాత్రం, కాంగ్రెసు అభ్యర్థి శ్రీ శేషగిరిరావు ఓడిపోయి శ్రీలక్ష్మణస్వామి గెలిచారు.

మొదటి రెండు స్థానాలలోనూ కాంగ్రెసు గెలవటం అంత విశేషంకాదు. (అక్కడ గెలిచి వుండకపోతే ఆశ్చర్య పడాల్సి వచ్చేది.)

కంకిపాడులో కాంగ్రెసు ఓడిపోవటమే అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

కారణం - కాంగ్రెసులో వర్గ విభేదాలే అని ఇరు వర్గాల నాయకులు బహిరంగంగా ప్రకటనలు చేసుకున్నారు. - ఇహ మనం మాట్లాడవలసిన పనిలేదు.

● ● ●

సత్యాగ్రహం మాత్రం రాష్ట్రంలో 'అదో సందడి'గా సాగుతూనేవుంది.

తమాషా యెక్కడంటే-

తమది 'సింబాలిక్' సత్యాగ్రహం అని అఖిలపక్ష కార్యాచరణ సంఘం అంటుంటే దానికి తగినట్లు గానే వ్యవహరిస్తోంది ప్రభుత్వంకూడా. రెండువ్రక్కలా 'సింబాలిక్' (నామ మాత్రం దనుకుంటే ఇబ్బందిలేదు, గానేవుంది తతంగం.

మొన్న ఒకమాటు రాజధానిలో ఒక ఇరవైమంది సత్యాగ్రహులు సచివాలయం దగ్గర ప్రదర్శనలు చేశారు.

పోలీసులు మాత్రం వారి చుట్టూనుంచున్నారు. పక్క వాళ్ళు యెవరి పనులువాళ్ళు చూసుకుంటూనే వున్నారు. అంతా లాంఛనప్రాయంగానే సాగిపోయింది.

రాష్ట్రం అంతటా అన్ని ప్రతిపక్షలవారు ఈ సత్యాగ్రహంలో కలిసినా - చివరకి జరిగే తంతు ఇదే.

(వాళ్ళకీ.వీళ్ళకీ అదో'ముచ్చట'గాబోలు అనుకున్నాడు ఆ పక్కనే వెళ్ళిపోతున్న వీధి మానిసి.

అదనపు భూమి శిస్తు విధించి దాదాపు పద్దెనిమిది నెలలు జరిగింది. వేసిన కొత్త పన్నులు వసూళ్ళు చేయటంకూడా జరిగిపోయింది. అయినా అప్పుడెప్పుడో వేసిన కొత్తపన్నులకు ఇప్పుడు బయలుదేరి'రాగాలాపన' చేస్తే - ఇంతే మరి అన్నాడాకాయన.

వర్షంకోసం. గాలిపాటు కోసం ఈ రోజుల్లోకూడా యెదురు చూస్తూ కూర్చుంటే పరిస్థితులు ఇట్లాగే వెక్కిరిస్తాయి.

"ఆ సత్యాగ్రహం యేంఇబ్బంది పెట్టదులెండి - క్రమేణా చప్పబడి చల్లారిపోతుందిలెండి" అని ఆ మధ్య ప్రభుత్వంలో ఒక పెద్ద మనిషి అన్నట్లు - చివరికి జరిగేది అంతేనేమో ననిపిస్తోంది. కాని....

మొన్న విజయవాడలో జరిగిన సంఘటన మాత్రం అలా జరగదేమో. ఇది చివరికి దౌర్జన్య చర్యలలోకి దిగడం తప్పదేమో అనిపింప జేస్తోంది. జుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేటు ఆఫీసులోకి కొందరు సత్యాగ్రహులు చొరబడి సామగ్రిని, కాగితాలను చిందర వందర చేయడం, పని చేస్తున్న వాళ్ళపై చేయి చేసుకోవడం- ఈ హంగామాతో సత్యాగ్రహ కార్యాచరణ సమితికి ఎంత వరకు సంబంధం వుందో తెలియటం లేదుగాని మొత్తంమీద ఆందోళన కలిగిస్తున్నది. ఈ మాదిరి చర్యలు ఎక్కువగా జరిగి మొదట అనుకున్న ప్రకారం కాక మరోలా తిరిగితే, అప్పుడు తెన్నేటివారు, వావిలాల వారు ఏమంటారు? ఏం చేస్తారు? అన్న ప్రకారం సత్యాగ్రహంలోంచి తప్పుకుంటారా? మాకు దౌర్జన్య చర్యలతో సంబంధం లేదని వూరుకుంటారా? చూడాల్సిందే.

## జాతీయం

ఇహ జాతీయం జోలికి పోతే - అయ్యవార్లంగారు చేసిన తప్పులు సరిదిద్దుకుంటున్నారు.

ఐక్యరాజ్య సమితి యేదో గొప్ప న్యాయాన్ని చేకూరుస్తుందని, కాశ్మీరును పాకిస్తాన్ ముట్టడిస్తే ఆ రోజుల్లో కొత్త ఉబలాటంలో గబగబావెళ్ళి ఫిర్యాదు చేశాం. తీరా చూస్తే — "వేసిందే ఒక గంతు...." అన్న సామెత అయింది.

మొన్న కాశ్మీరు విషయంలో ఐక్యరాజ్యసమితిలో జరిగిన చర్చ చూసినప్పుడు యీవిషయం మరింత బోధపడింది.

ఆ "అంతర్జాతీయ సమితి" కేవలం శాంతికోసమే నెలకొల్పబడిందని, న్యాయాన్యాయ వివక్షణతో దానికి నిమిత్తం లేదని తేలింది. (శాంతికూడా అక్కడ కొన్ని పెద్దరాజ్యాలు వాంఛించిన విధంగా యేర్పడే 'శాంతి' మాత్రమే)

బ్రిటన్‌కు, అమెరికాకు - పాకిస్తాన్ "చెయ్యి జారిపోకుండా వుండటం" యెట్లా అనేదే మీమాంస.

భారతదేశపు మైత్రికూడా ఈ దేశాలకు అవసరమే అయినా, భారతదేశం లాగా కాకుండా పాకిస్థాన్ తమకు సైనిక స్థావరాలను యిచ్చింది. తమ సైనిక కూటంలో చేరింది. అందుకే వారికి ఆ దేశం అంటే పక్షపాతం.






•

ఇది మనకు మొన్న బాగా తెలిసివచ్చింది. శ్రీ చాగ్లా యెంత సొంపుగా, ఇంపుగా చెప్పినా, అందుకే ఆపెద్ద రాజ్యాలకు ఆకళింపు కాలేదు.

అయినా ఒక్క సుగుణం మాత్రం యిప్పుడు కనిపిస్తోంది. చేసిన తప్పును సరి దిద్దుకుంటున్నాం మనం.

'కామరాజ్ పథకం' పేరును జపిస్తూ ముక్కుమూసుకోలేదు. శ్రీ లాల్ బహదూర్ కేంద్రంలో తిరిగి మంత్రి అయినారు. విదేశాంగ వ్యవహారాలను దక్షతతో చూస్తున్నారు.

కాశ్మీర్‌లో మత ప్రవక్త పవిత్రకేశం మాయం అవటంతో జరిగిన అంతస్సంక్షోభానికి ఆయన చాలా నమ్రతతో 'జో' కొట్టారు. ధైర్యంచేసి "ఇదిగో దొరికిన 'పవిత్రకేశం'. అనుమానం తీర్చుకోండి." అని విచక్షణ లేకుండా అందరినీ ఆహ్వానించారు. అంతా వచ్చి చూశారు. నమ్మకం చిక్కి చల్లబడ్డారు. శ్రీ శాస్త్రిగారి నిపుణత, దూరదృష్టి చాలా అమోఘం అనిపించింది.

అదేకాకుండా ఆయన మరోపనికూడా చక్కబెట్టారు. మాజీ ప్రధాని బక్షీ ఘులాం మహమ్మద్ తన స్థానంలో కూర్చుండబెట్టిన షంసుద్దీన్‌ను తొలగించి సాదిక్‌ను గద్దె ఎక్కించారు. ఇది ఆయన రాజకీయ చాతుర్యానికి నిదర్శనం. ఆయన కిరీటంలో (టోపీ) మరోతురాయి.

ఇకపై త్వరత్వరగా అంచెలంచెలమీద మిగిలిన భారతదేశంలో కాశ్మీర్ విలీనం అయిపోతుంది.

లేకపోతే యెప్పుడూ ఒకపెద్దప్రమాదం మనదేశాన్ని వెంటాడుతూనే వుంటుంది. బ్రిటన్ అమెరికా దేశాల చాటున చేరి పాకిస్తాన్ మనమీద యెప్పుడూ 'బురద' చల్లుతూనే వుంటుంది.

ఇప్పుడు చైనా కూడా పాకిస్తాన్‌మీద వల పన్నుతోంది. చైనా "సందిట్లో" పాకిస్తాన్ కనక పూర్తిగా చిక్కిపోయిందంటే అప్పటికి కనక కాశ్మీర్ విషయం మనం తేల్చుకోక పోతే - అంతా గందరగోళం అయిపోతుంది.

ముందు జాగ్రత్తకోసం అందుకే శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారి విపులప్రయత్నాలు యిప్పుడు.

• • •

ఆమధ్యన శ్రీ శాస్త్రి కాశ్మీర్ వెళితే చలిబాధ తట్టుకోటానికి ప్రధాని నెహ్రూ ఓవర్‌కోటు తీసుకుని వెళ్లారుట. బాగా సరిపోయిందిట.

ఈవిషయం విన్న మహావీర్ త్యాగి - "ఇంకేం మహాభేష్! ఇహ తిరిగి యివ్వబోకు" అన్నారుట. (చలోక్తికోసమే లెండి) □■□

— అనంతం

---

● కొత్తదంపతులు ఒంటరిగా వున్నారు. ఒక్క ఉదుటులో అతడామె దగ్గిరగా వచ్చాడు. ఆమె అతని కళ్ళలోకి చూడగానే అతని పెదవులు వణికాయి, అతడామెని స్పృశించగానే ఆమె నిలువెల్లా కంపించి పోయింది. ముద్దు పెట్టుకోడానికి ముందుకు రాగానే అతటూ ఇటూ ఊగిపోయాడు. అతడామెని చేతుల్లోకి తీసుకోగానే ఆమె వెనక్కి వాలిపోయింది.

నీతి : ఎంత ఫస్టుక్లాసు అయినా కదులుతున్న రైల్లో ముద్దు పెట్టుకోరాదు.



# దొంగ

మసక మసకగా వుంది వెన్నెల. చెట్లకింద ఉన్న చీకటి లోంచి నడుస్తున్నాడు గోపాలం. మోకాళ్ళపైకి ఎగకట్టిన పంచె కట్టూ, ఛాతీకి బిగుతుగా అంటుకొని పోయిన బనీనూ, మొలలో చిన్న కత్తీ - ఆత్మ విశ్వాసంతో ధైర్యంతో ఉన్నాడు గోపాలం....

మధ్యమధ్య త్రేణుపులు వస్తున్నాయి వుల్లవుల్లగా - ఒకేఒక గ్లాసుడు నాటు సారా పుచ్చుకున్నాడు బలానికి, హుషారుకి. చదువు రాని వాడైనా, ప్రతీదీ ఒక ప్లాను ప్రకారం నడవాలి గోపాలానికి. ఏది చేసినా ముందూ వెనకా చూసి ఆలోచించి బేరీజు వేసే అలవాటు వుంది అతనికి. ఒక స్వాభావికమైన వివేకంవుంది. అందుకే

బాలగంగాధర తిలక్

రత్తయ్యా, సోములూ ఎంతో నమ్మకం వుంచి అతనిమీద యీ బాధ్యత వేశారు. వాళ్ళిద్దరూ లేకుండా ఉంటే, పనులు సవ్యంగా జరుగుతాయి. వాళ్ళిద్దరికీ నిదానం లేదు. వుత్త కంగారు, వుత్తి ఆశతప్ప.

రాత్రి ఒంటిగంట దాటితే కాని ఆవిడ మొగుడింటికిరాడు. రెండువారాలు పరిశీలనగా చూసి యీ విషయం గ్రహించాడు. ఆ క్లబ్‌లో కూర్చుని ఖరీదైన మందు తాగుతూ పేకాడుతూ డబ్బయిపోయేవరకూ అక్కడే వుంటాడు. ఈలోగా అతని భార్య వొంటరిగా యింట్లో వంటగదికి పక్కగా వున్నగదిలో పడుకుని నిద్రపోతుంది. వంటగదికి దొడ్లోనుంచి వెళ్లాలి. దొడ్డి చాలా పెద్దది. ఎన్నో మొక్కలూ చెట్లూవున్నాయి, వాటి నీడలో తాను కనిపించడు. మరీ మంచిది. వంటగది కిటికీ వానకి తడిసి ఎండకి ఎండి కమ్ములుపట్టు తప్పివున్నాయి. బలంగా తెలివిగా పనిచేస్తే మూడు నాలుగు ఊచల్ని తీసెయ్యవచ్చును. ఇంక ఒకసారి వంటగదిలో ప్రవేశించాక పని చాలా సులభం. తాను అవతల గది తలుపు కొడతాడు మెల్లగా. ఆవిడ ఏ ఎలకో పిల్లో అనుకుని తలుపుతీస్తుంది. అంతే. తాను కత్తి చూపించి భయపెడతాడు. మెళ్ళో ఉన్న నాలుగుపేటల గొలుసు ఒడుపుగా తాపీగా తీసుకుంటాడు. ఆమె తెప్పరిలే లోపల, కేకవేసేలోపల తోటలోకి చీకట్లోకి అదృశ్యుడైపోతాడు.

గోపాలం యిలాగ తన ప్లానంతా ఆలోచించుకుంటూ నిబ్బరంగా నడుస్తున్నాడు. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి — అక్కడక్కడ ఒకరిద్దరు రాత్రించరుల్ని తప్పించి. ఊరికి దూరంగా వున్న కొత్త పేట యిది. ఊళ్ళోవున్న జనసంచారమూ అలజడీ యిక్కడ వుండవు. మొదటి ఆట అయిపోగానే మొగలోవున్న కిళ్ళీకొట్లూ చిన్న కాఫీహోటలూ మూసేస్తారు. చాలా యిళ్ళు నిద్రలో మునిగిపోయాయి. కొన్ని యిళ్ళలోంచిమాత్రం విద్యుద్దీపకాంతి కిటికీల లోంచి వస్తోంది. మొత్తమ్మీద వీధులూ యిళ్లూ ఆ మసక వెన్నెలలో ఒంటరిగా గోపాలంకోసం యెదురు చూస్తోన్నట్టు వున్నాయి.

గోపాలానికి తను చేసేపనిమీద నైతిక సందేహాలు ఏమీలేవు. దొంగతనం తప్పనీ, పాపమనీ అతను అనుకోలేదు. ఎందరో తమతమ అవసరాలకి యెన్నో వృత్తులూ ఉద్యోగాలు చేసినట్టుగా అతనూ యిది చేస్తూన్నాడేతప్ప మంచి చెడ్డల సూక్ష్మ విచారణ చేసే వివేకితనం కాని, అసలటువంటి ఆలోచనలకి అవసరం కాని అతనికి కనిపించలేదు. అందువలన అతనికి అంతరాత్మని నొక్కివేయడమూ ఒప్పించడమూ లాంటిబాధలుకలగలేదు. తనపనిలో దొరికి పోతేజైలుకి వెళ్లాలన్న భయమూ జ్ఞానమూ వున్నాయిఅతనికి. అందుకేజాగ్రత్తగా ప్లాను వేసుకుంటాడు. ఎంతో అవసరమైతే కాని రత్తయ్యనీ సోముల్నీ వెంట తీసుకుని వెళ్ళడు. వాళ్ళిప్పుడు తనకోసం ఆశగా ఎదురు చూస్తూంటారన్న ఆలోచన అతనికి మరింత ఉత్సాహం యిచ్చింది.

ఆయిల్లు మసక వెన్నెల్లో ముడుచుకున్న తాబేలులా వుంది. ప్లానుప్రకారం యింటి వెనక్కివెళ్ళి దొడ్లోకి ప్రవేశించాడు. అరటిచెట్లూ కొబ్బరిచెట్లూ ఏవేవో మొక్కలూ తుప్పలూ అంతా గలీజుగా చీకటిగావుంది. నెమ్మదిగా నడచి వంటగదిదగ్గరకు వచ్చాడు గోపాలం. కిటికీ వూచల్ని ఒకసారి లాగి చూశాడు. ఇంతలో అతనికి లోపల్నుంచి మాటలు వినిపించాయి. అతనికి ఆశ్చర్యం కలిగింది. అతని పథకం అప్పుడే





దెబ్బ తిన్నట్టనిపించింది. ఈసారి మాటలు కొంచెం గట్టిగా కోపంగా వినవచ్చాయి. గోపాలానికి కుతూహలం కలిగింది. బహుశా ఆ వచ్చిన వాళ్ళెవరైనా మళ్ళీ వెళ్ళిపోవచ్చును, తన మార్గం నిరాటంకమవవచ్చును అనికూడా అనిపించింది. ఒకవేళ ఎవరేనా ప్రియుడేమో - మొగుడు లేకండాచూసి ప్రేమ కలాపం జరుపుతోందేమో అని ఊహ తట్టింది. మాటలు తొందరగా గట్టిగా వినపడుతున్నాయి. ఆవిడ గొంతులో ఏదో భయం, బాధా వున్నాయి. అతని కుతూహలం హెచ్చింది. బలంగా వూచల్నిలాగి కదిపి ఊడదీశాడు. నేర్పుగా ఏర్పడిన జాగాలోంచి వంటింట్లోకి ప్రవేశించాడు. పక్కగదిలోనుండి మాటలు వినపడుతున్నాయి.

'వద్దండీ - నామాట వినండి.' ఆవిడ గొంతు.

'ఇస్తావా- తగలనియ్యనా.' మగగొంతు.

'ఎందుకు జూదమాడి తగలేస్తారు చెప్పండి. కాపరానికొచ్చిన నాటినుండి సరగాలేదు. సుఖంలేదు. ఉన్న ఆస్తంతా తగలేశారు. చాలదా!'

'వెధవ లెక్చరివ్వక మర్యాదగా తీసి ఇలా యియ్యి. లేకపోతే....'

'ఈ ఉన్న ఒక్క గొలుసూ యిస్తే నా గతి ఏం కాను. బాబు గతి ఏం కాను, చూడండి వాణ్ణి. కన్న కొడుకుని. మీకు దయలేదా జాలిలేదా! ఏమండీ - ఈవాళ్టికి ఊరుకోండి. పన్నెండు గంటలవుతోంది. ఒకర్తినీ బిక్కు బిక్కు మంటూ యింట్లో-రండి. పడుకోండి.'

కర్కశంగా వినపడింది యీ సారి మొగగొంతు - 'ఇస్తావా - పీక పిసికి చంపెయ్య మన్నావా. వెధవా పీడా పదుత్తుంది.'

'ఇవ్వను.'

'ఇవ్వవా'

'ఇవ్వనుగాక యివ్వను. ఇది మావుట్టింటివారు పెట్టింది. ఇది నా ఆస్తి.'

వింటూన్న గోపాలానికి ఆవిడ మాటలలో ఏదో న్యాయం గోచరించింది. ఆవిడ గొంతు తియ్యగా సన్నగా జాలిగా వుంది. గోపాలానికి ఆవిడ మొగుడిమీద కోపం వచ్చింది.

'నీ ఆస్తా -? ఏంవిటే పేలాపు ముండా-ఇన్నాళ్ళూ తిన్నది నా డబ్బుకాదూ ! తే - ఆ గొలుసుతే.'

'ఏంవండీ. ఇలా అన్యాయంగా మాట్లాడతారేమండీ....నేనుమాత్రం మీ కోసం, మీ బాగుకోసం కాదూ చెపుతున్నది. ఈగొలుసొక్కటే యింక మనకి ఆధారం. నాకు పసుపు కుంకుమ కింద మావాళ్ళు రాసిచ్చిన ఎకరమూ మీరు అమ్మేస్తే యేమైనా అన్నానా? మీరు తాగుతారు. జూదమాడతారు. మీకు మంచీ చెడ్డా భార్యా కొడుకూ అన్న విచక్షణ పోయింది. ఈనరకంలో మగ్గిపోతూ ఉండాల్సిందేనా. మీకాళ్ళు పట్టుకుంటాను నామాట వినండి.'

ఛెళ్ళుమని చప్పుడు వినిపించింది గోపాలానికి. ఆవిడని మొగుడు కొడుతున్నాడు. గోపాలానికి జాలీ ఉద్రేకమూ కలిగాయి. దీనంగా మధురంగా గద్గదికంగా వున్న ఆమెగొంతు అతన్ని ఆకట్టింది.

'కొట్టండి, చంపండి. నాగొలుసుమాత్రం యివ్వను.'

'ఇవ్వవూ, ఇవ్వవుటే పింజారిముండా.' మళ్ళీ గుద్దినట్టు చప్పుడు. ఆమె ఏడుస్తోంది నిస్సహాయంగా. దీనంగా బాధగా ఆమె ఆక్రోశించింది. ఇద్దరూ పెనగులాడుతూన్న ధ్వని వినపడింది గోపాలానికి.

'వొదలండి. నన్నొదలండి. అమ్మో.'

గోపాలం పిడికిళ్లు బిగించాడు. అతని కళ్ళలో ఎర్రజీర కదలింది.

'పీక పిసికి తీసుకెళతాను గొలుసు ఇలా పడెయ్యి.'

'ఎందుకివ్వాలి మీకు. జూదంలో తగ లెయ్యడానికా' ఆమె వెక్కి- వెక్కి- ఏడుస్తూనే మాట్లాడుతోంది. 'పిల్లాడికి దగ్గు మందైనా తీసుకురాలేదు. ఒక్క మంచి చీరలేదు: కట్టుకున్న పెళ్లాం చచ్చిందో బతికిందో చూడరు. ఇంక వీధులమ్మట ముష్టెత్తుకుని బతకాలి నేను.'

'ఈ వేలెడు వెధవకోసం నాకివ్వవన్న మాట. ఆగు, వీడిని చంపేస్తాను. వీడి పీక నులిమేస్తాను.'

'అయ్యో అయ్యో వాణ్ణి ఏం చెయ్యకండి. అయ్యో అయ్యో' ఆవిడ పెద్ద పెట్టున కేకలు. పిల్లవాడు కెవ్వుమనిఏడుపు.

గోపాలం యింక ఆగలేకపోయాడు. కుర్రవాణ్ని పీక నులిమి చంపివేస్తున్న దృశ్యం అతని కళ్ళముందు కదలింది. బలమంతా ఉపయోగించి తలుపు తన్నాడు. రాలేదు. తిరిగి దడదడా తన్నాడు. తలుపులు విచ్చుకున్నాయి. ఆమె కుర్రవాణ్ని ఎత్తుకుని గోడమూలగా నక్కివుంది. వణికి పోతూ వుంది.

'బాబు నేమీ చెయ్యకండి. వొదలండి. ఇదిగో గొలుసు' అంటూ మీదకి రాక్షసుడిలా వొంగిన అతనికి గొలుసు యిస్తోంది. మొగుడు గొలుసు తీసుకుని వెనక్కి తిరిగాడు. ఎదురుగా గోపాలం.







'ఎవడవురా నువ్వు' అన్నాడు మొగుడు.

గోపాలం బలంగా అతని దవడమీద ఒకటి వేశాడు. మొగుడు తూలి పడబోయాడు. గోపాలం యీసారి మీది కురికి అతని తలవంచి బలంగా గుద్దాడు. అతను కిందపడ్డాడు.

'ఆడకూతుర్ని కొడతావా ? ఆ గొలుసు కాజెయ్యాలని చూస్తావా ? దొంగవెధవా. సిగ్గులేదురానీకు. బుద్ధిలేదురా.ఏది ఆగొలుసు యిలా ఇయ్యి. లేవకు. లేచావంటే చంపేస్తాను.'

గోపాలం అతని చేతిలోంచి గొలుసు లాక్కున్నాడు. అతను కిందపడి వగరుస్తున్నాడు. రొప్పుతున్నాడు. ఆమె యీ హఠాత్పరిణామం అర్థంకాక నిశ్చేష్టురాలై గోడకి బల్లిలా అంటుకుని కళ్ళప్పగించిచూస్తోంది.

'తాగుడూ జూదమూ నష్టానీకు. చదువుకున్నోడివి. ఉద్యోగం చేసి పెళ్లాం పిల్లల్ని పోషించాల్సింది. పైగా పెళ్లాం నగలే ఎత్తుకుపోతావట్రా దొంగనాయాల....'

నేలను కరచుకున్నా మొగుడు అస్పష్టంగా బూతులు తిరుతున్నాడు. గోపాలం డొక్కలో ఒకటి తన్ని 'నోర్ముయ్యి' అన్నాడు. ఆమె 'వద్దు వద్దు.కొట్టకు' అని అరచింది.

గోపాలం చేతిలో గొలుసుతో గోడవారనున్న ఆమెను సమీపించాడు. ఆమె సన్నగా ఎర్రగా నాజూకుగావుంది. జుట్టంతా రేగిపోయివుంది. చెక్కిళ్లు కన్నీళ్ళతో తడిసిపోయివున్నాయి. పాతికేళ్ళయినా వుండవు. ఆమె కళ్ళలో భయాశ్చర్యాలు పెనవేసుకున్నాయి. చంకలో పిల్లవాడు ఏడుస్తున్నాడు.

'ఇదిగోనమ్మా గొలుసు' అంటూ ఆమె చేతికి గొలుసు యిచ్చాడు గోపాలం. కింద దొర్లుతూన్న మొగుడు లేవబోయాడు. గోపాలం మొలనుండి కత్తి తీశాడు.

'ఇదేఁవిటో తెలుసా ! లేవటానికి ప్రయత్నించావా పొడిచేస్తాను కబడ్దార్. దెబ్బకి యెగిరిపోతావు.'

మొగుడు దండం పెట్టాడు.

'నువ్వు మళ్ళీ ఎప్పుడేనా గొలుసు తీసుకున్నట్టు కాని. ఆవిడ వొంటిమీద దెబ్బ పడినట్టుగాని తెలిసిందా నీప్రాణం తీసేస్తాను' గోపాలం కత్తిని అతని ముఖానికి దగ్గరగా పెట్టి ఝళిపించాడు.

మొగుడు తలవూపాడు యింకెప్పుడూ చెయ్యనన్నట్టుగా.


గోపాలం ఆమెవైపు తిరిగాడు. 'ఏం భయంలేదు. ధైర్యంగా వుండమ్మా' అన్నాడు.

ఆమె భయంతో కృతజ్ఞతతో తలవూపింది.


గోపాలం కత్తి మొలలో పెట్టుకునివెళ్ళిపోబోయాడు. ఆమె హీనస్వరంతో అడిగింది. 'ఎవ్వరు బాబూ నువ్వు....'

'నేనా....నేనా' తెల్లబోయాడు గోపాలం. 'నన్ను గోపాలం అంటారులెండి. అంతే.' అంటూ గోపాలం తలెత్తకుండా వడివడిగా పెరట్లోకి చీకట్లోకి నడిచి వెళ్ళిపోయాడు.

□□□



# కూనలమ్మ పదాలు
## ఆరుద్ర




ఆలు మగల లడాయి
అంతమొందిన రేయి
అనుపమానపు హాయి
ఓ కూనలమ్మా.

బ్రూటుకేసిన వోటు
బురదలో గిరవాటు
కడకు తెచ్చును చేటు
ఓ కూనలమ్మా!



కోర్టుకెక్కిన వాడు
కొండ నెక్కిన వాడు
వడివడిగ దిగిరాడు
ఓ కూనలమ్మా!

పరుల తెగడుటవల్ల
బలిమి పొగడుటవల్ల
కీర్తి వచ్చుట కల్ల
ఓ కూనలమ్మా!




కోపాగ్నులకు వృద్ధి
కుత్సితాలకు రద్ది
లేమి చంపును బుద్ధి
ఓ కూనలమ్మా!




అతివపలుకే చాలు
అందు వేనకువేలు
మొలచు నానార్థాలు
ఓ కూనలమ్మా!

మరియొకరి చెడుతేది
మనకు నేడు ఉగాది
పంచాంగమొక సోది
ఓ కూనలమ్మా!

జనులు గొర్రెలమంద
జగతి వేసెడు నింద
జమకట్టు స్తుతి క్రింద
ఓ కూనలమ్మా!




ఉడుకు రచనలయందు
ఎడద మెదడుల విందు
లేదు గోవిందు
ఓ కూనలమ్మా!



ఇరుకు కార్యాపుగదులు
ఇరుల గోడల బదులు
మేలు వెన్నెల పొదలు
ఓ కూనలమ్మా!

# రుమాలు

నికొండ హనుమంతరావు



మధ్యాహ్నం భోజనం చేసి నాలుగు గంటలు గాఢనిద్ర పోయి లేచి, బడలిక అంతా మాయమయేటట్లు సువాసనలు విరజిమ్మే సబ్బుతో హాయిగా స్నానం చేసి సింగారించుకొని పెళ్ళి కొడుకల్లే తయారయ్యాడు సాంబమూర్తి.

వయస్సునలభైరెండుదాటినాఅక్కడక్కడ వెండి తీగెల్లాటి వెంట్రుకలు మొలుస్తూన్నా, మనసుమాత్రం యింకా నవయవ్వనంలోనే ఉండటం ఒక్కొక్కప్పుడు అదృష్టమనిపించినా, ఈ యవ్వనపు కోర్కెలు తీరా విడుదలయే మార్గాలు నియమితంగా ఉంటూండటంవల్ల దురదృష్టమే అనిపిస్తూ ఉంటుంది సాంబమూర్తికి.

పదేళ్ళక్రితం భార్య చనిపోయాక మళ్ళీ పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యమే రాలేదు. కావల్సినంత సంపాయించుకున్నాడు. గట్టి లాయరనే పేరు ప్రఖ్యాతులున్నవి. వృత్తి రీత్యాకూడా తగినంత ఇంటరెస్ట్ లేదు. ఈ సంపాయించింది ప్రజాసేవ చేసే ఏసంస్థకో దానం చేయాలని ఏనాడో నిశ్చయించుకున్నాడు. ఒంటరి జీవితం ఒకొకప్పుడు బాధగా ఉన్నా, యితరుల ప్రస్తావన







లేకుండా ఆ పడే బాధేదో తానొక్కడే పడే అవకాశం వున్నందుకు సంతోషమూ కలుగుతూ వుండేది.

తేలిగ్గా, సూక్ష్మంగా, పరిష్కరించుకునే సమస్యల నెన్నిటినో మానవుడు క్లిష్టతమం చేసుకొని నానా హైరానాపడటం ఆయన వృత్తిరీత్యా నిత్యా చూస్తూనే వున్నాడు. స్వల్ప విషయాలతో మానవుడు బుర్ర బద్దలు కొట్టుకుంటూనే వున్నాడు. ఇలాటి వాళ్ళను చూసి ఒకపక్క జాలి కలిగినా మరోవైపున వారి మౌఢ్యానికి వారు అనుభవించే బాధ తగిన వెలేనని అనుకుంటూ వుంటాడు. జీవితాన్ని 'రిసెర్చ్ స్కాలర్' వలె స్టడీ చేస్తూ వుండటం అలవాటైంది.


వారానికి ఒకరోజు సెలవుగా వచ్చి పడే యీ ఆదివారాన్ని దివ్యానుభవం పొందేందుకు కేటాయించాడు. ముఖ్యంగా ఈరోజు రాత్రిమాత్రమే పదేళ్ళక్రితం వరకూ తాను అనుభవించిన సంసార సౌఖ్యాన్ని అనుభవ పూర్వకంగా జ్ఞాపకం చేసుకుంటూవుంటాడు. ఈ అనుభవాన్ని తనకు ప్రసాదించేందుకు ఈ మహాపట్టణంలో అనేకులు వున్నా, తన అభిరుచులకు అనుగుణంగా వుండే యువతిని ఎన్నిక చేసుకోవటంలో సాంబమూర్తి అనుభవజ్ఞుడని రుజువు చేసుకున్నాడు.

ఐతే అనుకున్నది అనుకున్నట్లు జీవితంలో జరగకపోవటం కొత్తవిషయమేం కాదు. అనేక అవాంతరాలూ, మార్పులూ వచ్చి పడుతూనేవుంటవి. కొన్నిటిని తప్పించుకున్నా, మరికొన్ని బాధపెడుతూనే ఉంటవి.

ఇవాళరాత్రి ఏడున్నరకే వస్తానని వాగ్దానం చేసిన సుశీల - పదకొండింటికి ఫోన్‌చేసి రాత్రి తొమ్మిదింటిదాకా తనకు డ్యూటీ వున్నదనీ, పదిగంటల లోపుగా వస్తాననీ చెప్పింది. ఇది చిన్న ఆవాంతరమే ఐనా ఆతృతతో వేగిపోయే తనను వేధిస్తూనే వున్నది.

రాత్రి పదింటిదాకా గడపటమెలా? బైటికి వెళ్ళబుద్ధికాలేదు. బంగళా తోటలో





పడక కుర్చీలో పడుకొని కాస్సేపు ప్రకృతి సౌందర్యాన్నితిలకించాడు; ఐతే యిదికూడా 'బోర్' అనిపిస్తోంది.

ఎవరైనా - ఏ నవయవ్వనవతైనా వచ్చి కాస్సేపు కులాసాగా మాట్లాడితే బాగుండుననిపించింది. పని కట్టుకొని తనకోసం వచ్చేవారెవరు?

బంగళాకు కాపలాగావున్న ఘూర్ఖా వచ్చి సలాంచేసి, "తమతో మాట్లాడాలని ఎవరో ఒకామె వచ్చింది సార్!" అన్నాడు.

ఒక్కొక్కప్పుడు అనుకున్నట్లే జరుగుతుంటుంది! ఐతే యీ వచ్చినామె తన ఊహాసుందరికి దరిదాపుల్లోకూడా వుండి వుండకపోవచ్చు. ఏమైనా వున్నంతలోనే తృప్తిపడే తత్వం తనది కనుక బాధేమీ లేదు.

"సరే - యిక్కడికే తీసుకొనిరా -"

ఘూర్ఖా వెళ్ళిపోయాడు. అ రాబోయే ఆమెకోసం సాంబమూర్తి యెదురుతెన్నులు చూడసాగాడు.

మలుపులో మెరుపు మెరిసినట్లయింది. తీవ్రంగా చూడటం సంస్కారానికి విరుద్ధమని తెలిసినప్పటికీ, ఆమె మీద నుంచి సాంబమూర్తి తన కళ్ళను మరల్చలేకపోయ్యాడు.

ఇరవై, ఇరవైరెండేళ్ళవయస్సుంటుంది; నిగనిగలాడే బంగారురంగు శరీరచ్ఛాయ; సన్నగా, పొడుగ్గా ఉత్సాహం తొణికిసలాడుతూ, నడకలో వయ్యారం, హుందాతనం వెల్లివిరుస్తోంది. తీర్చిదిద్దినట్లున్న కనుముక్కుతీరు; బాగా చదువు సంస్కారాలున్నట్లుతెలియజెప్పే కాంతివంతమైనకళ్ళు, దేవత్వమున్న వ్యక్తి శాపకారణంగా భూమిమీద అవతరించిందా అనిపిస్తోంది. చేతిలో హాండ్‌బ్యాగ్‌ను మెల్లిగా ఊపుకుంటూ వినపడని సంగీతానికి, అడుగులు తాళంవేస్తున్న

విధంగా తనవైపు వస్తోంది. నీలంరంగు శాటిన్ షావడామీద నీలంరంగు సిల్కు చీరె. నీలం జాకెట్టూ. మెడలోని సన్నని గోవర్ధనపు గొలుసు రొమ్ములమీద నాట్యమాడుతూండగా చిరునవ్వులు చిలకరించుకుంటూ. సుఖసౌఖ్యాలు తనహక్కు భుక్తాలనే ధోరణిని వ్యక్తపరుస్తూన్నది. ఇంత అందమైన చందనపు బొమ్మలాటి కొమ్మకు కోర్టులతోనూ. లాయర్లతోనూ. పనేమిటో!

సాంబమూర్తి ఆలోచనలు పూర్తికాకముందే ఆమె ఆయన ముందున్నది. చప్పున తెలివితెచ్చుకొని పక్కనున్న సిమెంట్ కుర్చీని చూపాడాయన. ఆమె వయ్యారంగా కూర్చొని సాంబమూర్తివైపు చూసింది.

"చెప్పండి -" అన్నాడు సాంబమూర్తి వ్యాపార ధోరణిలో.

"నాకు విడాకులు కావాలి -" అన్నదామె అదే ధోరణిలో.

సాంబమూర్తి ఒక్కక్షణం నివ్వెరపోయాడు; మరు క్షణంలో ఆయనదృష్టి ఆమె రొమ్ములమీద వాలింది. మెడలోవున్న పసుపుతాడు సన్నటిది జాకెట్‌లోకి మాయమవటం గమనించాడు. ఇంతటి అందంగల ఆడదాన్ని బాధించిన ఆ భర్తగాడిమీద ఆయనకు కోపం వచ్చింది. ఈమెకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకోనిదే యేమీ నిర్ణయించలేడు. అన్నిటికన్నా ఆమె సిగ్గుపడకుండానే- కాలయాపన లేకుండా జంకూ. గొంకూ లేకుండా తనకు కావలసిందేమిటో సూటిగా చెప్పటాన్ని సాంబమూర్తి మెచ్చుకొని. ఆమెపట్ల యేర్పడిన అభిమానానికి మరోమార్కు కలిపాడు.

ఇలాటి చిత్రమైన కేసు (?) తనకు కొత్తే ఐనప్పటికీ దీని అంతేమో చూడాలనిపించింది: ఈమెను కొంచెం ఏడిపించి. సరదాగా కాలక్షేపం చేయాలనికూడా అనిపించింది - సాంబమూర్తికి.

"కారణాలు కావాలి. మీ భర్త నపుంసకుడా?"

సూటిగా అడిగిన యీప్రశ్న కోర్టులో క్రాస్‌ఎగ్జామినేషన్‌లో అవతలి క్లయింట్‌ను చికాకు పెట్టేందుకు ప్రయోగించేది: అలాటిదాన్ని ఆమెమీద - తన క్లయింట్‌మీద. మొట్టమొదటే విసిరిపారేశాడు సాంబమూర్తి!

"ఉహూ(." అన్నదామె సూటిగా సాంబమూర్తిని చూస్తూ.

"ఐతే చిన్నతనంలోనే - వివాహబుద్ధి తెలియక పూర్వమే యీపెళ్ళి ఐందా?"

"కాదు -"

"మీ ఆయన రోగిష్టా? నేరస్థుడా? మిమ్ము అనవసరంగా శారీరకంగా కానీ. మానసికంగా కానీ క్షోభ పెడుతున్నాడా?"

విడాకులు కోరదగిన కారణాలను ఊహించి ఒక్కసారే ప్రశ్నలవర్షం కురిపించాడు సాంబమూర్తి.

"అవేవీ కావండీ! .... మీరు అసలు కథ వినాలి—" అన్నదామె.

దాంతో సాంబమూర్తి చిలిపి ప్రశ్నలకు అవకాశం లేకుండా పోయింది. ఏమైతేనేం- ఆమె చెప్పబొయ్యే కథ ఎంటర్‌టైనింగ్‌గా వుండగలదని తోచింది.

"కానీండి .... చెప్పండి!" అన్నాడు సాంబమూర్తి పడకకుర్చీలో సుఖంగా వెనక్కు వాలి.

"ఇప్పుడు నావయస్సు 21 సంవత్సరాలు. మూడేళ్ళక్రితం నాకు ప్రభాకరోతో పెళ్ళయింది—"

'మిసి మిసి యవ్వనంలో 'మిస్' చెర విడిపించుకొని బైటపడ్డావన్నమాట!' అనుకున్నాడు సాంబమూర్తి.



"మే మిద్దర్మమూ కాలేజీలో చదువుకుంటూన్నప్పుడే ప్రేమించి పెళ్ళిచేసుకున్నాం!" అన్నదామె.

'మరింకేం? ఏమైనా పొరపాటు పడివుంటే మేజర్‌గా వున్నప్పుడు జరిగింది కనుక బాధ్యత నీదే అవుతుందే!' అనుకున్నాడు సాంబమూర్తి.

"ఆర్థికసంబంధమైన సమస్య లేమన్నా వున్నయ్యా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ఆయన మరీ అంతలేనివాడేం కాదు. ఏటా నాలుగువేల ఆదాయం వున్న ఆస్తి వున్నది. తల్లిలేదు - తండ్రిమాత్రం బతికే వున్నాడు. ఒక్కడే కొడుకు—"

'ఇంత హాయిగా వుండే కుటుంబ వాతావరణం యీమెకు యెందుకు సరిపడలేదా?' అని ఆలోచిస్తున్నాడు సాంబమూర్తి.

"ఆయనకు ఇంగ్లండ్‌లో ఉద్యోగం—"

"ఏం ఉద్యోగం - జీతం యెంత?" అన్నాడు సాంబమూర్తి.

"చెబుతున్నాగా! బి. బి. సి. లో ఎనౌన్సర్. జీతం నెలకు నూటఇరవై పౌనులు, అంటే దాదాపు 1800 రూపాయలు. నెలనెలా ఆయన నాకు ఏడొందలయాభై దాకా పంపుతుంటారు!"

'ఇంకేం రోగం?' అనుకున్నాడు సాంబమూర్తి.

"ఆర్థికమైన యిబ్బందులేమీ లేవనుకోండి" అని నసిగిందామె.

"అక్కడ మీ ఆయన కేమైనా ప్రియురాలు ఉన్నదా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ఆయన అలాటివారు కారు!"

'మరి అలాటి అనుమానానికూడా ఆస్కారం లేకుంటే యింకొక కారణం - తాను ఊహించేందుకు గుంజుకుంటూన్నది ఏమై వుండునో?' అని ఆలోచిస్తున్నాడు సాంబమూర్తి.

"మీరుకూడా ఇంగ్లండ్ వెళ్ళివుండేందుకు యిబ్బందులేమిటి? మామగారైన ముసలాయనా?" అని అడిగాడు సాంబమూర్తి.

"ముసలాయన గొడవ మా ఎవరికీ పట్టదు. ఆయన ఆయన చెల్లెలిగారింట్లో వుంటారు. నెలకు 200 రూపాయలు పెన్షన్ వస్తుంది. దాంతో ఆయనసుఖంగావున్నారు."

"ఇంకేం - మరి యిబ్బందేమిటీ?"

"నాకు పాస్‌పోర్ట్ తీసి యునైటెడ్ కింగ్‌డమ్‌లో వుండేందుకు యేర్పాటుకూడా చేశారాయన. అక్కడ ఆయన స్నేహితులు నాకు ఉద్యోగం కూడా ఇప్పిస్తామని గట్టిగా చెప్పారట!"

"ఇంతకన్నమంచి ఆర్థికసౌభాగ్యమున్న దేశంకదా! వెళ్ళి హాయిగా ఉండవచ్చునే!" అన్నాడు సాంబమూర్తి.

"ఏమో స్వదేశం వొదలి వెళ్ళటం నాకు ఇష్టంలేదు." ●

"అదేవిధంగా మీ ఆయనకు ఇంగ్లండ్ వొదలి రావటం ఇష్టంలేదా?"

"మొత్తం నాలుగేళ్ళ కాంట్రాక్టు ఉద్యోగం అది. మరోరెండు సంవత్సరాలు ఉంది. బహుశా తరువాతకూడా యీ ఉద్యోగం కంటిన్యూ అవుతుంది. ఆ తర్వాతి సంగతి ఏలా ఉన్నా యీ రెండేళ్ళు ఎలాగో గడిపి

---

● మూడేళ్ళ కొడుకుతో తల్లి: "మా నాయనగా, మంచివాడివి, కాస్త నీ నాలిక చూపించు. డాక్టరుగారు నీ నోట్లోంచి వేలు తీసుకుంటార్ట"

ఇండియాకు వస్తానని తెలియ పరిచారాయన!"

"మరి ఇంతలోనే మీ రెండుకు కొందర వద్దారు?" అన్నాడు సాంబమూర్తి.

"ఆయన పరంగా మీరు అడిగిన ప్రశ్నలు నా పరంగా మీ రెండుకు అడగ లేదు?" అన్నదామె.

సాంబమూర్తి నిర్ఘాంత పొయ్యాడు. తననే క్రాస్ ఎగ్జామిన్ చేయగల సామర్థ్యమున్న యీమెను చూసి తాను ఊహించిన దానికన్న తెలివిగల ఘటమని అర్థం చేసుకున్నాడు. ఏ ప్రశ్నలైతే తాను అడిగి ఆమెను నొప్పించటమెందుకని ఊరుకున్నాడో, ఆ విషయంలోనే ఆమె ఒక సవాల్ విసిరింది. లేక ఆ క్లిష్టమైన విభాగాలనన్నా తాను గ్రహించగలడోలేదో నని ఒక పరీక్ష పెట్టిందా? ఏమైనప్పటికీ కొద్ది క్షణాల్లోనే సాంబమూర్తితలలో ఆ ప్రశ్నలు మెరుపుల వలె మెరిసినవి.

"బహుశా మీ వివాహమైన మరుసటి సంవత్సరంలోనే ఆయన ఇంగ్లండ్ వెళ్ళి ఉంటాడు. ఆయన వెళ్ళటం మీకు ఇష్టమై ఉండదు; మరోవైపున ఆయన సంపాదనను గూర్చి ఉభయులూ ఆశపడి ఉండాలి. లేదా ఆయన పరదేశానికి వెళ్లాక ఒంటరి తనం మీకు భరించరానిదై ఉండాలి!"

ఆమె చిరునవ్వు నవ్వింది.

"ఆ వయస్సులో దీర్ఘకాల వియోగంతో మీరు యమబాధ పడి ఉండాలి. మరో మార్గం లేక మీరొక ప్రియుడ్నికూడా సంపాయించి ఉండాలి" అని ఆమె వైపుచూశాడు సాంబమూర్తి.

"మీ గ్రాహ్యశక్తికి జోహారులు!" అన్నదామె తళతళలాడే చూపులతో.

"మీ కేమైనా సంతానమా?"



గురిచూసి వేసిన ప్రశ్నలా భావించిందామె.

"ఒక కూతురు. సంవత్సరం నిండింది."

"ఇప్పుడు యీ సంతాన ప్రతి బంధకం కూడానా?"

"అదీ అంత పెద్ద సమస్యే కాదు. కావాలంటే అమ్మాయి ఆయన దగ్గిరే పెరుగుతుంది. ఆర్థికమైన క్లిష్టసమస్యలూ లేవు.."

"మరొక భర్తను ఎన్నిక చేసుకొనే ఉంచావన్నమాట!" ఇంతవరకూ వచ్చాక యీమెను ఏకవచనంలోనే సంబోధించటం సమంజసమని సాంబమూర్తి నిశ్చయించుకున్నాడు.

ఆమెకు ఆ భేదం తెలియలేదు: లేక తెలిసినా లక్ష్యపెట్టలేదేమో?

"బాగా దూరం ఆలోచించుకున్నావా?"

"ఆఁ. జీవితంలో మార్పు కావాలి. వెరైటీ లేని జీవితం నిస్సారం. చాలాసేపు ఏవ్యక్తీ తనను తానే భరించలేడు. అందుకనే జైలు జీవితం దుర్భరమనిపించేది. అందునా యవ్వనాన్ని దాచుకొని ప్రయోజనంలేదు: అది ఆ వ్యక్తినీ తదితరుల్నీ కూడా బాధిస్తుంది: అలాగే మురిగి. కుళ్ళి నాశనమౌతుంది. దాన్ని పంచుకుంటూ యీ భూమి మీద అనుభవించ దగినదంతా అనుభవించటం నా ఆశయం!"

"వేశ్య చెప్పవలసిన వాదమిది!" అనుకున్నాడు సాంబమూర్తి. ఆమె ఆశయమేమిటో ఆయనకు బాగా అర్థమైంది. ఏం చెపితే బాగుంటుందో, ఆయన ఇంకా తేల్చుకోలేదు.

"ఇదేమంత క్లిష్టమైన కేసుకూడా కాదు. మా ఆయనకు అంతా తెలిసింది." అన్నదామె.



"ఆయన నీకు విడాకులివ్వక మునుపే ఆ గౌరవాన్ని నీవు దక్కించుకుంటే బాగుంటుందనా?"

"ఊహుఁ. విడాకులు కోరే పక్షంలో ఆయన కంటెస్ట్ చేయనని రాశారు. ఎక్స్ పార్టీ డిక్రీ అవుతుంది. లేదా కోర్టువారికి ఆయన తన అంగీకారాన్ని తెలియ పరుస్తారు. ఎక్కువగా శ్రమ పడనవసరం లేదు."

ఫీజు విషయమై ఆమె ఆందోళన పడుతోందా అనే సందేహం కలిగింది సాంబమూర్తికి. బహుశా అదై వుండదు. ఇలాటి కేసును చాలా తక్కువ ఫీజుకు తీసుకొనే జూనియర్స్ కోకొల్లలుగావున్నారు. ఎక్కువ రభసలేకుండా తేలిగ్గా తెలివిగా పనిపూర్తి చేసుకునేందుకే ఆమె తనదగ్గిరికి వచ్చిందని అనుకున్నాడు సాంబమూర్తి.

"ఈ కోర్టులూ మిగతా ఫార్మాలిటీస్ మటుకు చూస్తే సరిపోతుంది" అని ఆమె తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

"తరువాత భర్త సిద్ధంగావున్నాడా?"

"ఆఁ." అందామె. నిస్సంకోచంగా.

"మీ ఆయన రాసిన ఉత్తరాలేమన్నా వుంటే యివ్వు."

"ఇవిగో - ముఖ్యమైన నాలుగు ఉత్తరాలూ—" అని ఆమె హ్యాండ్‌బాగ్‌లోంచి గళ్ళ సిల్కురుమాలులో కట్టబడిన చిన్న కట్టను సాంబమూర్తికి అందించింద. రుమాలు మీదినుంచి సెంటువాసనల ఘుమ ఘుమలు గుబాళించినవి.

"సరే-రేపు సాయంత్రం ఐదు గంటలకు యిక్కడకు రా. వొచ్చేటప్పుడు నీవు వివాహ మాడదలుచుకున్న ఆ 'భర్త'ను కూడా వెంట తీసుకొని రా. నా క్లయింట్‌గా నీకు ఎలాటి కష్టమూ, నష్టమూ కలగకుండా చూడవలసిన బాధ్యత నా కున్నదిగదా! విషయాలన్నీ ముగ్గురమూ కూర్చొని మాట్లాడుకోవటం మంచిది"

"తమ ఫీజు?"

"ఇప్పుడేం అవసరంలేదు. ఆ సంగతి కూడా రేపు సాయంత్రం చెప్తాను—"

ఆమెలేచి సుతారంగా 'టా - టా' చెప్పినట్లుగా కుడిచేయి పైకెత్తి వయ్యారంగా నడిచి వెళ్ళింది. సాంబమూర్తి రుమాలుమీది సువాసనల్ని ఆఘ్రాణిస్తూ ఆమె వెళ్ళే వైపు చూడసాగాడు.

## 2

రకరకాల ఆలోచనలు సాంబమూర్తిని చుట్టుముట్టినవి. ఈ వచ్చి వెళ్ళిన విచిత్ర వనిత మనస్తత్వం ఆయనకు అంతుబట్ట లేదు. పేరేమిటో, చిరునామా ఏమిటో కూడా తను అడగలేదు. ఆమె యిచ్చిన ఉత్తరాలద్వారా యీ విషయాలు తెలుసుకునే అవకాశం వున్నది. వృత్తిరీత్యా కాకపోయినా ఈవిచిత్రవ్యక్తిత్వాన్ని తెలుసుకోవాలనే కుతూహలం సాంబమూర్తిలో ప్రబలింది.

సత్కాలక్షేపానికి చేతులోవున్న ఉత్తరాలకట్ట వుండనే వున్నది. బంగళాలోకి వెళ్ళి భోజనంచేసి సుఖంగా పడుకొని ఉత్త

---

● జడ్జి : "ఏమయ్యా, నమ్మిన వాళ్ళని ఇలా మోసం చెయ్యటా?"
ముద్దాయి : "నమ్మని వాళ్ళని మోసం చెయ్యడం ఎలాగండి?"

రాలు చదవసాగాడు - సాంబమూర్తి. సుశీల వచ్చేందుకు మరో గంటన్నర పడు తుంది ! ఈలోగా యిదో కాలక్షేపం !

ఆగంతుకురాలు చాలా తెలివిగలదని తాను నిర్ణయించుకున్నాడు. ఆమెతనకిచ్చిన ఉత్తరాలలో ఆ తెలివి కనిపిస్తూనేవున్నది. అనవసరపు కాలయాపన జరగకుండా, తాను చికాకు పడకుండా-ఎంతవరకూ అవసరమో అంతవరకే ఉత్తరాలు యివ్వబడినవి. పోతే తన బంగళాకు దాపులోనే ఆమె నివాసం; అందుకనే తన దగ్గిరికి వచ్చిందీ కేసు !

మొదటి ఉత్తరంలో ఇలా వుంది:

లండన్.
6—1—1959.

డియర్ రేవతీ !

నీవూ, అమ్మాయీ కులాసాగానేవున్నా రనుకుంటాను. ఇక్కడ చలి విపరీతం. మరో రెండేళ్ళు ఎలాగో ఓపిక పడితే సుఖంగా జీవనం గడిపేందుకు సరిపడే ధనసంపాదన పూర్తవుతుంది. నీవుసహ కరిస్తావనే ఆశకూడా వున్నది.

నా స్నేహితులు కొంతమంది ద్వారా చిత్రవిచిత్రమైన వార్తలు వింటున్నాను. వాటిని నమ్మేముందు నీ జవాబుకూడా తెలుసుకోవటంఉచితమనిభావిస్తున్నాను.

బాధ్యతారహితంగా,ముక్కు మొహము ఎరుగని మొగాళ్ళతో తిరుగుతున్నావని తెలుస్తోంది. నీకంతగాకాలక్షేపంలేకుంటే నీ స్నేహితురాండ్రున్నారు కదా; లేదా లేడీస్‌క్లబ్‌లు ఉన్నవి. ఆదీకాదంటావా-లోగడ ఉద్యోగంచేయాలనే కోర్కెను వెలిబుచ్చావు. నా స్నేహితులకు రాసి ఏదైనా ఉద్యోగం చూడమంటావా ?

చాలా ఆధారపడ దగిన తావులనుంచి నాకీ ఉత్తరాలు వస్తున్నవి. నీ శీలాన్ని శంకించటంలేదు. అయితే సమాజాన్ని కూడా మనం గమనించవలసి ఉన్నది. కేవలం ఎవరి ఇష్టానుసారంగా వారు ప్రవర్తిస్తేసామాజిక శాంతి - ముందుగా కుటుంబ శాంతి నాశనమౌతుంది. చదువు కున్నదానివీ,తెలివిగల దానివీ - నీకువివ రించి వ్రాయనవసరం లేదనుకుంటాను. మించిపోయింది లేకుంటే ఇప్పటికైనా కుటుంబ క్షేమ దృష్ట్యా వాంఛనీయమని జాగ్రత్తపడటం భావిస్తాను.

విశేషాలతో వెంటనేజవాబురాయి. ఈ కవరులో 50 పౌనులకు డ్రాఫ్ట్ పంపు తున్నాను. సుమారు రు 700 వస్తుంది. సాధ్యమైనంతవరకూ ఖర్చులు తగ్గించు. అమ్మాయికి ఏరోటూ రానీకు.

నీ
— ప్రభాకర్.

ఈ ఉత్తరానికి ఏధోరణిలో రేవతి జవాబు రాసి ఉంటుందో, ఆమె ఇచ్చిన రెండో ఉత్తరంలో తేటతెల్లమౌతున్నది.


లండన్.
19—1—1959.

డియర్ రేవతీ !

నేనిక్కడ కులాసాగానే వున్నాను. నీవూ అమ్మాయీ క్షేమమని తలుస్తాను.

నేను ఆశించిన విధంగా గాక సరిగ్గా అందుకువిరుద్ధంగావున్న ఉత్తరం,నీదగ్గి ర్నుంచి వస్తుందని నేను కలలోకూడా తలచలేదు. నీస్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగకరంగావుండే విధంగా నే నెన్నడూ ప్రవర్తించలేదు;అలాటిధోరణి నీకుతోచి నందుకు విచారిస్తున్నాను. నీ ఇష్టాను సారంగా తిరిగేందుకు నానుంచి యేలాటి అనుమతీ అవసరంలేదన్నావు. ఇదివరకు అంటే మన వివాహానికి పూర్వంవలె






విచ్చల విడిగా తిరుగులాడే అవకాశాలు లేవనే నేనుతలపోస్తున్నాను. ముఖ్యంగా మన యిద్దరి జీవితాలూ మరొక చిన్న ప్రాణితో లంకెపడి వున్నవి.

కేవలం నా స్వార్థాన్నే నేను చూసుకో లేదు. కుటుంబక్షేమమే నాలక్ష్యమనినీకు తెలుసు. నిన్ను విడిచివుండటం నాకెంత బాధాకరమో వేరుగా చెప్పనవసరంలేదు. ఐతే కొన్ని సుఖాలను పొందేందుకు మరి కొన్నిటిని బలిపెట్టవలసే వుంటుందికదా!

యవ్వనం ప్రశాంతిని యిచ్చేదీకాదు; దాచుకుంటూంటేఉండేదికాదు. అనుభవిం చినా, అనుభవించక పోయినా కాలగమ నంలో హరించుకొనిపోతుంది.అందుకని దాన్ని దుర్వినియోగం చేయటం మాత్రం ఏం సబబు ? దాహమైనదని మురికినీళ్ళు తాగుతామా? ఇప్పటికైనామించిపోయింది లేదనే నేను తలుస్తున్నాను.

కోర్కెలు వుండటం సహజమే ! ఆ కోర్కెల్ని తీర్చుకోవటమూ సహజమే;

ఐతే ఇందుకుగాను అనుసరించే విధానాలు మనసంస్కృతిమీదా, తెలివితేటలమీదా, విజ్ఞానంమీదా ఆధారపడి వుంటవి. ఒకా నొక వ్యక్తిని ఖూనీచేసినందువల్ల లక్ష రూపాయలు వస్తాయంటే-ఆపని చేయ గలమా ? కోర్కెలకు కేవలం దానివ కాకుండా, వాటిని సాధ్యమైనంతవరకూ అదుపాజ్ఞల్లో పెట్టుకోవడం సామాజిక శాంతిభద్రతలదృష్ట్యా, సౌశీ ల్యాన్ని కాపాడుకోవటం చూపదగిన ఓర్పుదృష్ట్యా ఎంతైయినా అవసరం. ఇది జరగనినాడు మనకూ కుక్కలకూ వుండే భేదం అత్యల్పం.

నీ మనసు కష్టపెట్టాలనే ఉద్దేశంతో నే నీ విధంగా వ్రాయలేదు. మరొకసారి ప్రశాంతంగా ఆలోచించగోరుతాను. పొర పాటునకాలుజారితేమనేదాన్ని నేను అర్థం చేసుకోగలను. కాని కావాలని. పరిస్థితు లను తనకు అనుకూలంగా రూపొందించు కొనే దురభిప్రాయంతో మాటిమాటికి

కాలు జారుకోవటమనేది - ఒక అలవాటు - ఆ తరువాత ఒక వ్యసనమౌతుందనే విషయం వేరుగా వివరించనవసరం లేదు.

ఈసారి ఉత్తరంలోనన్నా నన్ను అర్థం చేసుకొన్న ధోరణి కనిపిస్తుందని ఆశిస్తున్నాను.

నీ

— ప్రభాకర్.

గారాబంగా పెంచబడిన భాగ్యవంతుల బిడ్డ చెడుమార్గాలను అనుసరించినప్పుడు, తల్లిదండ్రులు మంచిగా యెంతచెప్పినా వాడి చెవికి ఎక్కని ధోరణిలో రేవతి జవాబు వ్రాసి వుంటుందనే విషయం అర్థమైంది. తాను వ్రాసిన ఉత్తరాల కాపీలు యివ్వకుండా, తన భర్త వ్రాసినవే యివ్వటంలో వున్న రహస్యంకూడా సాంబమూర్తి తెలుసుకోగలిగాడు. కేసు జరుగుతే ఎవరికి వారు తమకు మాత్రమే అనుకూలంగా వుండే విషయాలను ప్రమాణంచేసి చెపుతారు. ప్రతికూలంగా వుండే వాటిని విస్మరిస్తారు; లేదా అలా నటిస్తారు! ఐతే కనిపించకుండా రహస్యంగా వుంచబడిన భాగాలు యథాతథంగా బైటికి లాగగల సమర్థులైన లాయర్లు కోర్టులో వుంటారని ఆమె అనుకొని వుండదు!

మూడో ఉత్తరం చదివాడు సాంబమూర్తి.

లండన్.

6—2—1959.

డియర్ రేవతీ!

నే నిక్కడ కులాసాగానే వున్నాను. మీ క్షేమాన్ని నీ ఉత్తరంద్వారా తెలుసుకున్నాను.

ఈ ఉత్తరమన్నా నాకు మనశ్శాంతినిస్తుందని ఆశించాను. క్రితంసారి ఉత్తరంలో కన్నా దిగజారిపోయావనే విషయాన్ని యీ ఉత్తరం స్పష్టపరుస్తోంది. నేను విశదీకరించిన విషయాలు నీమనసు నెందుకు విరిచినవో తెలియటంలేదు.

మనమధ్య యేర్పడిన అభిప్రాయభేదాలు యింత త్వరితగతిని అంతులేని అఘాతాలను ఏర్పరుస్తవని నే నెన్నడూ అనుకోలేదు. కోరింది లభ్యంకానప్పుడు అంతకన్నా తక్కువది దొరుకుతే వదలలేని మానవ స్వభావం కూడా నాకు తెలుసు. ఏదో ఒక సిద్ధాంతానికి అనుగుణంగా జీవితాన్ని నడుపుకోవటం జరగాలా? లేదా మనప్రవర్తనను సమర్థించుకునేందుకు ఏదో ఒక సిద్ధాంతాన్ని యెత్తి చూపుకుంటామా? చెడుపనులని తెలిసివుండే, వాటిని చేసేవారందరూ తమకు తాము సమర్థించుకునేందుకు ఏదో ఒక సిద్ధాంతాన్ని, తమ ప్రవర్తనకు అనుకూలమైనదాన్ని ఏరుకుంటారు. ఇదే సిద్ధాంతరీత్యా యిక్కడ నేను కూడా నా ఇష్టానుసారంగా, నేను తృప్తిని ఆశించి, ఎవత్తెతోనో సుఖపడటాన్ని నీవు భరించగలవా?

పోనీ నీవుకూడా ఇక్కడికి వచ్చేందుకు గాను తగిన ఏర్పాట్లన్నీ చేస్తాను. రాకూడదా? అప్పుడీ సమస్యల పరిష్కారం సులభసాధ్యమౌతుందికదా!

రేవతీ! మనది 'ప్రేమపెళ్ళి' అని నీవు మరచిపోలేదనుకుంటాను. ఏరికోరి పెళ్ళాడిన వారి జీవితాలు కూడా ఇలా ఐతే సమాజంలో ఆదర్శంగా భావించబడుతూ, అభ్యుదయ భావాలుగా గుర్తించబడే ప్రణయంమీద ఎవరికైనా గౌరవం వుంటుందా? సనాతనాచారాలు ఒక్కసారిగా ఎదురు తిరిగి విజయనాదాలు చేయవా? ప్రేమించుకొని పెళ్ళి





చేసుకోవటమే ఉత్తమ మార్గమనేది మిథ్య అవుతుంది కదా! ఈవిషయాలు కూడా ఆలోచించు.

నీ ప్రవర్తన నాకు నచ్చకుంటే విడాకులున్నవనే విషయం జ్ఞాపకంచేశావు. మనం విడాకులు పొందినట్లయితే ఉభయుల వంశగౌరవము నేలపాలవుతుంది. అలా కాకుండా నీ ప్రస్తుత ధోరణిని మార్చుకోక పోయినా జరిగేదీ అదే! ఇలాంటి విషమ పరిస్థితుల్లో విడాకులే శరణ్యమనిపించేట్లు చేజేతులా చేసుకుంటున్నావు. అయితే మన అమ్మాయి సంగతేమిటి? నేనా పిల్లను వెనువెంటనే ఇంగ్లండ్‌కు తరలించి సాకటం కుదరదు కదా! చివరి ఆయుధంగా వున్న విడాకుల్ని నీవు త్వరపడి సందర్భశుద్ధి లేకుండా యిప్పుడే ప్రయోగించదలిచినట్లు భావిస్తున్నాను. నా ఊహలతో నీకు నిమిత్తం లేదనే ధోరణిని కనబరుస్తున్నావు కనుక వాటిని లెక్కచేయవనే అనుకుంటున్నాను.

మరొక్కసారి - బహుశా చివరిసారే కావచ్చు - ఆలోచించు. ఎవరో నీమీద మత్తుమందు చల్లినట్లుగాప్రవర్తిస్తున్నావు. తీవ్రమైన వాంఛలకు కళ్ళు బైర్లు కమ్మటంతో దానికి 'ప్రేమ' అనీ 'ప్రణయం' అనీ పేర్లుపెట్టి, అపవిత్రంగా భావించబడే ఆ పదాలవెనుక దాక్కోవాలని చూడటం కుటిల స్వభావమే అవుతుంది. నిన్ను నీవు మరిచేట్లు చేయగలిగిన ఆ ప్రణయాన్ని ఏ వెలయినా సరే చెల్లించి ఆరాధించేందుకే, నీవు నిశ్చయించుకున్నట్లు కూడా అర్థంచేసుకున్నాను. నీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకునేందుకు ఎదురైన యీ విషమ పరిస్థితినే నీవు ఎన్నుకున్నావు. ఇకముందైనా నీకు జీవితంలో సుఖ సౌఖ్యాలు కలగాలని గాఢంగా ఆశిస్తున్నాను.

ఎటుతిరిగినా ఆపాత పాటే నీవు పాడదలుచుకున్న పక్షంలో - నీవు కోరే విడాకులకు నేను ఎదురుచెప్పను. నీవు కోర్టుకు వెళ్తే నేను అసలు కోర్టుకిరాను. ఇందువల్ల అవబొయ్యేదాన్ని మనం ఆపలేకపోయినా అనవసరపు కాలయాపనా, వాదోపవాదాలూ మొదలైన వేదనలను తప్పించుకోవచ్చు.

చివరకు నేను కోరేదేమంటే - నీవు పోనీ నీ ఇష్టానుసారంగానే తిరుగు. నేను ఇండియాకు వచ్చేంతవరకూ పిల్లను జాగ్రత్తగా పెంచు. మన కలతల కారణంగా బేబీ మనస్సు పాడుచేయవని నమ్ముతున్నాను.

ఈ కోరికనుకూడా నీవు మన్నించలేకుంటే - మరొక ఏర్పాటు చేసేవరకైనా ఆగుతావని ఆశిస్తున్నాను.

జవాబు వ్రాయి.

నీ

— ప్రభాకర్.

---

● వ్యవసాయ కళాశాలలో బి, ఎస్‌సి. చదువుతూ సెలవుల కింటికి వచ్చిన విద్యార్థి చెల్లెలితో— "ఏమిటీ మన గులాబిచెట్టు ఇలా ఎండిపోతుంటే చూస్తూ వూరుకున్నారు?"

చెల్లెలు: "అది గులాబికాదు, మందారచెట్టు"

సాంబమూర్తి రక్తంవేడెక్కింది. కాస్త సందు దొరికితే మంచితనానికి పట్టే దుర్గతి, వేదనల స్వరూపాలు యెలాటివో ఆయన స్పష్టంగా చూస్తున్నాడు. ఇక ఆ నాలుగో ఉత్తరంలో ఏముంటుందో ఆయనకు చదవకుండానే తెలిసిపోయింది. ఐనప్పటికీ కథాక్రమంకోసం, రేపు తానివ్వబొయ్యే సలహా సర్వాంగీకారంగానూ, శాస్త్రసమ్మతంగానూ వుండేనిమిత్తం ఆయన నాలుగో ఉత్తరాన్ని కూడా చదివాడు;

లండన్,
3.3.1959

డియర్ రేవతీ,

జవాబు వ్రాసేందుకు చాలా అలస్యం చేసిన కారణంగా నీమన నేమన్నా మారుతుందేమోననే ఆశను. నీ ఉత్తరం నిరాశ చేసింది.

చాలా కొత్త విషయాలు జీవితంలో తెలుసుకోవటం జరుగుతుంది. శరత్ బాబు కథల్లో లాగు 'భారత స్త్రీ ఒకే సారి ఒకే పురుషుణ్ని ప్రేమిస్తుంది' అనే సిద్ధాంతం కేవలం ఆదర్శప్రాయమైన కథారచనలకు మాత్రమే సరిపడే సత్యమని నీవు వెలిబుచ్చిన అభిప్రాయంతో నాకు ఎలాటి పేచీ లేదు; ఇతర పురుషులను కూడా అషే అంత గాఢంగాను ప్రేమించవచ్చు; ఐతే ఆ ప్రేమను ప్రకటించే అవకాశాలూ, సమాజపు అనుకూల వాతావరణమూ మొదలైనవి లభ్యపడనందువల్ల ఆమె తిరుగుబాటు చేయలేకపోతోందన్నావు. అదీ కాచి వడబోసిన సత్యమే;

నీ గాఢమైన వాంఛలను, చట్టసమ్మతంగానూ, నీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎలాటి ఆటంకమూ లేకుండానూ తీర్చుకొనే ఏర్పాట్లు చేసుకున్నావన్నావు. నీ కుశాగ్ర బుద్ధికీ, చాకచక్యానికీ అభినందిస్తున్నాను. విడాకులు తీసుకోకుండా విచ్చల విడి విహారంద్వారా నా మనసు కష్టపెట్టటం నీకు ఇష్టంలేదన్నావు; నామీద యీ మాత్రం దయ చూపినందుకు ఆనందిస్తున్నాను.

విశేషించి వ్రాయవలసిందీ లేదు. తెగిన తాడుకు చెరో వైపునా దూరంగా విసిరి వేయబడటమే ఉభయులూ అందుకోవలసిన ప్రతిఫలం; బేబీ సంగతి నాకే వొదలినందుకూడా నీ పట్ల కృతజ్ఞుణ్ని. సరిగ్గా నెల రోజుల వ్యవధి ఇవ్వు. యీ లోగా బేబీ సంరక్షణ భారానికి ఏర్పాట్లు చేయ గలుగుతాను.

విడాకులు - కోర్టుద్వారా తేలిగ్గా పొందగలవు. ఏలాయరైనా యీ సంగతి నీకు చెప్పగలడు. నేను ఎటూ అడ్డగించను. ఈ ఉత్తరాన్ని నా అంగీకారంగా కూడా నీవు కోర్టులో దాఖలు చేయవచ్చు.

నీవు కోరే కొత్తజీవితం సుఖప్రదంగా గడుస్తుందని మనః పూర్వకంగా ఆశిస్తున్నాను.

నీ
— ప్రభాకర్.


సాంబమూర్తి నిట్టూర్చాడు. తెగించిన ఆడదాని కాళికాస్వరూపం ఆయన కళ్ళముందాడింది. ఎంతో అందమైన ఆడదాన్ని సాయంత్రం చూశాననే ఆనందమంతా ఆ అందానికి వెనుక దాగిఉన్న పగిలిన అగ్ని పర్వతాన్ని చూసేప్పటికి భయంగా మారింది. ఎంత తియ్యగా ఉన్నా, విషమని తెలిసి తినలేంకదా!

ఈ విచిత్రమైన మనస్తత్వమున్న వ్యక్తికి ఎలాటి సలహా ఇవ్వాలా అని ఆలోచిస్తూ, తనలోతాను ఎంతో గాఢంగా తర్కించుకుంటూ, తనకు తెలియకుండానే మగత నిద్రలో పడ్డాడు సాంబమూర్తి. సుశీల వచ్చి గట్టిగా ముద్దుపెట్టి మేల్కొల్పాకగాని ఆయన మనసుని ఆవరించిన మేఘం విడిపడలేదు.

## 3

మర్నాడు, సాయంత్రం సరిగ్గా ఐదు గంటలకల్లా రేవతి తన కాబొయ్యే భర్తను వెంటబెట్టుకొని సాంబమూర్తి ఆఫీసుగదిలో ప్రవేశించింది. ఆ గదిలో వెలిగే నాలుగు ట్యూబ్‌లైట్స్ వెరసి మొత్తం 160 కాండిల్ పవర్, రేవతి అంచదందాలముందు వెలవెలబోయినట్లుంది.

"రండి - రండి!" అని సాంబమూర్తి వారిని ఆహ్వానించాడు; తమ కేసువిషయమే స్టడీచేసి సిద్ధంగా వున్నందుకు, భరించలేని కాలయాపనకు గురికానందుకు కాబొయ్యే వధూవరులిద్దరూ మనసులో ఎంతోఆనందించారు.



సాంబమూర్తికి ఎదురుగా వారిద్దరూ చెరో కుర్చీలోనూ కూర్చున్నారు.

"వీరు నారాయణరావుగారు .... నవలా రచయిత ...వీరాంధ్ర అనే తెలుగు దిన పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్—" అని ఆ యువకుణ్ని రేవతి సాంబమూర్తికి పరిచయం చేసింది.

సాంబమూర్తి ఒక్కక్షణం ఆయువకుణ్ని పరిశీలించి చూశాడు. పాలుగారే బుగ్గలు చూసి కొత్తగా జీవితానుభవంలేని వాడనే విషయాన్ని గ్రహించాడు. కథలు చదివి కథలు రాయటంమాత్రమేనేర్చి ఉండొచ్చు. రేవతి వాలుచూపుల వలలో చిక్కుకొనే వేలాది ప్రజల్లో ఇతను ఒకడు. రేవతికి ఇతని మీద మమత కలగటం ఒక్కటే విశేషం. అందగాడూ, లేత వయసువాడూ అనేవి పైకి కనిపించే లక్షణాలు. అందుకని కాస్త లోతుకువెళ్ళవలసిన అవసరం ఉన్న దని సాంబమూర్తి భావించాడు.

"నీ అభిరుచుల్ని అభినందిస్తున్నాను రేవతీ!" అన్నాడు సాంబమూర్తి.

ఈ ఒక్క వాక్యంతోనూ వారుభయులు ఆనంద పారవశ్యాన్ని పొందిన సూచనలు సాంబమూర్తి తీవ్ర దృష్టికి తగిలినవి.

"సరే - బిజినెస్ చూద్దాం ..... రేవతి తన మొదటి భర్తకు విడాకులిచ్చి, మిమ్మ వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకున్న సంగతి తమకు తెలుసు కదా!"

"తెలుసు!" అన్నాడు నారాయణరావు.

"ఆమె విడాకులు కోరిన కారణం ఏమిటో తమకు తెలుసా? ఆమెకు మొదటి భర్త సంతానం తాలూకు ఒక ఆడపిల్ల ఉన్న సంగతీ తెలుసా?"

"భర్తకూ తనకు పడటంలేదంది; తనకా భర్తమీద ఇష్టం తగ్గిందన్నది. తన బేబీని ఆ భర్తే తీసుకుంటాడని చెప్పింది."

"రైట్ ... ఆమె ఏమీ దాచలేదు. అయితే రేపు మీ మీదకూడా ఇష్టం తగ్గవచ్చు కదా!"

"రేపటి సంగతెందుకు లెండి!" అంది రేవతి కొరకొరలాడుతో.

ఆ జవాబును నారాయణరావు మెచ్చుకున్నట్లు కనిపించింది. "అంతే లెండి-" అన్నాడు.

"నిన్నటి విషయం, రేపటి విషయాలూ వొదిలేద్దామంటే - కేవలం వర్తమాన కాలానికి విలువ ఏమీ ఉండదని నా భయం. ఎందుకంటే నిన్నటి అనుభవం మీదా, రేపటి ఆశయాలమీదనే వర్తమానం ఆధారపడి ఉంది. వర్తమానమంటే కేవలం యీ రోజూ, యీ గంటా యీ నిమిషం అవనేరదు కదా!

"బొనసుకోండి -" అన్నది రేవతి. "సూటిగా ఉన్న యీ కేసును క్లిష్టంగా చేస్తున్నారు!"

"కాదమ్మాయీ! ... సరే - అయ్యా! తమ సంపాదన ఎంత?" అన్నాడు సాంబమూర్తి.

"ఐదొందలు జీతం -"

"పైరాబడో??"

"దాదాపు ఏమీ లేదు"

"నెలకు ఏడొందలు సంపేవాడు ఆమె మొదటి భర్త. అది చాలుతోందో లేదో నేను చెప్పలేనుకాని అంతకన్నతక్కువక్వాలిటీని అంగీకరించటం సబబని నేను అనుకోను" అన్నాడు సాంబమూర్తి.

"మా మధ్య ప్రేమ ఉన్నది...డబ్బులో తగ్గినా ప్రేమ ఉన్నదే."

"ఓహో! ప్రేమతింటూ కూర్చోవొచ్చు!"

నారాయణరావు మొహం వేళ్ళాడేశాడు.

రేవతిమాత్రం నిప్పులు కురిపిస్తూ, "అదేదో మేమిద్దరం చూసుకునే వ్యవహారం - మీ కెందుకూ శ్రమ?" అంది.

"అన్ని వ్యవహారాలూ, చక్కబరచకుండా తీర్మానం చేయటమెలా? సరే - సంపాదన విషయం వొదిలేద్దాం. 'వెరైటీ యీజ్ ది స్పైసిస్ అవ్ లైఫ్' అన్నదాంట్లో మీకు నమ్మకమున్నదా?"

ఈ ప్రశ్న ఎవర్ని అడిగాడో తెలియక ఇద్దరూ ఒకేసారిగా "చాలా నమ్మకం!" అన్నారు.

"ఆ విశ్వాసాన్ని రేవతి జీవితంలో ప్రయోగిస్తూన్నది... ఆమె తన భర్తకు వ్రాసిన ఉత్తరాలలో తాను తన యవ్వనాన్ని వినియోగించుకునే విధాల పట్ల ఆయన ఎలాటి అటంకాలూ చెప్పరాదనే ధోరణిని కనబరచింది-" అన్నాడు సాంబమూర్తి. సాక్ష్యమేదో తాను సిద్ధంగా వుంచాననే ధోరణిని కనబరిచేట్లుగా ఉత్తరాలు కట్టబడిన రుమాలును ఆడిస్తూ.

"కావచ్చు -" అన్నది రేవతి.

నారాయణరావు మౌనంగా ఊరుకున్నాడు.

"నేను విశదీకరించవలసిన ముఖ్యవిషయమిది; నా క్లయింట్‌గా నీ తత్వానికి సరిపడే భర్తే నీకు తగినవాడవుతాడు. నీవు ఎన్నుకున్నప్పటికీ, రేపే తిరిగి తెగతెంపులకు పాల్పడకుండా ఉండేట్లుగా నేను కట్టుదిట్టంచేయవలసిన బాధ్యత నాకువున్నది... అందుకని - మిస్టర్ నారాయణరావూ! రేవతి తనయువ్వనానుభవాలను తన ఇష్టానుసారంగా పొందేందుకు మీరు అనుమతించవలసి వుంటుంది. అలాటి ఆమె ప్రవర్తనను ఆమె మొదటి భర్త అంగీకరించాడు కూడాను... అంటే ఆ మొదటి భర్తకన్నా హృదయ వైశాల్యాన్ని మీరు ప్రదర్శించగలిగి వుండాలి. అది మీకు సమ్మతమేనా?" అన్నాడు సాంబమూర్తి.

తాను నోటితో చెప్పలేని విషయాన్ని సాంబమూర్తి విశదీకరించినందుకు రేవతి సంతోషించింది. తన ప్రేమలో తలకిందులుగా పడిపోయిన నారాయణరావు దీనిక్కూడా తప్పక అంగీకరిస్తాడనే ఆమె నమ్మింది. అలాటి అంగీకారాన్ని పొందటం- అందుకు తన లాయర్ సమక్షంలో ఒప్పుకోవటం, తన జీవిత విధానానికి తిరుగులేని అస్త్రంగా వుంటుందని ఆమె తలపోసింది.

ఐతే నారాయణరావు యిబ్బంది పడుతున్న విధంగా కుర్చీలో అటూ యిటూ కదిలాడే కాని జవాబు చెప్పలేకపోయ్యాడు.

"మీ ఇష్టానుసారంగా మీరు వాంఛాతృప్తిని పొందేందుకు బహుశా రేవతికి అభ్యంతరం వుండదు." అని సాంబమూర్తి అందించాడు.

"ఔను.... వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని భంగపరిచే వైవాహికజీవితం నాకు అవసరం లేదు —" అన్నది రేవతి.

---

● నయాగరా జలపాతాన్ని చూడ్డానికి వెళ్ళిన ఒకటూరిస్టుల బృందంలో ఆడవాళ్ళెక్కువగా వున్నారు. అక్కడి గైడ్ ఆ ప్రదేశాన్ని గురించిన వివరాలన్నీ చెబుతూ "ఇది ప్రపంచంలోని గొప్ప జలపాతాల్లో ఒకటి. ఆడవాళ్ళు కాసేపు మాట్లాడకుండా నిశ్శబ్దంగావుంటే దాని హోరు స్పష్టంగా వినవచ్చు" అన్నాడు.

"జవాబివ్వండి—" అని సాంబమూర్తి తొందర పెట్టాడు.

నారాయణరావు బెదిరిపోయినట్లు కనిపించాడు.

"ఈ విషయం లోగడ మనం తేల్చుకున్నదే కదా!" అని రేవతి ఆ పాత విషయాన్ని నారాయణరావుకు జ్ఞాపకంచేసింది.

"ఈ షరతు నేను అంగీకరించను—" అన్నాడు నారాయణరావు - పిరికివాడు తన పిరికితనం బైటపడుతుందేమోనని భయపడి దృఢస్వరాన్ని ప్రయోగించిన విధంగా.

"ఆఁ, అలాగా? ఆరోజున అడిగినప్పుడేమన్నా ఒప్పుకుంటివి....కొన్ని నెలలుగా నన్ను మభ్యపెట్టింది - ఇందుకా?" అని రేవతి కారాలూ మిరియాలూ నూరుతోంది.

సాంబమూర్తి యీ వినోదాన్ని చూసి, విని ఆనందిస్తున్నాడు.

"ఆ ప్రేమలో ఏం చేశానో - నేనిప్పుడు చెప్పలేను. నీతోడి ఆ స్నేహమే నాకు దక్కేదల అని తృప్తిపడగలనని ఇప్పుడు అనిపిస్తోంది. నీ చరిత్రనుగూర్చి ఆలోచిస్తూంటే - నీ విప్పుడు విడాకులివ్వాలనుకుంటున్న భర్త దేవుడనిపిస్తోంది: అంతకన్న దైవత్వాన్ని ప్రదర్శించేందుకు దేవుడే మరొక అవతారాన్ని ఎత్తాలి—" అన్నాడు నారాయణరావు.

"అది నిజమేకాని దేవుడు అవతారాన్ని దాల్చేదాకా రేవతి యీ అవతారంలోనే వుండగలదనే నమ్మకం నాకు లేదు!" అన్నాడు సాంబమూర్తి.

నిశ్చయంగా విజయాన్ని ఆశించినవ్యక్తి చిత్తుగా ఓటమిని యెదుర్కోవలసి వచ్చినప్పుడు ఎలాటిమార్పులు ప్రదర్శితమౌతవో యీ క్షణంలో రేవతినిచూస్తే అర్థమౌతుంది.

"ఇన్ని అబద్ధాలు చెప్పి....ఇంతమోసం చేసి...." అంటోంది రేవతి - కంధగడ్డల్లె మొహం చేసుకొని:

నారాయణరావు పిల్లివలెనే లేచి, ఆమె దృష్టినుంచి తప్పించుకుంటూజారుకున్నాడు.

"మొగవురుగుల్ని నమ్మకూడదు! ఎన్నెన్ని వాగ్దానాలు - ఎన్నెన్ని ప్రమాణాలు చేశావ్! నిన్ను నమ్ముకొని కదా నే నింతదూరం వచ్చింది...." కళ్ళనుంచి నీరు కారుతూన్నా గమనించకుండానే ఆమె చెప్పుకొని పోతోంది.

"రేవతీ!" అన్నాడు సాంబమూర్తి హెచ్చరిక చేస్తూన్న ధోరణిలో— "ఆ మోసగాడు - అబద్ధాలకోరు - అమాయకురాళ్లే కనిపించే దుష్టుడు పారిపోయ్యాడు!"

ఇప్పుడామె కళ్ళుతుడుచుకొని చుట్టూ చూసి సాంబమూర్తి చెప్పింది నిజమేనని తెలుసుకుంది.

"వాడు వెళ్ళిపోవటమే మంచిది....తీరా పెళ్ళిచేసుకున్నా నిన్ను నానా హింసలూ పెట్టేవాడు. నిన్ను నీ కోర్కెలు తీర్చుకోకుండా అడ్డగించేవాడు....విడాకులు యివ్వకుండా నానా బాధ పెట్టేవాడు. అంత్యనిష్ఠూరం కన్నా యీ ఆదినిష్ఠూరమే మేలు కదా!"


"మీరు చెప్పినదీ నిజమే!" అన్నది రేవతి తన్ను తాను ఊరడించుకోగలుగుతూన్నట్లు.

"నీకు విడాకులు రావటం చాలా తేలిక. ఐతే ఆ తరువాత కార్యక్రమాన్ని నిర్ణయించుకోవటం ఉచితం; మరో కొమ్మపట్టు చిక్కకుండానే, నిలబడినదాన్ని నరుక్కోవటంలాటి పని చేయకూడదుకదా!"

"ఔనౌను—" అని సణిగిందామె.

"నేనొక సలహా చెపుతాను"






"చెప్పండి" అన్నదామె ఆతృతను స్పష్టపరుస్తూ.

"ప్రతిదీ జాతీయం చేయుటమనే తీవ్ర జ్వరం దేశమంతటా వ్యాప్తిచెంది ఉన్నది. సమాజంలో సోషలిజాన్ని తీసుకొని వచ్చేందుకు గాను ప్రతిదాన్ని ప్రజలపరం చేయటాన్ని చూస్తూనే వున్నాము. ప్రైవేట్ సెక్టర్‌నుంచి పబ్లిక్ సెక్టర్‌కు సహజంగా మార్పులు తీసుకొని రాబడుతూన్నవి. సౌందర్యం, యవ్వనం మొదలైనవికూడా ఏ ఒక్క వ్యక్తికో చెంది, ప్రైవేట్ సెక్టర్‌లో ఉండటం కన్నా, పబ్లిక్ సెక్టర్‌లోకి గాని రాబడితే సోషలిజమ్ పరాకాష్ఠనందుకుంటుంది...."

"అందుకని?" అన్నదామె కనుబొమలు ముడివేస్తూ.

"అందుకని—" అన్నాడు సాంబమూర్తి ఆర్గ్యుమెంట్లు పూర్తిచేసి అసలు సారాంశాన్ని బైటపెట్టే ధోరణిలో. "ఈ భర్తలను యెదుర్కోటం అదీ మహా యాతన. వీళ్ళల్లో మోసగాళ్ళు జాస్తి. నీ అభిరుచులన్నిటికీ తగినవాడూ, నీ ప్రవర్తనను సర్వదా ఆమోదించేవాడూ దొరకటం దుర్లభం కూడాను. ప్రతిసారీ పెళ్ళిచేసుకోవటం, నచ్చక విడాకులు పుచ్చుకోవటం మొదలైనవి తలనొప్పి వ్యవహారాలు; కాలయాపన, ధనవ్యయంతో కూడినవి ... ఈ గొడవంతా లేకుండా ప్రతిసాయంత్రం ఏ ఫ్యాషనబుల్ రెస్టారెంట్ దగ్గిరో లేదా సినిమాహాలు దగ్గిరో కాపలావేసి, నీకంటికి నచ్చినవాడిమీదికి వాలుచూపులు ప్రసరించావంటే - ఒకరాత్రి సుఖించి అంతటితో ఆ పురుషుణ్ని వదిలించుకోవచ్చు. 'వెరైటీ ఈజ్ ది స్పైసిన్ ఆఫ్ లైఫ్' అన్నదాన్ని నిత్య జీవితంలో యింతకన్నా గొప్పగా ప్రయోగించే అవకాశం మరి వుండదు. నీ యవ్వనం, అందచందాలూ మొదలైన్వి

మురిగిపోతుండా, నీకు సుఖాన్నిస్తూ ఇతరుల కూడా హాటా యిస్తూ జీవితం హాయిగా, నీకోర్కెలను తీర్చేందుకు అనుగుణంగా సాగిపోతూ వుంటుంది. నీ సౌందర్యానికి దాసులయే మొగాళ్ళు లక్షలకొద్దీ యీ పట్టణంలో లభ్యమౌతారు: ఆ సంగతి నీకూ తెలుసు. పోతే మంచిరేటుకూడా పలుకుతుంది కనుక, నీ సంపాదనా బాగుంటుంది. ఎన్నికలో పొరబడినా, ఒక్కరాత్రి అవస్థే కనుక్క అదేమంత ఇబ్బందిగా వుండదు. మరొకవైపున సెక్స్ సోషలిజంను ప్రయోగాత్మకంగా చూపి, జాతీయం చేయటమనే అత్యున్నత ఆదర్శాన్ని అనుసరించిన దానివీ అవుతావు....

ఎంతో ఆకలైనవాడు పలుగురాళ్ళున్న అన్నమైనా సరే, వాటిని ఏరుకొనే తింటాడు. తీవ్రమైన కోర్కెలను పరిష్కరించుకునేందుకు రెండు మార్గాలున్నవి: ఒకటి దాన్ని అణచివేయగలగటం; ఇది సామాన్యులకు సాధ్యమయేదికాదు. రెండోది - మోహం మొత్తేవరకూ తీర్చుకోవటం. ఈ రెండో పద్ధతి చాలామందికి సుళువైనమార్గం. ముఖ్యంగా నీ ప్రస్తుత పరిస్థితుల్లో నీకు ఎంతగానో ఉపకరిస్తుంది—"

ఆమె వైపు చూడకుండానే తలవొంచుకొని చివరివాక్యాలు అంటున్నాడు సాంబమూర్తి: "నీవు యీ నిశ్చయానికి వచ్చినట్లయితే, ప్రతి ఆదివారము నేను నీతో ఎంగేజ్‌మెంట్ ఇవ్వగలను. ఉదయం పదిగంటలకల్లా రాత్రి ఎనిమిదింటికి ఇక్కడికి వస్తున్నానని ముందుగా ఫోన్‌చేయాలి. ఎందుకంటే పదకొండింటికి సుశీల ఎంగేజిమెంట్ ఫిక్స్‌చేస్తుంది. ఇద్దరు అమ్మాయిలు నాకు అనవసరం కదా!... వేనిచ్చే ఫిక్సెడ్ రేటు రాత్రికి యాభైరూపాయిలు. రెడీకాష్ బేరం... నో క్రెడిట్స్... నెట్ ఎమౌంట్....బాగా ఆలోచించుకొని."

హఠాత్తుగా సాంబమూర్తి తలెత్తి చూశాడు. ఆమె గదిదాటుతూవుంది. తన మాటలన్నీ వినే ఉంటుంది. అంతకన్న చెప్పటంకూడా అనవసరం. ఏం నిర్ణయించుకున్నా తనకొచ్చిన ఇబ్బందిలేదు! బాధ్యత తీర్చుకున్నందుకు సాంబమూర్తి తేలికపడిన విధంగా శబ్దమయేట్లు బిగపట్టిన ఊపిరి వదిలాడు. సువాసనగల గళ్ళరుమాలును ఒక్కసారి వాసన చూశాడు.

● ● ●

మూడు ఆదివారాలు గడిచి పోయినవి. రేవతి వ్యవహారాన్ని గూర్చే మరిచిపోయ్యాడు సాంబమూర్తి. నాలుగో ఆదివారం ఉదయం పదింటికి టెలిఫోన్ మోగింది.

"హలో!" అన్నాడు సాంబమూర్తి.

"హలో - సాంబమూర్తిగారా?"

"ఔను -"

"నేను రేవతి నండీ!"

పిట్ట వలలో పడిందనుకున్నాడు సాంబమూర్తి.

"ఊఁ. ఇవాళ రాత్రి వస్తున్నావా?"

"ఉహుఁ. యీ రాత్రే వెళ్తున్నానండీ!"

"ఎక్కడికి?"

"లండన్ - మా ఆయన దగ్గరకి వెళ్తున్నాను. రెండు సంవత్సరాల తరువాత కానీ మళ్ళీ ఇండియాకురాను ... తమఫీజు సెటిల్ చేద్దామని -"

"నా ఫీజు ఇవ్వలేవులే - అందుకని ఆ సంగతి వదిలేద్దాం"

"మీ ఫీజేమిటో నాకు తెలుసులెండి. మీ సలహా నేను అంగీకరించని కారణాన ఆదివ్వదలచుకోలేదు."

"పర్వాలేదులే!"





"సరే ఉంటానండీ - ప్చ ... ప్చ ..." అని టెలిఫోనులో ముద్దులు పెట్టింది రేవతి.

సాంబమూర్తి తెల్లమొహం వేసి ఒక్కక్షణం ఆ టెలిఫోనును పరిశీలించి. హుక్ మీద పెట్టి తనలో తను నవ్వుకున్నాడు. ఎదురుగా అద్దాల బీరువాలో ఉన్న గళ్ళ సిల్కు రుమాలు వెక్కిరిస్తున్నట్లుగాఉన్నది.

## 4

సన్నగా వాన జల్లు పడుతోంది. చలి చలిగా ఉంది. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయం. వాతావరణం ఎంతో ఉత్సాహకరంగా ఉన్నదని ఒప్పుకున్నప్పటికి, సాంబమూర్తి మాత్రం చాలా చికాకుగా ఉన్నాడు.

ఎనిమిదిన్నరకు వస్తానన్న జానకి ఏడున్నరకే ఎందుకు రాకూడదా అని ఆలోచిస్తున్న సమయంలో టెలిఫోనులో ఆమె. తన భర్త హఠాత్తుగా వచ్చాడనీ, కనుక యీ రాత్రికి రాలేననీ ఫోనుచేస్తే - చికాకుగా ఉండదామరి? తనకు టెలిఫోన్ లేకపోయినా బాగుండేది - ఆమె స్వయంగా వచ్చి యీ శుభవార్త చెప్పవలసి వచ్చేది; అప్పుడు ఆ మాటా ఈ మాటా చెపుతూ, ఏమారిచి తన అవసరం [illegible]నేవాడు....అలాకాక్కడు - టెలిఫోను లేకుం[illegible] యీ రాత్రంతా ఆమె వస్తుందనే ఆశతో వేచి ఉండవలసి వచ్చేది; ఇక్కడికివాకా వచ్చి అసలు సంగతి చెప్పేందుకు సందర్భపడక ఊరుకునేది. ఆలుబ మైనా త్వరలోనే తేలిపోయినందుకన్నా తాను సంతోషించాలి. అసలు అంత తీరిక లేకనే 'మెసేజ్' ఇచ్చి, తాను మాట్లాడే సావకాశం కూడా లేకుండా జానకి ఫోన్ పెట్టేసింది.

చికాగ్గా ఉన్న సమయంలో మళ్ళీ ఫోను మోగింది. జానకి వీలు చేసుకున్నదేమోననే ఆశతో సాంబమూర్తి ఆఫీసు గదిలోకి రెండు అంగల్లో వెళ్ళాడు. ఫోనుగంట మూడో వరస కొడుతూండగా ఫోను ఎత్తాడు. అవతలినుంచి కోకిల కంఠం "హలో -!" అన్నది.

"జానకీ!"అన్నాడు ఆతృతతో. వెంటనే తనతప్పుతెలుసుకున్నాడు. ఆడవాళ్ళంధరూ వెనుకనుంచి అందంగా కనిపించినట్లే, వాళ్ళ గొంతులన్నీ టెలిఫోనులో దాదాపు ఒకే మాదిరిగా ఉంటవి.

"సాంబమూర్తిగారా?"

"ఔను....తమరెవరు?" సాంబమూర్తి ఆతృత తగ్గింది. జానకి కాదని తేల్చుకున్నాడు.

"నేను జానకిని కాదండీ ...., రేవతిని.... మీకు గుర్తులేదా - రెండేళ్ళక్రితం తమ దగ్గిరికి క్లైయింట్‌గా వచ్చాను...."

"ఆఁ ...ఆఁ. గుర్తున్నది!"

"అన్నట్లు మీరు సుశీలను మార్చి జానకి వలలో పడ్డారా?"

---

● బట్టతల ఆసామీ షాపువాడితో:

"ఈ నూనె వాడితే జుట్టు మళ్ళీ వస్తుందని గ్యారంటీ ఏమిటి?"

"అదేమిటిసార్, అలా అంటారు. పొద్దున ఈ సీసాలోంచి కొంచెం నూనె వాలికి దువ్వెనలమీద పడింది. సాయంత్రానికల్లా అవన్నీ బ్రష్షులై పోయాయి."

ఈ రేవతికి ఎంత గుర్తో!

"వైరైట్ యూజీ ది స్పైసీస్ ఆఫ్ లైఫ్ కదా"!

"సామెతలు బాగా గుర్తుంచుకున్నారే!"

"ఇండియాకు ఎప్పుడొచ్చావు?"

పది రోజులైందండీ .... బొంబాయిలో వారం ఉంది. ఇవాళ ఉదయమే వచ్చాం."

"సంసారంతోనా?"

"ఔనండీ...మీతోకొంచెం మాట్లాడాలి."

"రేపు ఉదయంరండి."

"ఇప్పుడు తమకోసం ఎవరన్నా అమ్మాయిలు వస్తున్నారా? ఆదివారం ఇలాంటి ఎంగేజ్‌మెంట్‌లు ఉంటవని లోగడ నాకోసారి చెప్పారులెండి - అందుకు అడుగుతున్నా."

"ఉహూఁ. ఎంగేజ్‌మెంట్ కాన్సిలైంది."

"పాపం! మరి నే నిప్పుడురావటానికేం? ఇప్పుడు ఎనిమిదింబావేగా ఐంది. అర గంటలో వచ్చేస్తాను - ఏమంటారూ?"

అంత అర్జెంటు పనేమిటో సాంబ మూర్తికి అంతుబట్టలేదు.

"సరే - రా!" అన్నాడు.

అవతల టెలిఫోన్ పెట్టేసిన చప్పుడు విని తనూ టెలిఫోన్ పెట్టేశాడు.

అందాలుచిందే, నవయవ్వన రూపంతో రేవతి కళ్ళముందు మరులుగొలుపుతూన్న విధంగా తోచింది సాంబమూర్తికి. ఎదురుగా అద్దాల బీరువాలో గళ్ళ సిల్కురుమాలుతో కట్టబడిన చిన్నమూట కనిపించింది. సాంబ మూర్తి ఆమూటవిప్పి ఉత్తరాలను అక్కడే వదేసి గళ్ళరుమాలు చేతిలోకి తీసుకొని వాసన చూశాడు. రెండు సంవత్సరాలైనా దానిమీది సెంటువాసన మైల్డ్‌గా, ఆహ్లాద కరంగా సువాసనలను విరజిమ్ముతూ నే వుంది. చాలా ఖరీదైన విదేశీ తయారై వుండాలి అది!

రాత్రిపూట రేవతి వస్తానంటుంది ఎందుకు? బహుశా తన భర్తనుకూడా వెంటబెట్టుకొని వచ్చి తనకు ధన్యవాదాలు చెప్పేందుకేమో? ఇంత స్వల్పవిషయానికి యీరాత్రి రావాలా? లేక ఆ ధన్యవాదా లేవో టెలిఫోన్ ద్వారానే అందించ వచ్చునే!....తన ప్రవర్తనను హేళనచేసే ధోరణిలో ఆమె మాట్లాడింది. మెత్తని చెప్పుతో బెదిరించినట్లు చేసింది.... తెలివిగల జాణ!

వస్తానన్న జానకి రాక చికాకుపడు తూండే తాను ఏదోరకంగా మరో గంటో గంటన్నరో బాధపడి నిద్రపొయ్యేవాడు. మరిచిపోతూన్న దాన్ని జ్ఞాపకం చేసేట్లు పుండుమీద కారం చల్లేట్లుగా యిప్పుడే రేవతి రావటం! తనకు పని వున్నదంటే తీరిపొయ్యేది. ఆమె తనపట్ల చాలా స్వాతం త్ర్యాన్ని తీసుకుంది; అంటే అలాటిదాన్ని తాను అనుమతించాడు. ఇప్పుడు విచారించి లాభంలేదు. ఆ టెంప్టేషన్‌ను ఎదుర్కొని తీరవలసిన దృఢనిశ్చయ మొక్కటే తనకు గతి!

ఆ జేబురుమాలను మొహంమీద కప్పు కొని ఆ సువాసనల్ని ఆఘ్రాణిస్తూ - మెల్లిగా వీచే చల్లగాలికి తనకు తెలియ కుండానే,మగతనిద్రపట్టింది సాంబమూర్తికి.

ఎవరో మృదువుగా ఆ గళ్ళ సిల్కు రుమాలుమీద ముద్దుపెట్టుకోవటం తెలిసి, అదిరిపడి లేచాడు సాంబమూర్తి. ఎదురుగా రేవతి! ఇంకా మత్తుగా పడివున్న శరీరం లోని శక్తులన్నిటినీ ఒక్కుమ్మడిగామేల్కొల్పి కన్నార్పకుండా సాంబమూర్తి ఆమెను పరిశీలించసాగాడు.

రెండేళ్ళు గడచిన ఛాయలు రేవతిలో కనిపించటంలేదు; రెండేళ్ళ వయస్సు తగ్గి నట్లుంది. బాగా నునుపెక్కింది. లోటులేని, తృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ ఎంతో ఆనందాన్ని తాను అనుభవిస్తున్న ధోరణిని ప్రదర్శిస్తోందామె. ముద్దబంతి పూవల్లే ఎంతో సిమెట్రీవున్న ఆకారం. యవ్వనపు మెరుగులు కన్నులు మిరుమిట్లు గొల్పేట్లుగా ప్రదర్శిత మౌతూన్నవి. ఈ రంభ-ఊర్వశి పనిగట్టుకొని భూమిమీదికి వచ్చి తనలాటి వాళ్ళను ఊరించి, కవ్వించి అందకుండా ఏడిపించట మెందుకో!

జేబురుమాలు తన మొహంమీద అడ్డం వుండగా ఆమె ఒక ముద్దు పెట్టిన విషయం నిశ్చయంగా తనకు తెలుసు. ఆమె ఉద్దేశ్య మేమిటి? లోగడ - రెండేళ్ళక్రితం టెలి ఫోనులో పెట్టిన, ముద్దు పద్దులోకే దీన్ని కూడా వేయాలా? లేక....పెదవసందేహాలు తీరేదాకా తొందరపడి ప్రయోజనం లేదు.

"అప్పుడే నిద్రపోతున్నారా?" అన్న దామె తేనెలు కురిపించే కంఠస్వరంతో.

"లేదు .... లేదు .... కళ్ళుమూసుకొని కలలు కంటున్నాను!"

"కలలేనా?" అన్నదామె చిలిపిగా.

"నిత్య జీవితంలో లభ్యమవని వాటిని కలల్లోనన్నా అనుభవించకుంటే బతుకులోని నిరాశతో ఆత్మహత్య చేసుకోవలసిన దుస్థితి ఏర్పడుతుంది కదా!"

"ఔనౌను....అందులోనూ జానకి వస్తా నని రాలేదు కనుక మరీ బాధ!" ఆమె కళ్ళు విజ్ఞానంతో నిండి మిలమిలా మెరిసిపోతూ న్నవి. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగలిగిన యీామెతో తనేం సమర్థించగలడు? మెదల కుండా ఊరుకున్నాడు.

"లాయర్‌గారూ! ముసలితనం వెంటాడు తున్నా నవయువకునివలె మీకీ శృంగార వ్యాపకాలేమిటి?" అన్నదామె చిరునవ్వులు చిలకరిస్తూ.

అల్లరి పిల్లవాడితో వాదించి సక్రమ మార్గాన పెట్టేందుకు నిశ్చయించుకున్న తల్లి వలె ఏమిటీ ధోరణి అనిపించిందింది సాంబమూర్తికి.

"మృత్యువు వెన్నాడుతోంది. కనుకనే చకచకా పనులు పూర్తిచేసుకోవాలి. లభ్య మైనంత ఆనందాన్ని పుంజుకోవాలి. ఇక యవ్వనమంటావా - నిలవవున్నా విస్కీ లాగు, కాలం గడిచేకొద్దీ పదునెక్కి, అనవసరపు ఉద్రేకాలతో తికమక పడక నిశ్చలంగా, యథారూపాన్ని ప్రదర్శిస్తుంది....సరే....అదంతా నాగొడవ.... నీవు ఒక్కతెవే వచ్చావా?"

"నాకుతోడెందుకండీ? లోగడ ఒకసారి ఆదివారం పదింటికల్లా ఫోను చేయాలన్నారు; లేకుంటే ఎంగేజ్‌మెంట్ సుశీలతో ఫిక్స్ చేసుకోవటం జరుగుతుం దనీ, ఇద్దరు అమ్మాయిలు మీకు అనవసర మనికూడా చెప్పారుకదా!"

అబ్బ! ఈమెకు ఎంత జ్ఞాపకం! అస లీమె వచ్చినపనేమిటో ముక్కుకు సూటిగా

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపు లను జతచేసి పంపించాలని మనవి. రచన నతో పాటు కాక తరువాత స్టాంపులు పంప వద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

— మేనేజింగ్ ఎడిటర్.

అడిగేందుకు సంస్కారం అడ్డొస్తోంది. ఐతే ఒకవిధంగా ఈ యిబ్బంది రాకుండానే ఆమె సూచనగా తెలియపరుస్తూనేవుంది. ఐతే తనకు ధైర్యం చాలటంలేదు.

"మీ బేబీ బాగుందా ?"

"ఫైన్ ! మా సంసారం చాలా సాఫీగా వున్నదండీ యిప్పుడు !"

"సరే - ఏం పనిమీద వచ్చావు ?" అన్నాడు సాంబమూర్తి - ఈ అడ్డదోవలు లాభం లేదనే నిశ్చయంతో.

"మీఫీజు చెల్లిద్దామని వచ్చాను!"

సాంబమూర్తి గుండెలో రాయిపడినట్ల యింది. తాను ఆశించిన ఫీజేమిటో తానైతే నోటితో చెప్పలేదు; కాని ఆమె తప్పక గ్రహించి ఉంటుందనే నమ్మకం వున్నది. ఐతే యింత హఠాత్తుగా ఆమె చెల్లువేసేందుకు గాను పట్టుకొని వస్తుందనుకోలేదు. అసలు ఈ జన్మలో తాను కోరినరూపంలో అది వసూలౌతుందనీ అనుకోలేదు!

ఒకవక్క సంసార జీవితం హాయిగా వున్నదని చెపుతూ మరోవక్క అపాత జీవితాన్ని అనుసరిస్తుందేమిటా అనిపించింది సాంబమూర్తికి. అన్వయం కుదరని రెండు విరుద్ధశక్తులు ఒకే సమయాన, ఒకే తావున నిలవలేవుకదా ! ఒకవేళ ఈమె భర్తను మోసగించి, తనకృతజ్ఞతను క్రియారూపాన వెల్లడించేందుకు వచ్చివుంటే - ఆవేధవ ఉద్రేకంలో తాను ఆశించకూడనిది ఆశించినప్పటికీ, తీరా లభ్యమైనప్పుడు యెలా అంగీకరించగలడు ? ఆ కోవకు చెందిన ప్రవర్తనను యితర స్త్రీలపట్ల తాను సహిస్తున్నప్పటికీ ఈమెపట్లమాత్రం యెన్నటికీ ఓర్చలేడు.

"రేవతీ ! మీ ఆయన యెక్కడున్నారిప్పుడు ?" అన్నాడు సాంబమూర్తి.

"ఇంకా ఇల్లు తీసుకోలేదు . . . గ్రాండు హోటల్లో వున్నాం . . . ఆయన బీ బీ కి కావలా" ఎంత సాధారణ ధోరణిలో జవాబిచ్చింది !

"ఆయన అక్కడా - నీవేమో రాత్రి షికార్లకు బయలుదేరావన్నమాట !" కోపంతో అరిచాడు సాంబమూర్తి.

"చేసుకున్న భార్యను దబాయించినట్లుంది ధోరణి !" అన్నదామె తాపీగా. "మా ఆయన్ను మోసం చేసి వచ్చాననుకుంటున్నారా ? ఆయన ఆదేశం మీదనేవచ్చాను!"

పక్కనే బాంబు పేలినట్లు అదిరిపడ్డాడు సాంబమూర్తి. లోగడ ఆయన వ్రాసిన ఉత్తరాలు చదివి ఎంత విశాల హృదయుడో ననుకున్నాడు. ఇప్పుడే విషయం విని ఆ వైశాల్యాన్ని ఊహలో అంచనాలు వేయలేని అసమర్థుడౌతున్నాడు. ఐతే యింత ఉదార స్వభావాన్ని ప్రదర్శించవలసిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో లేదే ! ఏమిటీ విచిత్రం !

"తృప్తికరమైన సంసారజీవనం గడిపే నీకిది తగునా ?" సాంబమూర్తి చాలావరకు చల్లబడి పొయ్యాడు.

"తగదనే అనుకుంటున్నాను. అనేక ఒత్తిడుల కారణంగా చేయరాని పనులు అనేకం చేస్తూనే ఉన్నాము."

"ఇక్కడ ఒత్తిడి ఏముందీ ?"

"ఇంతమాత్రం గ్రహించలేరా ?" అన్నట్లు చూసింది రేవతి.

"మీరు ఫీజును ఏ రూపాన" కోరారో నాకు తెలుసు - మీకూ తెలుసు. ఐతే ఆ రూపాన చెల్లించేందుకు ఆనాడు నేను నిరాకరించాను....ఇక్కడ జరిగిందంతా మా ఆయనకు చెప్పాను—"





"ఎందుకు చెప్పావు ?" అన్నాడు సాంబమూర్తి యిబ్బందిగా కదులుతూ.

"నాయిష్టం. నేనేమన్నా అబద్ధాలు చెప్పానా ? ఆయన్ను మోసంచేయాలని చూశానా ?" అని రేవతి - ఛాలెంజీ చేసే ధోరణిలో అన్నది.

సాంబమూర్తి జవాబు చెప్పలేని నిస్సహాయ స్థితిలో పడ్డాడు.

"ఆ ఫీజు చెల్లించేయమని ఆయన గట్టిగా అన్నారు !" అన్నది రేవతి ఆర్గ్యుమెంట్లను పూర్తిచేసి అసలు సారాంశాన్ని అందించిన ధోరణిలో.

"ఫీజు యీవిధంగా కోరినందుకు నన్నేమీ అనలేదా ?"

"ఉహూం. చేసిన చాకిరీకి వెల కోరటమనేది మీ యిష్టంగా ఆయన భావించారు. మొత్తం సంసారనౌక తునాతునకలయే సమయంలో మీరు రక్షించారనీ, యిప్పుడు కొద్ది డామేజ్‌తో నౌక దక్కినా చాలననే అన్నారు—"

సాంబమూర్తికి ఒళ్ళంతా జెర్రులు పాకుతున్నట్లయింది. ఉడుకు నెత్తురంతా గడ్డకట్టుకొని పోతోంది. రేవతి భర్త మహానుభావుడు - అలాటి వ్యక్తికి అపచారం చేయటంకన్న మహాపాపం మరివుండదు !

గచ్చు నేలమీద విసిరివేసిన కొత్త టెన్నిస్ బంతివలె సాంబమూర్తి యెగిరి నిలబడ్డాడు.

"రేవతీ ! నాకు ఫీజు అవసరంలేదు. ఒక సంసారాన్ని నిలబెట్టాననే కీర్తికన్న యీ అనుభవం గొప్పది కాదు; కొద్ది డామేజ్‌తో కాకుండా, మీ సంసార నౌకకు ఏ డామేజ్ లేకుండానే కాపాడాననే ఊహ యిచ్చే ఆనందమే నాకు చాలు.... పద - రేవతీ ! నిన్ను హోటల్లో దిగబెట్టి వస్తాను—"

"మా ఆయనకు ఏం చెప్పను ?"

"లాయర్ ఫీజు నిరాకరించాడను.... పద....వర్షం పెద్దదైంది. ఫర్వాలేదు. కారు నేనే డ్రైవ్ చేస్తాను—"

సాంబమూర్తి బట్టలు వేసుకున్నాడు. గళ్ళ సిల్కురుమాలు పక్కమీద పడివున్న దాన్ని జేబులో పెట్టుకున్నాడు. కారు తీసుకొచ్చి వెనుక తలుపు తెరిచాడు. రేవతి వెనుకసీటులో కూర్చుంది. సాంబమూర్తి డ్రైవ్ చేస్తున్నాడు.

సాంబమూర్తి మనసు మనసులో లేదు. సాధుజనుల్ని తెలియకుండానే బాధపెడుతున్నానేమోననే సందేహంకూడా కలిగింది. దారిలో యెవ్వరూ మాట్లాడలేదు.

హోటల్ ముందు కారుఆపి సాంబమూర్తి దిగి వెనుకతలుపు తెరిచాడు. రేవతి కారు దిగి "లోపలికి రండి - మా ఆయన్ను పరిచయం చేస్తాను !" అన్నది.

దివ్యతేజస్సును చూస్తే, సాధారణమైన తన కళ్ళు ఆ వెలుగును తట్టుకోలేక మాడి

---

● పిచ్చాసుపత్రిని చూడ్డానికి వచ్చిన ఒక విజిటర్‌తో డాక్టరు :— ఇదుగో, వీడు తను ప్రేమించిన చిన్నది మరొకణ్ణి ప్రేమించి పెళ్ళిచేసుకుందని తెలిసి ఇలాపిచ్చివాడైపోయాడు. అతనిప్రక్కన వున్నాడే వాడు ఆ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాడు.

—నుంకర భాస్కరరావు,
అనకాపల్లి,

పోతవేసోననే భయం కలిగింది. సాంబమూర్తికి.

"రేవతీ ! జరిగింది మరిచిపో....ఫీజా రూపాన కోరిన కోరికకు నన్ను క్షమించు.... మీ ఆయన్ను చూడలేను. వస్తాను !" అని సాంబమూర్తి కారు ఇంజన్ ఆన్ చేశాడు.

రేవతి ఆయనకు నమస్కరించి లోపలికి వెళ్ళేందుకు సిద్ధంగావుంది.

ఇంజన్ మోతలోనే సాంబమూర్తి "రేవతీ ! ఒక్కమాట !" అని అరిచాడు.

రేవతి డ్రైవింగ్ సీటుపక్కకు వచ్చింది.

"ఇదిగో - నీ గళ్ళరుమాలు—" అని సాంబమూర్తి రుమాలు అందించాడు.


"నా జ్ఞాపకార్థం మీదగ్గిరే ఉంచుకోండి. ఒక సంసారాన్ని కాపాడిన విషయం మీకీ రుమాలు జ్ఞాపకం చేస్తూవుంటుంది" అన్నది రేవతి.

"థాంక్స్—" అని సాంబమూర్తి కారు పోనిచ్చాడు.

జానకి రానందుకు వికలమైన మనస్సు యిప్పుడు వికసించిన తామరపూవల్లే స్వచ్ఛంగా; పరమ పవిత్రంగా వున్నది. తాను జీవితంలో చేసిన ఘన కార్యానికి బహూకరణగా వచ్చిన గళ్ళసిల్కురుమాలు అంతులేని ఆనందాన్నిస్తోంది. రణరంగంలో రొమ్మిచ్చి పోరాడినందుకు యిచ్చిన దే విక్టోరియాక్రాస్ లాటిదీ రుమాలు. గర్వంగా రుమాలును వాసనచూస్తూ రోడ్డుమీది నీళ్ళను విరజిమ్ముకుంటూ సాంబమూర్తి శరవేగంతో కారు పోనిచ్చాడు. □□□








# మావూళ్లో ఒకసారి దిగండి-

ఇట్లు
భమిడిపాటి రామగోపాలం

'విశాలా ! అర్జంటుగా అన్నం వొడ్డించూ !' అన్నాను, ఇంట్లో అడుగు పెడుతూ, చెప్పులు టేబిలు కిందికి కాళ్ళతోటే విసిరేస్తూ.

'అబ్బా ! -అబ్బాఏమిటో, ఆ అర్జంటు పని ! ఆఫీసరుగారు క్యాంప్ రమ్మన్నాడా ?'

'ఛీఛీ ఆఫీసరూ గాదు పాడూ గాదులేవే !- మా నర్సింగరావు లేడూ. అతనొస్తున్నాడు. యివాళ మెయిల్లో.'

'ఎవరండోయి. ఆ నర్సింగరావు ?'

'అందర్నీ ఎరిగుండే - ఎవర్నీ ఎరగనట్టు మాట్లాడతావు....నువ్వెరగనంత మాత్రంలో వాళ్లకొచ్చి నష్టమేం లేదులే !'

'చూసేరా ! - నే నిప్పుడేం అన్నాననీ ?' విశాల విశాలంగా నవ్వింది. 'మీకున్న ఫ్రెండ్సు తక్కువమందా ? ఓచిన్న రిపబ్లిక్ స్టేట్ సినీమాతియ్యొచ్చు. అందరూ వోటోట పోగైతే. — అంతమందిని ఎంతకని జ్ఞాపకం పెట్టుకోమంటారు !'

'నీకు బోధపరుస్తూ కూచోడానికి నాకు టైమ్ లేదు. ఇవాళే ఉత్తరం ఒచ్చింది. చూసుకుని, అర్థంచేసుకుని, అన్నంవొడ్డించు. కాళ్ళు చేతులూ కడుక్కుని ఒచ్చేస్తున్నాను.' అంటూ ఉత్తరం తీసి టేబిల్ మీద పడేసి పెరట్లోకి నడిచాను.

● ●

నరసింగరావు నా బాల్యమిత్రుడు. కాకినాడలో లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఉత్తమమైన గుణశీలాలున్నాయి; వృత్తి గౌరవంగల వ్యక్తి. పార్టీలనుంచి అనవసరంగా యెక్కువ డబ్బు తీసుకోడు. మనసారా కేసులో న్యాయం వుందని తోస్తే తప్ప కేసు నడిపించడు. మరీ వొళ్ళుమండి తనకి న్యాయమే అని తోచేస్తే క్రిమినల్ కేసుల్లాంటివి ఫ్రీగా నడిపించేస్తాడు. అబద్ధపు సాక్ష్యం చెప్తే కోర్టులో శివాలెత్తిపోతాడు. తనపార్టీ అయితే కేసు మధ్యలో విడిచిపెట్టేస్తాడు. 'నాలాంటివాడు లాయర్‌గా

వున్నంతకాలం జయాపజయములు దైవాధీనాలే. మేజిస్ట్రేట్‌గానో జడ్జిగానో వుంటే న్యాయం కొంతైనా గెలవకపోదు.' అంటాడు.

జుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ పోస్టులకి ఇంటర్‌వ్యూ వుందిట, హైద్రాబాద్‌లో. కాకినాడనుంచి విజయవాడ వరకూ మెయిల్‌లో ఒచ్చి, నన్ను పలకరించి, జి.టి.లో హైద్రాబాద్ వెళతానని వ్రాశాడు. అంతకన్న ఆనందమూ అర్జంటూ నాకేం వుంటాయి.

● ● ●

జి. టి. ఎక్స్‌ప్రెస్ వెళ్ళింది. నర్సింగరావు వొచ్చి వెళ్ళాడు. కనుచూపుమేర దాటేవరకూ రైలు ఆఖరి పెట్టె చూస్తూ నించుండిపోయి, అతని మాటలే స్మరిస్తూ, అతని రూపమే దర్శిస్తూ, ఇంటి కొచ్చేస్తున్నాను.

తనకి చాలకాలంగా బెజవాడలో ప్రాక్టీస్ చెయ్యాలని వుందన్నాడు నర్సింగరావు. కాకినాడలో కంటే బెజవాడలో లైఫ్ ఏక్టివ్‌గా వుంటుందని ఆతని అభిప్రాయం. హైద్రాబాద్‌లో ఇంటర్‌వ్యూలో బహుశా తనకి విజయం లభించగలదన్నాడు. అలా అయితే ఈవైపు వేసే అవకాశం కోసం చూస్తానన్నాడు. కాకపోతే ప్రాక్టీస్ ఈవూళ్ళో పెట్టే ప్రయత్నం చెయ్యాలని వుందన్నాడు.

బెజవాడలో వుండగలిగినందుకు నాఅదృష్టాన్ని మెచ్చుకున్నాడు నర్సింగరావు. 'మళ్ళీ మనం చిన్ననాటిలా రోజూ సాయంత్రం వేళల్లో కలుసుకుని మనసారా మాట్లాడుకునే రోజులొస్తాయి; నువ్వుండడం బెజవాడవైపు నా ఆకర్షణని రెట్టిస్తోంది;' అన్నాడు నర్సింగరావు, నా రెండుచేతులూ నొక్కి.

దీపో పునర్జ్వలతి!

● ● ●

డియర్ గోపాలం —

చాలా రోజులైంది; నీకు ఉత్తరం వ్రాసి. నువ్వు మంచి లెటర్ రైటర్; అయినా యెందుకో నాకు వ్రాయవు. బహుశా నేను పెద్ద పొజిషన్‌లో వున్నానని, పెద్దవాళ్ళతో మనకెందుకులే అనీ, ఊరుకున్నావేమో. అలా ఆయితే అది నా దురదృష్టం.


నువ్వూ మీ శ్రీమతీ చిరంజీవులూ (అయామ్ సారీ: ఎందరు ?), క్షేమంగా, ఆనందంగా, సంతోషంగా వున్నారని తలుస్తాను. మీ కందరికీ నా శుభాకాంక్షలు.

మీ బెజవాడ నగరం చూడాలనీ, మన ఆంధ్రులమధ్య ఒక్కపూట గడపాలనీ, ఎప్పటికీ నశించని కోరిక. ఈ ఐ.ఏ.ఎస్.కి కట్టి, దేశాలంట తిరుగుతూ తెలుగు మరిచిపోతానేమో అని అనుక్షణం భయం. మా వారు అప్పుడే ఈ అరవసాంబారు తాగి, అరవ మిక్స్చరు తెలుగు దంచేస్తున్నారు. ఆయన్ని వో వారంరోజులపాటు బెజవాడా, కాకినాడా, విజయనగరం చూసి రమ్మందామని వుంది; మహా అయితే వో నెలజీతం దండుగైంది గాని!

ఢిల్లీలో ఈనెల ఇరవైనాలుగో తేదీని జరగబోయే ఇంటర్ స్టేట్ ఉమెన్స్‌వెల్ఫేర్ డైరెక్టర్ల కాన్ఫరెన్సుకి నేను హాజరుకావాలి. పంధొమ్మిది నే బయలుదేరుతున్నాను. ఒకపూట మీ అందరితో బెజవాడలో స్పెండ్ చేసిగాని వెళ్ళాలని లేదు....శ్రమ అనుకోక పంధొమ్మిది రాత్రి జి.టి. కి స్టేషన్‌కి వొచ్చి నన్ను రిసీవ్ చేసుకుంటావా ?

నాకోసం అనవసరమైన ఆర్భాటం చెయ్యావొద్దని మరీ మరీ చెబుతున్నందుకు ఏమీ అనుకోకు, పి. డబ్ల్యు. రెస్టుహౌస్‌లో






ఒక వి్ంగ్ కోసం వ్రాసేను. అక్కడ వుంటాను. కల్నల్ ద్వారకనాధ్ సతీమణి దుర్గాదేవి ప్రస్తుతం వాళ్ళ నాన్నగారి ఇంట్లో (ఆయనపేరు వీరయ్యచౌదరి) బకింగ్‌హామ్‌పేట్లోనే ఉంటోంది. ఆవిడకి కారు కోసం వ్రాశాను. పంధొమ్మిది సాయంకాలం ఆవిడ కోసారి కనిపించు.

సముఖంలో వివరాలు.

అరుణా లక్ష్మణ్.

ఉత్తరం చూసి పొంగిపోయాను. ఆఫీసుకి అరరోజు క్యాజువల్ లీవుపెట్టి ఇంటికి వెళ్ళి విశాలకి ఉత్తరం చదివి వినిపించాను. స్టేషనుకి తనూ ఒస్తానంది విశాల. పిల్లలిద్దరూ యివాళొక్క రోజైనా తొరగా పడుకుంటే బాగుణ్ణని ఆందోళనపడింది. విశాలని ఆందోళనలో వదిలేసి కల్నల్ ద్వారకనాధ్ సతీమణి దుర్గాదేవికోసం పరుగెత్తాను.

సారీ, తొందర్లో చెప్పడం మరిచాను; అరుణా లక్ష్మణ్. ఐ. ఏ. యస్ అనే ఆవిడదీమాదీ, మొదట్లో ఓ వూరే. మేమిద్దరం పెద్దగా స్నేహితులం కాముగానీ ఫోర్తుఫారంనించీ స్కూల్‌ఫైనల్‌దాకా మావూళ్లో హైస్కూలు లేనందున రెండున్నర మైళ్ళు పొలాల గట్లంట నడచి వెళ్ళడం. రోజూనూ; కొన్ని సందర్భాల్లో తోవంతా కలిసే నడిచే వాళ్ళం. కాలేజీ చదువుకి మేం పట్నానికి మకాం ఎత్తేశాం; ఆవిడేమో వాళ్ళ పిన్నిగారింట్లో వుంది. ఇంటర్ అయినాకా, బి. ఏ. అయినాకా కొంతకాలం మేము చాలా సాధారణమైన ఉత్తరాలు వ్రాసుకున్నాం. ఆ వయస్సునిబట్టి అవి అందంగా ఉండేవేమోగాని అవి ఎంత మాత్రంస్పెషల్‌లెటర్స్‌కావు: ఆవిడతో జీవితాన్ని పంచుకొనే అదృష్టానికి నేనెన్నడూ ఆశించలేదు. ఒకనాడు లక్ష్మణ్ అనే వ్యక్తి

'ఆ మరదృష్టం నాదండీ' అంటూ ఎదురొచ్చాడు. (అది వేరే కథ.)

• • •

అరుణాలక్ష్మణ్ వచ్చింది; వెళ్ళింది. ఆవిడద్వారా కల్నల్ ద్వారకనాథ్; సతీమణి దుర్గాదేవితో పరిచయం కావడం ఓ విధంగా అదృష్టమే అనుకోండి; అయితే అరుణాదేవి మా యింటికి భోజనానికి రాకుండా అడ్డుపడిందని మా విశాలకి ఆవిడమీద చిరాకు కూడా ఏర్పడింది.

పెద్దపెద్ద వాళ్ళందరూ అరుణాదేవిని వి. డబ్ల్యు. బంగాళాలో చూసేరు. మద్రాస్ రాష్ట్రంలో వ్యాపారం చేస్తున్న కొందరు వర్తకులూ, స్థానిక స్త్రీ జనసంక్షేమాధికారిణులూ, మహిళా మండలి కార్యదర్శినీ ఎట్సెట్రా ఎక్సెట్రా-అందరూ ఆవిడతోబాటు మాకూ - ది పూర్ కపుల్ - నమస్కారాలు చెప్పి, శుభాకాంక్షలని - కొందరు వాళ్ళ యిళ్ళకి మమ్మల్ని ఆహ్వానించడమూ జరిగితే ఇదంతా ఆవిడతో మా స్నేహంద్వారా కాక మరేమిటి!

అరుణ లక్ష్మణ్ మాక్కలిగించిన ఆనందాన్నీ కాలక్షేపాన్నీ చాలా రోజులు నెమరు వేసుకొన్నాం.

• • •

పొద్దున్నే పళ్ళు తోముకుంటున్నాను. పరిచయం వున్న మొహం వొకటి రిక్షాలో వెళ్ళిపోతూ వుండడం పరధ్యానంగా గమనించేను. బ్రష్షును పళ్ళతో అదిమి పట్టి చేత్తో 'ఆ పాపు!' అన్న సంజ్ఞచేసేను.

రిక్షా ఆగింది.

'ఇక్కడటోయ్, మీ యిల్లూ? అప్పుడే పావుగంటైంది. ఈ రిక్షావాడు సణుగుతున్నాడు.' అంటూ దిగిన వ్యక్తి కుమారస్వామి.

'ఇదేనా రావడం? రా. లోపలికిరా!' అన్నాను. ఆనందంగా.

'ఇదే రావడం. మెడ్రాస్ ఎక్స్‌ప్రెస్‌లో దిగి, దిగుమతివారి సందుకి వెళ్ళాలంటే ఈ అబ్బాయి ముందు గాంధీనగరం తీసుకుపోయి -' అని చెప్పుకొచ్చేడు కుమారస్వామి.

కుమారస్వామి మంచి కవి. రాజమండ్రిలో ఉంటాడు. ఆర్ట్స్ కాలేజీలో హిందీమేష్టరు. అయితే కవిత్వం తెలుగులోనే రాస్తాడు. పద్యం, గేయం, వ్యాసం, కథానికా, నాటికా అన్నిట్లోనూ సిద్ధహస్తుడు. మొన్నీ మధ్య ఒక పత్రిక వాళ్ళు నిర్వహించిన నవలల పోటీలో రెండో బహుమతి పొందేడు. రెండో బహుమతి అంటే - మీకుతెలుసుగా పాఠకుల దృష్టిలో ప్రథమ బహుమతి పొందవలసిన రచన. మా మిత్రుడు కదా అనిచెప్పుకోడం కాదుగాని, ఆ మాత్రం నవల తెలుగులో దొరకదని సినిమా వాళ్ళే కాదు! రచయితలు కూడా ఒప్పుకుంటారు.

కుమారస్వామి తన నవల హక్కులు ఎవరేనా కొంటారేమోనని బెజవాడవచ్చేడు. 'పుస్తకాల ప్రచురణకి బెజవాడ కంటేమంచి కేంద్రం ఏముంది కనకా!' అన్నాడు.

చిన్నప్పటి రోజులు - అప్పుడు కాలేజీ మేగజైన్‌కి నేను కథలు వ్రాయడం - ఎడిటర్స్ అయిన శేషగిరిరావుగారికీ, విశ్వనాథ శాస్త్రిగారికి నా రచన మీద వాగ్వాదాలు రావడం, ఆఖరికి మేగజైన్‌లో నా కథ వెయ్యడం; కాలేజీ ఏనివర్సరీ రోజున మేగజైన్ ప్రశంస తెచ్చినప్పుడు కాలేజీ ఘోషకుల్లో వొకాయన నా కథని మెచ్చుకొని - "ప్రేయసి ప్రేమలోన కనుపించెడి తీయని స్వప్న మొక్కటే ధ్యేయము గాదు -" అన్న వాక్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చిరంజీవి రచించిన

ఈ కథకి నేను స్పెషల్ ప్రైజు యిచ్చానని అనడం - అన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాం.

'ఇప్పటికేనా, నీ ఉత్తరాలుచూస్తే నీలో కవనశక్తీ రచనాశక్తీ రచనాసక్తీ తగ్గలేదనే నా కనిపిస్తుంది; - వైడోంట్యూ కంటిన్యూ?' అన్నాడు కుమారస్వామి.

తను వున్న మూడురోజుల్లోనూ ఓ ఇరవైమంది రచయితలకీ ఓ పదిహేను మంది ప్రచురణకర్తలకీ నన్ను పరిచయం చేసేడు కుమారస్వామి! 'ఇతను మా మిత్రుడు ఫలానా. మంచి రచయితసుమండీ- అంటూనూ. అందరూకుతూహలం ఆనందం వెలిబుచ్చేరేగాని సందేహించనేలేదు. అఖరికి మీ రచనలు యెందులో వేస్తున్నారనేనా అడగలేదు.

రోజూ ఇంట్లో రచనలమీద, సాహిత్యం మీద చర్చలు సాగేయి. మా విశాల వంట లెలావున్నాయని అడగడం మరచిపోయింది.

కుమారస్వామి వెళ్ళినాక ఓనాడు మా విశాల ఏదేదో మాట్లాడి హఠాత్తుగా సాహిత్యంలో దిగింది. గోముగా—'మీరుకూడా ఆ కుమారస్వామిగార్లా వో నవల రాయకూడదుటండీ?' అంది. 'నామొహం; నేను నవల్రాయడ మేమిటే?' అన్నాను నేను. 'ఊరుకోండీ; మొహానికీ నవల్రాయడానికీ సంబంధమేమిటి? — నాకు తెలేదనుకున్నారా? - మీ కాలేజీ మేగజిన్‌లో మీరు రాసిన కథా, మీ పాతరచనలూ నిన్న మధ్యాన్నంతీసి చదివేను. ఇప్పుడు ఎవ్వరూ కూడా అంత యిదిగా రాయడం లేదు. మొదలు పెడుదురూ. నేనేం డిస్టర్బ్ చెయ్యనుగా. కూరా, నారా కూడా ఎవరిచేతైనా తెప్పించుకుంటాన్లెండి. — కావాలంటే ఫెయిర్ కాపీ చేసిపెడతాను, సరా!- ఎంత సేపు రాస్తారండీ, నవల. ఊరికేను! — ఆడపిల్లలు రాసేసిప్రయిజులుకొట్టేస్తున్నారు. వేలకి వేలు రూపాయలు!' అని చిన్న బ్రెడ్రూమ్ లెక్చరు వేసింది.

'నిజమే. రాస్తే బావుణ్ణు!'

— అనిపించింది. నాకూ_డానూ.

● ● ●

ఓనాడు సాయంత్రం నే నింటికొచ్చేసరికి ఇంట్లో కొత్తగొంతుకలు సంగతులు వినిపిస్తున్నాయి. ఏమిటా అని కాసేపు తలుపు దగ్గిర చెవి ఆనించి నిల్చుండిపోయాను. ఎదరింటాయన నా వాలకంచూసి నవ్వుకుంటూ వుంటే తప్పనిసరిగా తలుపు తట్టాను. సంగీతం ఆగిపోయింది; సంసారం యెదురొచ్చింది.

లోపలున్న కొత్తమనిషిని విశాల పరిచయం చేసింది: 'ఈవిడ హేమ అనీ - మావూరి మేష్టారి భార్యండీ. నేనూ యిదీ చిన్నప్పుడు వో మేష్టారు దగ్గిరే సంగీతం చెప్పించుకున్నాం.—నేను సరే. మీయింటి కోడలైన్న మీ గూటి కూతిలే సంగీతంగా జీవిస్తున్నాననుకోండి - ఇది సాధనచేసి కచేరీలు చేస్తోంది. రేపు రేడియోలో దీని ప్రోగ్రాం వుందిట - బెజవాడొచ్చింది.'

'నమస్కారవండీ. మిమ్మల్ని చూడ్డం మా అదృష్టం -' అన్నాను.

'అమ్మో - ఎంతమాట! - ఆయనలా మాట్లాడుతే నాకు సిగ్గేస్తోందే విశాలా!' అందావిడ.

నేను మళ్ళీ అన్నాను: 'అవునండీ. ఎప్పుడూ రేడియోలో గొంతుకలు వినడమే గాని ఆ గంధర్వ కంఠాలు గల దివ్యమూర్తుల్ని దర్శించలేదు. ఇదిగో ఈవిడ - మీ స్నేహితురాలు చెప్పిందిగా, మా గూటి కూతలే తన జీవనసంగీతం చేసుకొందిట.





కలకంఠి కాదు, కలహకంఠి!- అడగండి. ఎన్నిసార్లు నే ప్రోత్సహించేనో. సంగీతం నేర్చుకుని మధ్యలో విసర్జించి సామాన్య మానవురాలివి కాకు - అని -! మళ్ళీ నా కూత తన సంగీత మంటుంది! - నామాట మన్నించక, మళ్ళీ యీ ఎకసక్కెలెందుకు విశాలా!'

'నే నొకటి చెప్తానండీ-' అంది విశాల. చిలిపిగా నవ్వేస్తూ - 'ఈ పట్టున మీరు కలం కాయితం పుచ్చుకుంటే చక్కని కవిత్వం వ్రాస్తారు. మీ మాటలే స్వరాల్ని మించిన సంగీతంగా, ధారగావొస్తున్నాయి!'

హేమగారి కచేరికి మేం వెళ్ళేం. రికార్డింగు అయిపోయి, మళ్ళీ వినిపించినప్పుడు చెవులప్పచెప్పి విన్నాం. ఆవిడ తన కచేరీ మా యింట్లో రేడియోలో వింది. మర్నాడు ఆవిణ్ణి యిద్దరం కలిసి రైలుకి సాగనంపేం.

'సంగీతం నేర్చుకుందికి సాధనచెయ్యక పోడం నాకుకష్టంగావుంది. మేం బెజవాడలో ఉంటేనా, ఈ రేడియోవాళ్ళని యెలాగో మంచిచేసుకుని వారానికొక ప్రోగ్రాం యివ్వక పోయేనా!' అంది హేమగారు.

'నిజమేనే. పోనీ మీ ఆయన్ని ఈవూరు ట్రాన్సఫరు చేయించుకోమను.' అంది విశాల.


'అసలు సంగతి దాటించేస్తావేం! నువ్వెందుకు సాధన చెయ్యవూ అంటా!'

'—చెప్పమంటావా;'

'చెప్పు! - నీకసలు కారణమంటు ఉంటేగా!'

'సంగీతంమీద గౌరవంకొద్దీ మానేశాను హేమా. రేడియో కొనుక్కున్నాక, నిజమైన సంగీతం అంటే ఏమిటో, లొల్లాయి పదం అంటే ఏమిటో, తెలిసింది. సంగీతం వాకకైతే నేను పాడ్డం అనేది వాక అపశ్రుతి. అందుకని మానేశాను హేమా!'






'ఛీ ఛీ ఛీ - నీ నోటికి హద్దులేదు. నీతో సంగీతం గురించి మాట్లాడం నాదే పొరపాటు;- అన్నయ్యగారూ, ఈవిడకి నచ్చచెప్పే విధానం మీకు తెలిసుంటుంది. శ్రుతి మించకుండా అపశ్రుతి పడకుండా ఈవిడ తిరిగీ సంగీతం పాడేటట్టు చేస్తే మీకు నా ధన్యవాదాలు........' అంది హేమగారు....

'-నీ పాటగురించీ నువ్వు స్కూల్లో సంగీతం బాపతు ఫస్టుప్రయిజు ప్రతీ యేడూ సంపాదించడం గురించీ నేను యీ రేడియో స్టేషన్లో అవసరం అయిన వాళ్ళందరికి చెప్పేను - రెండునెల్లలో కనీసం లలిత సంగీతం అయినా పాడకపోతే నామీద ఒట్టేను -'


హేమగారు వెళ్ళింది. పాతబడ్డ సంగతులు మళ్ళీ స్వరాలు పోసుకున్నాయి. కూరపోపుల దగ్గిర్నుంచీ పాటల్లో కృతుల్లో వినిపించి గుబాళించేయి.

● ● ●

రోజులు గడుస్తూనే ఉన్నాయి. మేం బెజవాడలోనే ఉన్నాం. నరసింగరావులూ, అరుణా లక్ష్మణ్‌లూ, కుమార స్వాములూ,

# మీరు నల్లగా వున్నారా?

యి. ఇవాళ వచ్చిన ఫ్యాషన్ నెలరోజులు పోయాక పాతదైపోతూంది. ఇక వంట



కాలు సరే సరి. ఏదో వంకాయకూరా. చారూ. అన్నంతినే రోజులు పోయాయి. దేశంలో యెన్నోరకాలవారు యెన్నోజాతుల వారున్నారు. వారి వన్నీ తెలుసుకోవాలి. అలా మనమూ చెయ్యాలి. ఎలాగ? ఏ పత్రిక లోనో యెవరో రాయకపోతారా!

ఇవన్నీ ఒక యెత్తు. మన సంస్కారం. చదువు బయటపడే పార్టీలు. డిన్నర్లు. పేరంటాలు. పసుపు కుంకుమ సంబరాలు. బొమ్మల కొలువులు వున్నాయి. పేరంటానికి వెళ్ళినప్పుడు ఏలాటి చీర కట్టుకోవాలి? సాయంత్రం పార్టీకి వెళ్ళేప్పుడు ఏచీర కట్టుకెళ్ళాలి? మరి డిన్నర్ కెళ్ళేప్పుడు యెలాటి డ్రస్సు వేసుకోవాలి? ఇవన్నీ ఆలోచిస్తే మనకు తెలిసినట్టే ఉంది తెలియదు.

ఒకసారి మావూళ్లో ఏదో పేరంటము పిలిచారు. నేను చీరలుకట్టుకుంటున్న కొత్త రోజులవి. వాటిమీద యెంతో మోజుండేది. చక్కటి నైలాన్ చీర కట్టుకొని యీమ్మని మా అమ్మతో వెళ్లాను. ఎంతోమంది రక రకాల చీరలతో వచ్చారు. ఒక ముసలి ముత్తయిదువ నాదగ్గిరిసా వచ్చి 'అమ్మాయీ పూర్వం దేవతా వస్త్రాలనేవారు వీటినేనా ఏమిటే' అంది తెలిసీ తెలియనట్టే నటిస్తూ. నాకు నిజంగా తలకొట్టేసినంత పనయింది. పేరంటానికి నైలాన్ చీర కట్టుకుంటే బాగుండదని ప్రథమంగా తెలిసిందా రోజున.




ఇంకోసారి. మా వనజ చక్కటి షిఫాన్ చీర కట్టుకుంది. కాని దానికింద మోకాళ్ళ దిగిన మట్టుకు తెల్ల స్కర్టు వేసుకుంది. దాంతో ఆ ఖరీదైన షిఫాన్ చీర అందం పోవటమే కాక అంత అందమైన వనజ యెంతో అందవికారంగా కనపడింది. చాలా మంది గబగబా బజారెళ్ళి యిన్ని స్నోలూ. పౌడర్లూ. క్రీములూ కొనేస్తారు. అంతేకాదు.


టాల్కమ్ పౌడరు ముఖానికి. టాయిలెట్ పౌడర్ ఒంటికి రాసుకుంటే ఎలావుంటుంది? అసలు కొందరిదగ్గర ఉన్న అలంకరణ సామగ్రి చాలా తక్కువగా వుంటుంది! కాని యెంత చక్కగా అలంకరించుకుంటా రనుకున్నారు! అలంకరణ ఒకకళ. పూర్వ కాలం స్త్రీలు అలంకరణకు. సౌందర్యాన్ని అభివృద్ధి చేసుకొనడానికి మహాపాటుపడే వారట. మరి మనంకూడా ఆ రకమైనవికాక పోయినా కొత్తరకం మెలకువలు యెందుకు తెలుసుకోకూడదు!

గృహజీవితంతో అడుగుపెట్టిన స్త్రీకి మధ్యాహ్నం పూట అంతా తీరికే. అలా టప్పుడు కొత్తవిషయాలు తెలుసుకుందికి ప్రయత్నం చెయ్యాలి. ఆ టయిములోనే కొంతసేపు సౌందర్య పోషణకు కేటాయించ వచ్చు. స్త్రీ జన్మహక్కు సౌందర్యంగా ఉండడం. దానికోసం ప్రయత్నించడంలో తప్పేమీలేదు. అందుచేత సౌందర్య పోషణ గురించి కొంత తెలుసుకుందాము.

## సౌందర్య పోషణ

బస్సు ఎంత సేపటికీ రావటంలేదు. "సినిమా లేకపోతే పీడా పోయింది. ఇంటికి పోదాం" అనుకుంటూ చుట్టూ పరికించాను. కుడిపక్క ఒక మెరుపు మెరిసి నట్టయింది. ఎంత అందంగా ఉందనుకున్నారామ్మాయి! అందమైన ముఖం. చక్కటి శరీరచ్ఛాయ. వీటికి తగ్గ అలంకరణ. అన్నిటినీ మించి చక్కటి సభ్యత. ఈ విషయమే పక్కన ఉన్న మిత్రురాలితో అన్నాను.

'చాలెస్తూ. ఆ అందం వెనక ఆ అమ్మాయి పడుతున్న అవస్థ నీకుతెలీదు." అంది.



# మెరిసిపోవాలని కోరుతున్నారా?

అందానికి మెరుగులు దిద్దుకోటం తప్పని చాలామంది అభిప్రాయం! అందం అనం దాన్నిస్తుంది. "ఎ థింగ్ అఫ్ బ్యూటీ యీజె జాయ్ ఫరెవర్" స్త్రీ జన్మహక్కు సౌందర్య పోషణే కదా మరి! అసలు పూర్వకాలం స్త్రీలు అలంకరణను ఒకకళగా భావించారు. అందుకే ఆనాటి (స్త్రీలు) ప్రబంధనాయికలు పుష్పాది అద్దుకొనేవారు (ట). పెదాల ఎఱుపు కోసం యెప్పుడూ తాంబూలం వేసుకొనేవారు. కళ్ళకు కాటుక, చేతులకు లత్తుక, కాళ్ళకు పారాణి, ఒంటికి గంధపు పూత. వీటన్నిటికీ ముందు పన్నీటి స్నానం చేసేవారు. సౌందర్య రహస్యమైన శరీరచ్ఛాయను వారెంతో కష్టపడి పోషించుకునేవారు.

అంతదాకా యెందుకు? మనదేవుళ్ళంతా పాలతో (ఇప్పటికీ) స్నానం చేస్తున్నది ఎందుకనుకున్నారు? పాలు శరీరచ్ఛాయను యెక్కువ చేస్తాయి.

ఇక నగల అలంకరణ. (ఆ రోజుల్లో పద్నాలుగు కార్యట్ల నగలులేవనుకుంటాను.) కావిరంగు చీరలు కట్టుకోడం మహా ఫ్యాషన్‌గా ఉండేది. అంతటి అలంకార ప్రియులు కాబట్టే ఆనాటిస్త్రీలు అంత అందంగా ఉండేవారేమో! (ప్రబంధవర్ణనల నిబట్టే సుమండీ)

మరి మనకో - అందంగా ఉండాలి. కానీ, దాని గురించి శ్రద్ధ తీసుకోవడం నామోషి.

నాంచారమ్మగారు కోడల్ని పెళ్ళి కాక ముందు చూసివచ్చి "పిల్లను చిదిమి దీపం పెట్టవచ్చే అమ్మడూ, ఎంత బాగుందను కున్నావ్ "అంది. మరి పెళ్ళయాక యిప్పుడు 'అదేం షోకులోనే, తల్లీ. దానికి సింగారించుకునే సరికే అయిపోతుంది ఎక్కడలేని టయిమూ" అంటుంది. మరి, చిదిమి దీపం పెట్టుకోడం ఏమయిందో!

## రంగు రహస్యం

"కోడలు నలుపైతే కులమంతా నలుపేనే" అంటారు. నిజమే. రంగులో అంత ప్రాముఖ్యం ఉంది మరి. కొందరు నిజానికి పెద్ద తెలుపు కాకపోయినా, బాగానే రంగు ఉన్నట్టు కనబడతారు. కొందరు ఎంతో తెల్లగా ఉంటారు కానీ అరంగు కనపడదు. 'దీనికి కారణం ఏమిటో తెలుసా'

ఈ "డల్‌నెస్ యిన్ కలర్" చాలా మందికి లివర్ సరిగ్గా లేకపోతే వస్తుంది. దీనికల్లా ముఖ్యమైన జాగ్రత్త మలబద్ధం లేకుండా చూసుకోవడం. అజీర్తి చేసే పదార్థాలు ఎక్కువగా తినకూడదు. మన వాళ్ల పండుగ వస్తోంది అనే సరికి శనగ పిండి తయారుగా పెడతారు. ఇది సాధ్యమైనంతవరకూ వాడకం తగ్గించాలి. నెయ్యి, వెన్న, చాక్‌లెట్స్‌వంటి కొవ్వు పదార్థాలకు పరిమితి పెట్టుకోవాలి. మరి శరీరచ్ఛాయ కావాలంటే ఉట్టినే వస్తుందేమిటి?

జీర్ణకోశం పట్ల శ్రద్ధ వహించానో కోటలో పాగా వేశామన్నమాటే.

తరవాత రక్తశుద్ధి; రక్తంలో మాలిన్యం కలిస్తేనే శరీరం రంగు డల్‌గా ఉంటుంది. అందుచేత "ఇనుము" ఉన్న పదార్థాలు అంటే క్యాబేజి, టొమాటో, బీట్ రూట్, ఆకుకూరలూ ఎక్కువగా తినాలి. కొందరు నీళ్ళు తక్కువగా తాగుతారు. నీళ్ళకూ కరువు ఉందిలెండి. కాదనలేము. కాని మనకొలవలసినవి వాడక మానుకుంటామా కొంచెం నీళ్ళ మోతాదు హెచ్చించాలి.







ఇంతవరకూ శరీరం లోపలి జాగ్రత్తలు చెప్పుకున్నాం. ఇకపై జాగ్రత్తలు ఎలాటివి తీసుకోవాలనుకున్నారు? కొందరు పర పర మని సబ్బు పాముకొని అయిదునిమిషాల్లో స్నానం కానిస్తే మరికొందరు తోమిందే తోమి గంటసేపు చేస్తారు. కావలిస్తే హాస్టల్ స్టూడెంట్స్ నడగండి విషయం. అదీ యిదీ కాక మోటు భాగాలైన పాదాలు, మోచేతులు వీపు బ్రష్షు పెట్టి తోమాలి. అధమం పది పది రోజులకోసారైనా సున్నిపిండి పెట్టి నలుగు పెట్టుకోవాలి. ఇక ఎంత తోమినా నలుపు వదలని భాగాలను క్లీనింగ్ మిల్కు తోగానీ, స్పిరిట్‌తోగాని వత్తి తుడిస్తే కొన్నాళ్ళకు ఆ నలుపు పోతుంది. ఇంకా ఓపిక ఉన్నవారు లేవగానే ఒక గ్లాసు గోరు వెచ్చని నీటిలో ఒక చెక్క నిమ్మ కాయ గాని రాత్రి పడుక్కునే టప్పుడు కప్పు పాలలో రెండు చెమ్చాల తేనెగాని వేసుకొని తాగితేసరి.

ఎండలో అతిగా తిరిగినవారు "సన్ బర్నింగ్" అని నల్లబడుతూ ఉంటారు. వాళ్ళు నిమ్మకాయ వాడితే తప్పకుండా నలుపు విరుగుతుంది.

బజార్లో బోలెడన్ని "ఫైరెనింగ్ క్రీములు" దొరుకుతున్నాయి కదా. వాటి మాటేమిటి అంటారా? వాటిలోమంచివిచూసి కొనుక్కోవాలి. అవి ఎలా వాడాలో వాటి మీదే రాసి ఉంటుంది. వీటికన్నా "ఆలివ్ ఆయిల్" అని దొరుకుతుంది. అది రోజూ (చలికాలంలో) ఒంటికి రాసుకొని స్నానం చేస్తేకూడా రంగు వస్తుంది.

పెద్ద తెల్లగా లేక పోయినా, ఉన్నరంగుని బాగా ఉండేట్టు చెయ్యడానికి ఈ సాధనాలు ఉపయోగ పడతాయి. ఇక "గ్లాసీ ఎపియరెన్స్" కావాలనుకునేవారు డాక్టరునుకూడా సంప్రతించ వలసి ఉంటుంది.

బ్యూటీపార్లర్‌లకు వెళ్ళి వందలు ఖర్చు పెట్టే బదులు మన కందుబాటులో ఉన్న ఈ సాధనాలతో ప్రయత్నిస్తే తప్పకుండా ఫలితాలు పొందవచ్చును.

## ముఖవర్చస్సు

మనవాళ్ళు ముఖాన్ని పద్మంతోనూ, చంద్రుడితోనూ పోలుస్తూ ఉంటారు. బుగ్గ



మీద మనం అద్దంలో చూసుకున్నట్టు చూసుకోవచ్చని కూడా ఒక కవిశేఖరుడు

చమత్కరించాడు. అంటే అంత సున్నగా వున్నాయన్నమాట ఆ బుగ్గలు. కళ్ళను చూసి "అరే చేపలు!" అనవచ్చట. అసలు కొందరు ప్రబంధనాయికలకు కంటికాంతి చెవులదాకా ప్రతిఫలిస్తూ ఉండేదట. పళ్ళ సంగతి సరేసరి. నవ్వితే నవరత్నాలకోసం కొందరు చూసేవారట. పెదవులు దొండ పళ్లు. ఇవన్నీ కలిపి ఆముఖం యెంతో అందంగా ఉండేట్టు శాయశక్తులా ప్రయత్నం చేసేవట.

మరి అంత కాంతిలేక పోయినా, అంత అందం లేకపోయినా సగమేనా ఉండొద్దా మనకి! వంటికి యెంత శ్రద్ధతీసుకుంటామో అంతకు అధమం నాలుగురెట్లు ముఖానికి శ్రమపడాలి. ముఖం అందంగా వుండేసరికి మనిషంతా అందంగా ఉన్నట్టే లెక్కకదా మనకి. సరే ముఖసౌందర్యం అనేసరికి స్నోలూ, పౌడర్లూ, లిప్‌స్టిక్కులూ మీ జ్ఞాపకాని కొచ్చాయి కదూ! ఆగండి. అవి అందంగా కనపడేటట్టు చేస్తాయి కానీ అవి కరిగిపోగానే అసలు రూపు బయటపడక తప్పదు.

మీరు క్రిక్కిరిసివున్న ఏ రైలు కంపార్టుమెంటులోనో ఉన్నారనుకోండి. లేక మండు వేసవి మధ్యాహ్నపు ఎండలో పని చేస్తున్నారనుకోండి. ఇవేవీ కాకపోతే మీ స్నేహితులతో పిక్నిక్‌కు వెడతారు. అప్పుడు ముఖం కడుక్కుంటారు. మేకప్ వుండదు. ఎలా వుంటుంది మీ ముఖం? జిడ్డు కారుతూ మొటిమలు బయటపడి అంద వికారంగానా? కాదు - మృదువైన చర్మంతో, కళ్ళ కాంతితో పంటి తళతళతో కనపడితే. ఓహో మీకు మాకూ (చూసేవారికి) ఎంత బాగుంటుంది! మరి ఎలా వస్తాయివన్నీ. రోజూ ఒక్క అరగంట కష్టపడితే ఎగిరి చక్కావస్తాయి.



శరీరచ్ఛాయకి జీర్ణశక్తి ఎంతముఖ్యమో కళ్ళకాంతికీ అంతే. చేపలు తింటే కళ్ళు పెద్దవౌతాయంటారు మావారు. ఏమో ఆ సంగతి నాకు తెలియదు. కాని హెమోగ్లోబిన్ శరీరంలో తగు పాళ్ళలోవుంటే రక్తం సరిగ్గా ప్రవహించి కళ్ళు పళ్లూకూడా కాంతివంతంగా వుంటాయి. దీనికోసం ఇనుము, సల్ఫర్ యెక్కువగా వున్న ఆహారం సేవించాలి. ఉల్లిపాయలు బాగా తింటే మంచిది.

ఇక పలువరుస. ఇది అందరికీ ముత్యాల వరుసలా ఉండకపోవచ్చు. కానీ ఉన్న వాటినే శుభ్రంగా వుంచుకోవచ్చుగా. పొద్దున్న ఎలా పళ్ళుతోముకుంటామో రాత్రికూడా అలాగే తోముకోవాలి. నోరు శుభ్రంగా వుండాలంటే "మౌత్‌వాష్"తో రెండుసార్లు పుక్కిలించి ఉమ్మాలి. లేదా ఒకస్పూన్ ఉప్పు గ్లాసుడు నీళ్ళలోవేసి పుక్కిలించాలి. దీన్నే "గార్గిలింగ్" అంటారు.

తరవాత ముఖంమీద నునుపు ఎలా అని కదా? ఒక వయస్సులో అందరికీ మొటిమలు రావడం సహజం. మొటిమలు పోవడానికి సులభమార్గం ఒక్కటే. చక్కగా ముఖానికి "కోల్డుక్రీమ్" రాసి ఆవిరిమీద ముఖాన్ని పది పదిహేను నిమిషాలుంచితే సరి. తరవాత చక్కగా "ఆలివ్ ఆయిల్" ముఖానికి రాసి సున్నిపిండితో నలుగు పెట్టాలి. మధ్యాహ్నం తీరిక వుంటే ఒక నిమ్మకాయ చెక్క ముఖానికి వత్తి రాసుకొని కొంచెంసేపయాక పాలతో కడిగేసుకోవాలి. ఆరోజు సబ్బు వాడకూడదు. తప్పకుండా నున్నగా ఆమేమార్గాలు యివీ. ఇప్పుడు మనకావలసిన స్నో పౌడర్‌లను వేసుకుంటే ప్రబంధనాయికల లిస్టులో అధమం ఆఖర్నేనా మన పేరుంటుంది.







## చేతుల సౌరు

....ఆతరువాత మనలిస్టులో కొచ్చేవి చేతులు. ప్రేయసి చేతివేళ్ళతో ప్రియులు ఆడుకొనే వారట. తమలపాకులా మెత్తగా వుండాలి (ట) అరచేతులు.

ఇంగ్లీషువాళ్ళు బెండకాయల్ని "లేడీస్ ఫింగర్స్" అన్నారు ఎందుకనుకున్నారు? చేతివేళ్ళు సన్నగా పొడవుగా వుంటాయి (ఉండాలి) కాబట్టి. అసలు పోదురూ మరీ బడాయి. చేతులకు అందమేవిటి? అంటున్నారా? అదేమిటండీ కొందరి అరచేతులను చూస్తే కవిత్వంపుట్టుకొస్తుందంటాడు ఒక భావకవి. అందమైన వస్తువుల్ని సుతారంగా అలాటి చేత్తో పట్టుకుంటే ఆవస్తువుకే లేని అందంవస్తుంది. అయితే చాలామందికి చేతివేళ్ళు అరచేతులు మోటుగా వుంటాయి. ఎంచేత? అంటే లకామని "మోటు పనులు చెయ్యడంవల్ల" అంటారు. నిజమే కొంత వరకు. కాని తగినశ్రద్ధతీసుకుంటేమనవేళ్లూ అలాగే అవుతాయి. పాశ్చాత్య స్త్రీలు మోటు పనులు చేసేటప్పుడు గ్లౌజ్ వాడతారు. మనం కూడా వాడితే మంచిది. మరి యిష్టంలేని వాళ్ళో? సాధ్యమయినంత వరకూ ఏవీ చేతులతో ముట్టుకోకుండా చెయ్యడం అలవాటు చేసుకోవాలి. ఇక అరిచేతులు పగలకుండా ఉండాలంటే చక్కగా "పాండ్స్ క్రీమ్"తోకాని నెయ్యితోకాని, కొబ్బరినూనెతోగాని "మసాజ్" చెయ్యాలి.


## నఖ సౌందర్యం

ఇకగోళ్ళ విషయం. గోళ్ళలో మురికి చేరకుండా గోళ్ళబ్రష్‌తో శుభ్రం చెయ్యాలి. ఆ తరవాత "నెయిల్ కట్టర్"తో ఆ చివర్నుంచి ఈ చివరకు కత్తిరించుకుంటూ రావాలి. అప్పుడు ఆ కొనదేలిన గోళ్ళకు రంగు వేసుకోవచ్చు. అతి తెల్లగా ఉన్న వారు ముదురురంగు పాలిష్ వేసుకోవచ్చు. చామన ఛాయగా ఉన్నవారు నాచురల్ కలర్ పాలిష్ వేసుకుంటే బాగుంటుంది. గోళ్ళు కొందరికిపెరగవు. అలాటివారు "కాల్షియమ్" ఎక్కువగా తీసుకోవాలి. అందుకే కదండీ మనవాళ్ళు తాంబూలం, పాలు ఎక్కువగా సేవించ మన్నది! ముఖానికి, చేతులకు కూడా కోల్డుక్రీమ్ మర్దనచేసి ఆవిరిపడితే కరకుతనం పోయి ఎంచక్కా మృదువుగా ఉంటుంది. చేసి చూడండి. □□□



# మాయాతీత స్వరూపిణో!

రామలక్ష్మి



ఈరోజు నాకు 'స్త్రీ' అంటే ఎవరో యేమో స్పష్టంగా అర్థమయింది. అలా అర్థమవడానికి ముందు చావుదెబ్బలు తినవలసినంతపని అయింది. దానికంతకూ కారణం మాఅన్నయ్య చాదస్తమో, నా సినిమా వ్యామోహమో? ఏదేమైనా జీవితంలో ఒకమంచి అనుభవం అది! తెలుసుకున్న అమోఘ సత్యమే నాపాలిట!

ఆరోజు అసాధారణంగా తయారయాను; ఇలా అలాకాదు - అపూర్వంగా....ఒకసారి అద్దంలో చూసుకొని, నన్ను నేనే ప్రేమించుకొని వెనక్కు తిరిగానో లేదో అన్నయ్య ఎదురు....

ఒంటి బ్రాహ్మణుడని ఎవరు లెక్కచేస్తున్నారు కానీ - శుద్ధ బ్రాహ్మణుడి అవతారం.

మా అన్నయ్య నొకసారి చూస్తే చాలు ఎవరికైనా తెలిసిపోతుంది - పరమ ఛాందసుడు. పూర్వాచార పరాయణుడని. చూస్తే నిండా ముప్ఫయ్యేళ్ళు కూడా వుండవు - ఏమిటో మరి - నుదుటిమీద ఆ విభూతి రేఖలపైన నయాపైసంత బొట్టు. తెల్లని ధోవతి; పైన కంఠాన్ని కప్పుకొన్న వెడల్పాటి శాలువ; కనీ కనిపించకుండా క్రాపులో దాగిన పిలక.

ఎంతకోపం వచ్చినా ప్రవరాఖ్యుడిలాంటి అన్నయ్యను చూడగానే యెక్కడికో పోతుంది అదంతా.

వదిన ఆజ్ఞాపించదెందుచేతనో గాని, ట్వీడ్ సూటుగనక వేశాడంటే ఏ కాలేజీ 'వరూధినో' వున్న పళాన అన్నయ్య కాళ్ళ మీదపడదూ? ఈ వదిన వున్నదే ఆవిడ ఒక రకపు పతివ్రతా శిరోమణి. మళ్ళీ ఇద్దరికీ అప్పుడప్పుడు గిల్లికజ్జాలు రాకనూపోవు.

'సరే! మనుషులకు మనుషులెదురవకపోతే మానులెదురౌతాయా?' అంటూ ఒక సామెతను అడ్డదిడ్డంగా తయారుచేసుకుని ముందుకు నడవబోయాను.

అన్నయ్యకు గట్టి అనుమానం తగిలినట్టుంది. అప్పుడే లోపలిగదిలో నుండి గుమ్మంలోకి అడుగుపెట్టిన వదినను చూసి "వాడెక్కడికి వెళ్తున్నట్టు?"అని అడిగాడు. ఇలాటి ప్రశ్నలకి జవాబులు చెప్పవలసి రావడం అలవాటే ఆవిడకి.

"పట్నంకాబోలు - కొత్త సినీమా వచ్చిందట!"

వదిన జవాబు వింటూనే నావైపు తిరిగి చూశాడు అన్నయ్య.

"అంతేనా? ఏమిట్రా ఈ సినిమా పిచ్చి నీకు వదలదా? అక్కడ ఉన్నన్నాళ్ళు లక్ష సినిమాలు చూసుంటావుకదా - ఇంకొన్నాళ్ళు ఇలా చూస్తే పిచ్చెత్తిపోతావు...."

"ఉండన్నయ్యా: శపించకు. నాకు కాలేజి చదువెందుకు చెప్పించావు? అదే పొరబాటు. నీకు తెలీదుకాని ఈనాడు కాలేజీకి, సినిమాకి అవినాభావ సంబంధం ఉంది. సాధారణంగా రెండూ ఒక్కచోట తటస్థపడుతుంటాయి."

"ఏడిశావు: ఆ అష్టమస్కంధం పూర్తి చెయ్యరా అని మొత్తుకున్నా విన్నావుకావు. అయితే ఎన్నిగంటలకి తిరిగి తమరి రాక?"

"రాత్రి పదకొండింటికి వచ్చేస్తాగా!"


నాకు తెలుసు-అన్నయ్య ఒప్పుకుంటాడని. మా అన్నయ్య దృష్టిలో నేనొక తల్లి, తండ్రి, ఉద్యోగంలేని పాతికేళ్ళ పనికెధవని. అదిగాక మా అన్నయ్య మాటకు వ్యతిరేకంగా పోతేనే నాకు శుభం కలుగుతుందని నా నమ్మకం.

● ● ●

ఆ ఘట్టమలా గడిచింది- నా ఖర్మ కాకపోతే ఎప్పుడూ తప్పని ఆ ఖరీదన్ను ఆ రోజలాతప్పిపోవాలా? తప్పిపోతేపోయింది. ఏసత్రంలోనో మేనువాల్చి తెల్లారాక పూరుపోయివుంటే ఎటువంటి బాధా, ఏ గాధా లేకపోను. ఆపద్బాంధవుడికిమల్లే ఆ స్నేహితుడు ఆదుకోవడమేమిటి? స్నేహితులు కాకపోతే చెట్లాదుకుంటాయా? అంటారు కొందరు. అదీనిజమేకాని - ఆ స్నేహితుడికి ఒక అప్సరసవంటి చెల్లెలుండడమే నా దురదృష్టం. ఆవిడైనా అలా అపరంజి బొమ్మలా కదలక మెదలక ఊరుకుంటే తనకి నష్టమేమీలేకపోను. ఎదొచ్చి ఆవిడ తన సౌందర్యాన్ని విజృంభింపజేసి అనేక విధాల ప్రదర్శించడమే నా పాలిట ప్రమాదంగా పరిణమించింది.

● ● ●

ప్రొద్దున్న లేవగానే - ఆరోజుకి అక్కడే వుండిపోవలసిందని బలవంత పెట్టాడు మా గోపాలం - నా స్నేహితుడు. పైగా నేను గనక తన యింట్లో ఉండకపోతే ఏదో 'సర్వకర్మపరిత్యాగం' అట - అలాటివేవో నాలుగైదు చేస్తానంటూ ప్రమాణాలు ప్రవచించాడు కూడా.




కాదు వెళ్ళిపోవాలంటున్నాను; అంతలో అవతలిగదిలో ఆ అమ్మాయి కనిపించడం, నా బెట్టుసరి గొంతుకను ఏదో అడ్డగించడం ఒక్కమారే జరిగిపోయినాయి. ఆ రూపరేఖావిలాసాలు, మిడిసిపాటు, అలక్ష్యం. అవన్నీ చూస్తుంటే అవివాహితలాగే తోచింది. నా దగ్గరా ఏదైనా సాగడం? అవులిస్తే పేగులు లెక్కెస్తాను.

అప్రయత్నంగానే నా సంభాషణ ధోరణి మారింది.

"మీ ఇల్లొక లక్ష్మీవిహార్‌లా కనిపిస్తుందోయ్!" అన్నాను ద్విభావ సమ్మేళనంతో.

"మమ్మల్ని పొగిడేస్తున్నావ్ కాని నీకేం లోటు? ప్రక్కను హిమాలయమంత అన్న ఉన్నాడు; ఏ చైనావాడూ నీమీదకు దాడి చెయ్యలేడు." గోపాలం గోల.

"నువ్వన్నది రైటే! మా అన్నయ్యా వదినా సాక్షాత్ సీతా రాములైతే నేను లక్ష్మణదేవరనే! అయితే రోజూ అష్టమ స్కంధాలూ, అరణ్యకాండలూ చదవలేక చస్తున్నాను. ఎంతేనా బి. ఏ. చదివినవాణ్ణి. రేపో మాపో ఒకమాదిరి ఉద్యోగం, చిక్కకపోదు. అన్నిచోట్లకి అప్లికేషన్లు పారేశాను....ఇంక ఇంటర్వ్యూ ఆర్డర్స్‌కోసం జపం చేస్తూ, అన్నయ్య ఆజ్ఞ ప్రకారం రామాయణాదులు పారాయణం సాగించడంలో వున్నాను...."

"బనా మీ అన్నయ్యకి మంచివ్యక్తిత్వం ఉన్నదోయ్! లేకపోతే నువ్విలా జడవవు."

చెప్పొద్దూ. అన్నయ్యని పొగిడితే నన్ను పొగిడినంత తబ్బిబ్బవుతాను.

గుమ్మంవద్ద అలికిడై అవంకచూశాము. మెరుపుతీగ....! అంతవరకు నాకళ్ళల్లోనే మెదులుతున్న అప్సరస తిన్నగా టీ కప్పులు ధరించిన హస్తాలతో, చిరునవ్వు ధరించిన అధరాలతో వచ్చేస్తూంది....

నాలో వివేకం నన్నాగమని సైగచేసింది. కానీ ఆలోచన అంతమవలేదు....ఎవరీ తటిల్లత? అని మనసులో ప్రశ్న వేసుకుని సందేహ నివృత్తికోసం గోపాలం వైపు చూశాను. నాఊహ సరైనదే. ఆపిల్ల అతని చెల్లెలే. పైగా ఆ తటిల్లత పేరు 'హేమలత'ట. రెండుసార్లు - ఆ భామాతిలకాన్ని

హేమ సుమ లతికను పరికించాను. లక్ష్మీ స్వరూపంవలె సాక్షాత్కరించిన ఆమె నా పాలిట వరలక్ష్మి అయితే మరింత బాగుండును అనే దురాశా జనిత దురూహ హృదయంలో మసిలిపోయింది.

లోలోపల ప్రవహిస్తున్న ప్రశాంతానందతరంగిణి, సుందరతర స్వప్నవాహినిని జోడుచేసుకుని వెల్లువై పొర్లడానికి ఉద్రిక్తరాలౌతున్నది.

గోపాలం అపార్థాలు చేసుకోని మంచి మిత్రుడు. అతని సహృదయానికి సాక్షిగా మేం ఒకరి కొకరం బాగా పరిచయమయ్యాం.

• • •

ఆ సాయంత్రం నా అభ్యర్థనను ఆమె త్రోసిపుచ్చలేదు. నాతోపాటు బీచి విహారానికి అంగీకరించింది. కాకపోతే ఆమె హృదయపూర్వకంగా వస్తున్నదో, మొగమాటానికి వస్తున్నదో మాత్రమే గ్రహించ ప్రయత్నించలేదు నేను.

ఆమెలోని ఆకర్షణ నాలో నూతన చైతన్యాన్ని ఆవిర్భవింపచేస్తోంది. కాలేజీ యువతులతో అతిచతురంగా మాట్లాడడమే తప్ప యిటువంటి అనుభవం మాత్రం ఎప్పుడూ కలగలేదు——

ఎన్నడూలేని ఉత్సాహం నిరర్గళంగా ఉరకలు వేసింది, ఆనందపుటంచుల నందుకుంటున్నాను. మామధ్య చనువు అధికమౌతున్నకొద్దీ నా ధైర్యంకూడా ఇనుమడించింది.

"ఒకపాట పాడండి!" అన్నాను చల్లని తడిగాలిని అనుభవిస్తూ.

ఆమె పాటను అటువంటి సమయంలో నేను కోరడానికి కారణం లేకపోలేదు. మొదటి వీక్షణంలోనే ఆమె సాక్షాత్తు లక్ష్మీ మూర్తిగా కనిపించింది. ఆ తరువాత గానం సరస్వతీదేవికి వారసు రాలనిపించుతుంది. అన్నింటా భేషనిపించుకుంది. పైగా స్నేహితుణ్ణయాను ఇప్పుడు.

అందుకే సాహసించగలిగాను - ఒక పాట పాడమని అడగటానికి.

"సరే" అంది-మధురగళాన్ని విప్పింది. ఒక గీతం-కాదు వేయిగీతాల సాటి అయిన మధుర గీతం. శ్రుతిమధురమైన గానాన్ని పొగడలేని వాళ్ళుంటారా?

అభినందించాను.

"పొగడటంలో ప్రవీణులే" అంది పడమటి అస్తమయ కాంతిని చూస్తూ.

"పొగడటంలో ఏముంది? మీరు లక్ష్మీ సరస్వతుల ప్రతిబింబంగా కనిపిస్తున్నారు"

"ఇంకా తక్కువచేశారు" నవ్వుతూ అంది.

వెలుగు నీడల తెర వున్నట్లుండి జారింది మామధ్య. కంగారు పడుతూ లేచింది ఆమె "పదండి! చీకటి పడుతున్నది."

హృదయం చంచలంగా స్పందించింది. ఆందోళిత మనస్కుణ్ణయాను. ఏదో పోగొట్టుకున్నప్పటి తత్తరపాటు.

"హేమా! మీతో ఒకటి చెప్పాలి!"

"ఏమిటి?" నావైపు చూస్తూ అడిగింది.

కొద్ది వెలుగులో ఆమె ముఖకవళికలు మారడం స్పష్టా స్పష్టంగా తెలుస్తున్నది.

ఆమెతోపాటు మెల్లగా అడుగులు వేస్తూ అన్నాను:

"నాపైన మీకెటువంటి అభిప్రాయం ఉంది?"

"మంచి స్నేహితులు అనిపిస్తున్నారు."

"ఈ స్నేహాన్ని పటిష్ఠం చేసేమార్గం లేదంటారా?"



"అంటే?"

"హేమా! మనిద్దరం వివాహం చేసుకుంటే బావుంటుందని నా అభిప్రాయం.... మరి మీ ఉద్దేశ్యం....ఎటు"

"ఛీ!"

ఉలిక్కిపడ్డాను. అంతవరకు అతి సహజంగా వుండిన ఆమె యీమాటకి యింత అసహ్యపడి పోతుందని అనుకోలేదు.

"క్షమించండి....స్నేహానికి వివాహానికి లంకె పెడుతుంటే ఒప్పుకోలేక పోయాను. అంతే!" గొంతు తగ్గించి అంది.

నమ్మలేక పోయాను ఆమె కఠినత్వాన్ని. అవమానం కలిగింది.

"స్నేహం నుంచే కదా ప్రేమలోకి దిగటం - ప్రేమ వివాహానికి దారితీస్తుంది." అన్నాను కాలేజి జ్ఞానాన్ని వుపయోగించి.

"ఇప్పుడు ప్రేమ ప్రస్తావనదేనికి?" ఆమె కనుబొమలు ముడిపడ్డాయి.


ఆమెను ఏడిపించాలనిపించింది అప్పటికి - మగవాణ్ణి కాబట్టి.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను." అనేశాను చటీమని.

ఇంకేమిటి? ఊహించిన ఉరుములే ఉరిమాయి; అనుకున్న పిడుగులే రాలాయి.

"ఛీ! బ్రూట్స్! కొంచెమయినా మర్యాద అనేదిలేదు...."సణుగుతూ అని-

"చూడండి మిష్టర్! మీలాటివాళ్ళతో మాకు పడదు. మీకు కావలిసినవి స్నేహాలు కావు....అర్థ విహీనమైన ప్రణయాలు. అలాటి వెక్కడ లభిస్తాయో వెదుక్కోండి. ఒకస్త్రీకి, పురుషుడికి మధ్య స్నేహం నిలవదని నిరూపించారు. ఇంకోసారి యిల్లాంటి ప్రయోగాలు చెయ్యబోయారంటే - ఇప్పుడు నోటితో అయింది - ఆనక చేత్తో మహిమ




చూపించవలసి వుంటుంది. నమస్తే!" రివ్వున వెళ్ళిపోయింది మెరుపుతీగ.

స్వల్పకాలమే కట్టెదుట కమనీయంగా మెరిసినా: కలకాలం కళ్ళవెనుక నిలచిపోయే విద్యుల్లత!!

స్త్రీగా మిగిలిన శక్తిస్వరూపాన్ని కూడా చూపి వెళ్ళిపోయింది. చిత్రం! ఎంతలో యెంత జరిగింది!

• • •

ఇంటికి వచ్చిపడేవరకు ఊపిరాడలేదు. పదిరోజులనుంచి ఆమె ప్రవర్తననుగురించి ఆలోచించగా ఆలోచించగా 'యిప్పుడు తెలిసింది 'స్త్రీ' అంటే ఎటువంటి శక్తిస్వరూపిణో; ప్రతిస్త్రీలోను లక్ష్మీ సరస్వతుల ప్రభావమేగాక అంతో యింతో 'దుర్గాంశ' వుంటుంది. సమయానుకూలంగా తన వరాలను వినియుక్త పరుచుకుంటుందన్నమాట ఆడది. ఎంత అవమానం జరిగినా - ఆ




గు ప్తరహస్యాన్ని, నిగూఢ సత్యాన్ని తెలుసుకున్నందుకే శిఖరారోహణ చేసినంత ఆనందంగా వుంది.

అదుగో అన్నయ్య వస్తున్నాడు....దశమస్కంధంలో డెబ్బయ్యోపేజీ చదివినట్టు చెప్పాలి - అరె! అరుదైన చిరునవ్వు ప్రకాశిస్తూందే మా అన్నయ్య పెదాలమీద. ఇవాళ ఏదో విశేషం వుండాలి మరి—

లోపలికివస్తూనే అడిగేశాడు అన్నయ్య!
"ఏమిట్రా అలా వున్నావ్ ?"

"అన్నయా! మరేమో .... దశమ."
తడబడ్డాను.

"అదిసరేలే! ఈవేళ నీతోఒకవిషయం మాట్లాడాలి...."

"ఏమిటన్నయ్యా అది ?"

వదినను కేకేశాడు. ఆవిడ వచ్చి అన్నయ్య అరుదైన మాటలు చెవులు రిక్కించి వినసాగింది.

"నీ స్నేహితుడట-గోపాలకృష్ణమూర్తి. ఆయన నాకు తెలియకపోయినా నేనాయనకి తెలుసట. బజార్లో కలుసుకుని కొంతసేపు మాట్లాడి వెళ్ళాడు. సారాంశం - వాళ్ళ చెల్లెలు నిన్ను పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకుందట. మన అభిప్రాయాలు ఎలా వుంటాయోనని నన్ను అడిగాడు. మనవారే కాబట్టి మిగిలిందంతా 'నా తమ్ముడియిష్టం' అని చెప్పేశాన్నేను. ఏమంటావ్? నువ్వింతకుముందు అమ్మాయిని చూశావటకదూ ?"

ఉక్కిరి బిక్కిరయింది నావని. మెదడులో ఆలోచనల రైలు ఠక్కున ఆగిపోతుంటే అనుకోకుండా సిగ్నల్ పడినట్టు వెనువెంటనే ప్రశ్న.

"ఆఁ!, మొన్న వెళ్ళినప్పుడే చూశాను."
నా సమాధానానికి వదిన ముక్కుపుడక ఫక్కున నవ్వింది.

"అబ్బాయిగారు మాకు చెప్పకుండానే పెళ్ళిచూపులు నడిపారన్నమాట !" నాకు ఉన్న మతిపోయింది.

'అతివ అంటే ఎవరు ?' అని నన్ను నేను ప్రశ్నించుకొనేలోగా —

అన్నయ్యకూడా వదినతో నవ్వులు కలిపాడు. □□□

వచ్చే సంచికలో


## స్నేహితులు

మధురానుభూతులతో
ఘనసును నింపే పెద్దకథ
రచన :
కొడవటిగంటి
కుటుంబరావు



పాడువేల రేడికా
ట్రాన్సిస్టరా?
కాదోయ్ - మాసిస్టరు
క్రిపా! షేవా!
సిలోనా! వివిధభారతా?
సార్







చెలికాడు విన్నే
రమ్మని పిలువా
పిస్తనికేలా-
చేరరావేలా-
హాయిని- ట్రాన్సిస్టరు
ఎక్క(డా) పోయిందనుకున్నా!
వార్తలు
చదువుతున్నది

# రాంబాబు డైరీ

అక్టోబరు 12 :

ఇవాళ అద్దంలో తీక్షణంగా చూసేసరికి అనతికాలంలో నాకు బట్టతల సంప్రాప్తించే సూచనలు కనిపించాయి. మేధావంతుణ్ని అవుతున్నాననడానికి ఇది నిదర్శనం అని చెప్పక తప్పదు. భాస్కర్రావుకిగానీ, సారధికిగానీ, ఈ విషయం చెబితే నవ్వేస్తారు.



మహామహులందరూ ఒకప్పుడు కొందరి పరిహాసములకు గురికాబడినవారేకదా. బట్టతల అనునది ప్రేమకు గొడ్డలిపెట్టు. (మేధస్సు గొడ్డలివంటిదని భావము)

అక్టోబరు 20 :

చైనావారు సరిహద్దు పొడవునా భారీ ఎత్తున కాల్పులు జరిపారు. దేశం అట్టుడికిపోయింది. (రూపకాలంకారం అనుకుంటాను. దేశానికీ అట్టుకూ అభేదం. మెటఫారిక్ స్టేట్‌మెంట్) నాలో ఉడుకు రక్తం పొంగులు వారింది. దేశభక్తిని నిరూపించుకోదానికి ఇదే అదను అని నెహ్రూగారు సందేశమిచ్చారు. కమ్యూనిష్టులకు మంచి ఛాన్సు. (రచయితలకికూడా) చాలా రోజుల తర్వాత ఇవాళ మావయ్యగారింటి కెళ్ళాను. మావయ్య ఆటకమించి గ్రాంఫోనుదింపి అర్జెంటుపనుందని వెళ్ళిపోయాడు. వేమూరి



గగ్గయ్య రికార్డు పెట్టాను. పెద్ద శృతిలో మొదలెట్టి క్రమేణా శృతి తగ్గించి తగ్గించి అలా అలా మంద్రాతి మంద్రంలోకి దిగిపోయాడు. 'అమోఘం అద్భుతం బ్రహ్మాండమైన ఎక్స్పెరిమెంటు. ఈ మాదిరిగా ఒకే పద్యాన్ని 14 శృతుల్లో ఈ కాలపువాళ్ళు చస్తే పాడలేరు' అన్నాను ఆవేశంతో. వరలక్ష్మి కడుపు చెక్కలయ్యేట్టు నవ్వుతోంది. 'గ్రాంఫోను కీ తగ్గిపోయి అలా పాడుతోంటే అద్భుతం అంటున్నాడు చూడవే' అంటూ వాళ్ళమ్మతో చెప్పి నవ్వుతోంది. నాకు షేమ్ అనిపించింది. కీ తగ్గిన మాట నిజమే కావచ్చుగానీ నిజంగా అలాంటి ఎక్స్పెరిమెంటు చేస్తే అది సంగీత చరిత్రలో చిరస్థాయి కాగలదు. ముందు తరాలవాళ్ళకి యెవరికో ఈ ఐడియా తట్టి తీరుతుంది. నామేధ యెప్పుడూ కాలంకంటే ముందుపరుగెత్తుతూ వుంటుంది. నవ్వు ఆరు రకములని కాటోలు శాస్త్రకారుడు వచించియున్నాడు. అందులో వరలక్ష్మి యీరోజు నవ్విన నవ్వు ఏ రకమునకు చెందునో. మోటారు సైకిలు తొక్కేయోగం యీ జన్మకు వుందో లేదోగదా. ఇష్టఫలసిద్ధిరస్తు.



అక్టోబరు 24 :

ఇంటాయన వచ్చి అద్దెకోసం గలాటా ప్రారంభించాడు. రెండునెల్ల అద్దె తక్షణం యివ్వాలన్నాడు. ఇంత ఆలస్యంచేస్తే కుదరదన్నాడు. 'ఆలస్యమనగా నేమి' అన్నాను. 'రెండు నెల్లంటే ఆలస్యంకాదా' అన్నాడు. బుద్బుదప్రాయమైన మానవ జీవితంలో రెండు నెలలనగా నెంత అన్నాను. ఆయన తెల్లపోయాడు. మళ్ళీ తేరుకుని వేదాంతం కట్టిపెట్టండి' అన్నాడు. "భారతీయ సంస్కృతికి వేదాంతమే వెన్నెముక. ఋగ్వేదకారుడు యేమన్నాడో తెలుసా" అంటూ మొదలెట్టేసరికి ఇహ కిక్కురుమనకుండా వెళ్ళిపోయాడు. నిత్యజీవితంలో 'వేదాంతముయొక్క అవశ్యకత ఎంతటిదో తెలిసివచ్చింది. అసలీ వేదాంతము వల్లనే భారతదేశము మనగలుగుచున్నది. ఈ వేదాంతము వల్లనే డాక్టర్ రాధాకృష్ణన్ ప్రసిద్ధుడయ్యెను. వేదాంతం మీద రేపు 'సుజనమిత్ర'లో వ్యాసంరాయాలి, మనస్సు బహు చంచలమైనది. మళ్ళీ సితార్‌మీద మోజు పుట్టింది. ఇవాళ తిలక్‌హాల్లో కచేరీ



జరిగితే వెళ్ళాను, పైజామా, లాల్చీ వేసుకుని, కొంచెం జులపాలు పెంచుకుని, మెళ్ళో బంగారపు గొలుసు వేసుకుని సితార్‌వాయిస్తుంటే యమపోజుగావుంటుంది. 'ఎయిమ్ హై' అన్నారు పెద్దలు.

అక్టోబరు 28 :

బట్టతలకు మేధాసంపత్తికి గల అవినాభావ సంబంధమును గురించి యీరోజు బహుతీవ్రంగా ఆలోచించాను. ఎంతగా ఆలోచించినా సమస్య తెగలేదు. (శబ్దాశ్రయ హాస్యమనగా నిదియే). రోజూ యింత తీవ్రంగా ఆలోచిస్తే వారంరోజుల్లో బట్టతల వచ్చేస్తుంది. బట్టతలవస్తే ప్రేమించే అర్హత పోతుంది. పెళ్ళి అయిన తర్వాత ప్రేమయొక్క అవశ్యకత లేదు కనుక అప్పుడు బట్టతల వచ్చినా పరవాలేదు. ఈలోగా మేధావి (ఖర్వాటుడు)నికాకూడదు. బట్టతలవల్ల అందము కుంటుబడునను నిర్వివాదాంశము. అయినా నెహ్రూ, రాధాకృష్ణన్, కృశ్చేవ్ మున్నగువారి కోవలో చేరుటకంటే అందము ప్రధానము కాదు కదా. అసలు అట్టే ఆలోచిస్తే దీనిమీద ఒక హ్యూమరికల్ వ్యాసము రాయాలనిపిస్తోంది. భారతదేశంలోని షెడ్యూలుకులాలు, జాతులవారిని ఫ్రాన్స్‌దేశంలోని నోబుల్స్‌తో పోల్చవచ్చు. ఇవాళ ఫ్రెంచి రివల్యూషన్ గురించి మేస్టారు బ్రహ్మాండంగా చెప్పారు. అరిష్టాలన్నింటికీ అబలకారణం! ఔరా!!

అక్టోబరు 31 :

భారతదేశం చస్తే తటస్థ విధానాన్ని వదిలిపెట్టదని నెహ్రూగారుచెప్పారు. మనం పాశ్చాత్యకూటంలో చేరాలని ప్రతిపక్ష నాయకులు వాదిస్తున్నారు. నే నీ విషయంలో పూర్తిగా నెహ్రూగారితో ఏకీభవిస్తాను. లేకపోతే మాటిమాటికి విధానం మారుస్తూ వుంటామా? అది మన వ్యక్తిత్వానికేదెబ్బ. (షరా: మరి అవసరమైతే మన అవసరాలకు అనుగుణంగా తటస్థ అనే పదానికి

అర్థాన్ని సవరించుకోవచ్చు. రాజ్యాంగ సవరణ మోడల్లో). అసలు బస్సును కని పెట్టినవాడు కొలంబస్సు అయివుంటాడని నా నమ్మకం. కష్టపడ్డ వాడికి కీర్తి దక్కక పోవడం మనమెల్లరం ఎరిగినదేకదా. చరిత్ర కారులు ఈ విధంగా తనకు అన్యాయం చేస్తారని వూహించే కొలంబస్సు ఆ వాహనానికి తన పేరులో సగం పీకి బస్సు అని నామకరణం చేసి వుంటాడని నా అనుమానం. దీనిపై పరిశోధన సాగించ వలసిన అగత్యం ఎంతైనా వుంది. ఈ మధ్య మరీ ఇంటలెక్చువల్ (మేధాసంబంధమైన) గొడవల్లోపడి స్త్రీ సౌందర్యాన్ని విస్మరిస్తున్నాను. ఆ విషయం జ్ఞాపకం వచ్చి చాలాబాధపడ్డాను. జీవితమాధుర్యాన్ని చాలా కోల్పోయాను. పక్కింటి కోతిని చూస్తే జాలేసింది. పాపం ఈ మధ్య నేను అమ్మాయి కేసి చూట్టం లేదు. చిక్కిపోయింది. త్వరలో చిత్రకళాభ్యాసం ప్రారంభించాలి. టాగోర్ స్కూల్ ఆఫ్ ఆర్ట్లో ఇప్పటికే నాకు కొంత ప్రవేశముంది.

## నవంబరు 4 :

భాస్కర్రావు హిప్నాటిజం ప్రాక్టీసు చేస్తున్నాడు. తెల్లారు ఝామునలేచి స్నానం చేసి ముఖాన పెద్ద కుంకుం బొట్టు పెట్టుకుని పద్మాసనం వేసి కూర్చుంటున్నాడు.



ఎదురుగా గోడమీద పెద్ద చక్రం గీసి మధ్యలో చుక్క పెట్టి దానికేసి తీక్షణంగా చూస్తున్నాడు. హిప్నటైజ్ చేస్తే ఎవరినైనా సరే ఐన్స్టీన్ అంత గొప్పవాడిగా, లేదా రాంబాబు అంత చవటగా తయారు చేయచ్చుట. నాకు వొళ్ళుమండి పోయింది. నేను ఐన్స్టీన్ అంత గొప్పవాణ్ణి కావడం అసంభవమని అతనిభావం. పూర్ ఫెలో. పొద్దున్న తలంటి పోసుకుని తల తుడుచుకుని, దువ్వుకోకుండా అలాగే అద్దంలో చూసుకుంటే మొహంలో కొంచెంగా ఐన్స్టీన్ పోలికలు కనిపించాయి. జుట్టు అలాగే వుంచుకుని మంచి మూడ్లోకి వెళ్ళి థియరీ ఆవ్ రెలెటివిటీని గురించి థింక్ చేస్తూ ఫొటో తీయించుకోవాలి. (దుబ్బుమీసం పెంచితే మరీ మంచిది) ఏమో! ఎవరు ఏ నాటికి ఎంత గొప్పవారు కానున్నారో ముందు తెలుస్తుంది గనకనా. మానవునికీ భూమికీ ఏదో అవినాభావ సంబంధం వుందని నా అనుమానం. ఎందు కంటే భూమిలోనుంచి పంటలు మొదలగునవి పండుతాయి. వాటి వల్లనే మనిషికి తిండి లభిస్తూంది. తిండి లేకపోతే మనిషి లేదు. మనిషి మట్టిలో నుంచే పుట్టాడంటారు. ఇందుకేగామోసు ఈ మధ్య ఇటువంటి బ్రిలియంట్ ఐడియాస్ ఎన్నో తట్టుతున్నాయి. ఏంలాభం? గుర్తించేవాళ్ళు లేరు.

## నవంబరు 9 :

సత్యజిత్రాయ్ అనే ఆయన తీసిన 'పథేర్ పాంచాలీ' సినిమా చూశాం నేనూ సారథీ. పిక్చరు ఫర్వాలేదు. అక్కడక్కడ సాంకేతికలోపాలు కొన్ని వున్నా మొత్తం మీద బాగానే వుంది. దర్శకుడు కృషిచేస్తే పైకి రాగలడని ఆశిస్తున్నాను. దీనిమీద 'సుజన మిత్ర'లో సమీక్ష రాశాను. పాపం నెహ్రూగారి తాపత్రయం చూస్తోంటే జాలే



స్తోంది. నా వంటి నవయువకుల భుజస్కంధములపై భారము నుంచి ఆయన ఇక విశ్రాంతి తీసుకొన కూడదా? లేకున్న ఒక రాజకీయ పాఠశాలను బెట్టి తటస్థవిధానము శాంతియుత సహజీవనము, సోషలిజము మున్నగు విషయములపై మంత్రులచే పాఠములు వల్లె వేయించ వచ్చునుగదా. తాపత్రయం అంటే మూడు తాపములు అని అర్థం అయుంటుంది. (కవిత్రయంలాగా). వాటిల్లో ఒకటి విరహతాపం కావచ్చు. ప్రస్తుతం నాకున్నది అదొక్కటే. కోతి పొలయాలుక వహించినది.

## నవంబరు 13 :

భారతదేశంలో ఎవ్వరికీ బ్రతికుండగా కీర్తి రాదుట. చచ్చిపోయిన తర్వాత చవటకి కూడా బోలెడుపేరు వస్తుందిట. అందుకని భాస్కర్రావు ఆత్మహత్య చేసుకుందామనుకున్నాట్ట. కాని తన ప్రేయసిని ఇంకెవడైనా పెళ్ళిచేసుకుంటాడేమోనని గామోసు ఆత్మహత్య చేసుకోకుండా యింకోపథకం వేశాడు. తను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఉత్తరం రాసిపెట్టి ఎక్కడికో వెళ్ళిపోతాట్ట రహస్యంగా. అతను చచ్చిపోలేదన్న సంగతి నాకు, సారధికి, తన ప్రేయసికి తప్ప ఎవ్వరికీ తెలీకూడదట. (అమ్మాయికి తెలీకపోతే యింకెవర్నైనా పెళ్ళిచేసుకోవచ్చు - అందుకని). అతని ఆత్మహత్య వార్తని నేను పత్రికల్లో వేయించి ప్రచారం చెయ్యాలిట. అతని పాటలనీ, పద్యాలనీ సారధి సభల్లో పాడాలిట. చందాలు పోగుచేసి 'అజ్ఞాతకవి అమర గీతాలు' అని పుస్తకం వేయించాలిట. అప్పుడు తనకి బోలెడు కీర్తి వస్తుందిట. రెండు సంవత్సరాలు పోయాక మళ్ళీ తను తిరిగివచ్చి 'చూశారా గాడిదల్లారా బతికుండగా నన్ను గుర్తించలేక పోయారు'

అని జనానికి బుద్ధిచెబుతాట్ట. పథకం ఆచరణ యోగ్యంగానే వుందని చెప్పాను. ఈ ఐడియా అతనికి తట్టింది కాబట్టి సరిపోయింది గానీ, నాకే తట్టివుంటే అతనూ సారథీ కలిసి నన్ను తెగ ఏడిపించేసి వుండే వాళ్ళు. అసలు ఇదికూడా భాస్కర్రావు ఒరిజనల్ ఐడియాకాదు. మొన్న ఏదో సినిమా చూసి ఈవాగుడు మొదలెట్టాడు. మనిషి కొక్క పిచ్చి మహిలో సుమతీ. బీర్, బ్రాందీ మున్నగునవి తాగితే అమాయకత్వము పోవుననీ, ముఖములోగాంభీర్యము,



కళ్ళల్లో చురుకుతనమూ వచ్చునని బాబూరావు సజెష్టు చేశాడు. అదికూడా ట్రై చెయ్యాలి. ప్రతిమనిషికీ తగుమాత్రపు రౌడీకళ అవసరము. అదియే పురుషలక్షణము.

## నవంబరు 16 :

కృష్ణా గోదావరీ జలాల పంపిణీ వివాదంలో గుల్జారీగారు ఆంధ్రకు అన్యాయం చేస్తున్నారని తిడుతూ 'సుజనమిత్ర'లో వ్యాసం రాశాను. ఎవరో రాజకీయవాది వచ్చి "నువ్వెవరివి? ఈ వ్యాసం రాసే అర్హత నీకెక్కడిది?" అన్నాడు. "మహామహా మంత్రులే తిడుతూ వుండగా లేనిది నేనెం

దుకు తిట్టకూడదు" అని యెదురుప్రశ్న వేశాను. ఆయన వెళ్లిపోయాడు. ఇదే సమయమని గట్టిగా దారెడు పొడుగున ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాథమిక హక్కులమీద ఉపన్యాసం దంచేశాను. ఆయన కిక్కురు మనకుండా వెళ్ళిపోయాడు. తప్పదియ్యా. నేనంటే ఆఖరికి రాజకీయ నాయకులకి కూడా అలుసుగావుంది. ప్రజాస్వామ్యంలో ప్రధానమంత్రి అయ్యేహక్కు ప్రతి ఒక్కడికీ వుందని నెహ్రూగారు ఒక ఉపన్యాసంలో చెప్పారు. ఇవన్నీ ఒట్టి కబుర్లు. ప్రతివాడికీ హక్కుంటే తనొక్కడే ప్రధాని యెందుకైనట్టు? నాలాటి యువకులు పూనుకొని దేశంలో రాజకీయాలను సంస్కరించవలసిన అవసరం యెంతైనా వుంది. 'సుజనమిత్ర'లో పార్టైమ్ జాబ్ బాగాలేదు. బి. ఎ. కాగానే సొంతపత్రిక పెట్టాలి. తర్వాత ఎలక్షన్లో నిలబడాలి. సొంతపత్రిక వుంటే ప్రచారానికి ఖర్చు కూడా తప్పుతుంది.

నవంబరు 20:

ఎన్నికష్టాలుపడితే అంత అనుభవజ్ఞుడవుతాడు. (ఈ లెక్కన యెంత దరిద్రుడవుతే అంత అనుభవజ్ఞుడన్నమాట). అలాగే ఎన్నిసార్లు జైలుకువెళ్తే అంత గొప్ప రాజకీయ నాయకుడవుతాడు. ఎలాగూ రాజకీయాల్లో దిగనే దిగాను గనక ఓ సారి పన్లోపని జైలుక్కూడా వెళ్ళాలనివుంది. చైనా దురాక్రమణపై నిరసనగా సెక్రటేరియట్ ఎదుట ఆందోళనచేసి జైలు కెళ్ళాలి. వీలైతే దెబ్బలుకూడా తినాలి. (సప్రెస్డ్ డిజైర్). నెహ్రూగారుకూడా తిన్నారు. ఒక్కొక్కప్పుడు అతి సీరియస్ విషయాల్లోంచికూడా హాస్యం పుట్టుకొస్తుందని కొత్తగా తెలిసింది. ఎందుకంటే భాస్కర్రావు, సారథి కలిసి దొంగతనంగా నా డైరీ తీసి చదివి కడుపు చెక్కలయ్యేట్టు నవ్వుతున్నారు. నేను ఇంత సీరియస్గా, ఇంటలెక్చువల్గా విజ్ఞానాత్మక విషయాలు రాస్తుంటే ఇందులో నవ్వడాని కేముందో



అర్థం కాలేదు. పూర్వం నవ్వారంటే అర్థం వుంది. ఆరోజుల్లో నేను అమాయకుణ్ణి గనక. ఇప్పుడు నా మెంటల్ ఏజ్ (మానసిక వయస్సు) చులాగ్గా 63 వుంటుంది. అంతా హనుమంతులవారి చలవ.

నవంబరు 23:

జ్ఞాపకశక్తికి నిదర్శనం - కురు చిరు నడు నిడు శబ్దంబుల రడల కచ్చ పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు. ఇవాళ వర్లక్ష్మి ఎన్.సి.సి. డ్రస్సులో కనిపించింది. ఆ డ్రస్సులో భారత వీర నారీమణిలా, రుద్రమాంబ అనుంగు పుత్రికలా వుంది. పరికిణా, వోణీకంటే ఈ వేషంలోనే బావుంది పకడ్బందీగా. మామూలు దుస్తులు ధరిస్తే ఒకానొక విధమైన అనిర్వచనీయమైన వినయము, ఒద్దిక కనిపిస్తాయి. సీతా, అనసూయా, సావిత్రీ మొదలయిన పతివ్రతామతల్లులుజ్ఞాపకంవస్తారు. సాయంత్రం మావయ్యగారింటి కెళ్ళాను. వర్లక్ష్మి వీణ వాయిస్తోంది. మూర్తీభవించిన సరస్వతియా, లేక కోకిలయా అనిపించింది. మావయ్య మాత్రం మూర్తీభవించిన ఆముదంలా వున్నాడు. నాచెయ్యిచూసి వచ్చే జన్మలో నెపోలియనువై పుడతావు అన్నాడు. ఒట్టి క్రాక్. బహుశ కిందటిజన్మలో అయుంటుంది.




నవంబరు 27:

ధరలు తగ్గించడం ఎలా? కొనకపోతే సరి. డిమాండ్ లేకపోతే చచ్చినట్టు ధర తగ్గుతుంది: సింపుల్ ఎకనామిక్స్. మన నాయకులంతా దీనికోసం ఇంతచేటు బుర్ర బద్దలు కొట్టుకోవడం దేనికో అర్థంకావడం లేదు. పంచదార తగ్గించడం కోసం ప్రభుత్వం యిటీవల యెన్నో టన్నుల నిల్వలను మార్కెట్లోకి విడుదల చేసింది. దానివల్ల వాడకం యింకా పెరిగి గిరాకీ హెచ్చి ధర పెరిగే అవకాశంవుంది. అంతకంటే అసలు పంచదార వాడకంపై నిషేధం పెడితే సరిపోయేది. (మద్యపాన నిషేధం మోడల్లో). అపుడు తక్కున గిరాకీ తగ్గి ధర తగ్గేది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయదేశం. ప్రతి ఒక్కరికీ (వర్లక్ష్మితో సహా) నిర్బంధవ్యవసాయ శిక్షణ యివ్వడం అవసరం. దీనిపై వ్యాసం రాశాను.

డిశంబరు 2:

ఇవాళ క్షవరం చేయించుకున్నాను. ఖాళీ చేసేసిన ఇల్లులా, వెల్లవేసిన గోడలావుంది తలకాయి. అద్దంలో చూసుకునేందుకే సిగ్గేస్తోంది. జుట్టు తగ్గించద్దయ్యా అని మరీమరీ చెప్పాను నాయీబ్రాహ్మణునితో. అద్దంలో చూసుకునేందుకు తలయెత్తినపుడల్లా మొట్టికాయ వేసినట్టు కిందికి నొక్కడం మొదలెట్టాడు. క్షవరం చేయించుకుంటే కనీసం వారంరోజులవరకు అమ్మాయిలెవరూ ప్రేమించరు. సెలూన్ నుంచిరాగానే నన్ను చూసి భాస్కర్రావు ఒకటే నవ్వటం మొదలెట్టాడు. అసలు మన్మథుడైనా సరే, లేకపోతే దేవానందైనా సరే క్షవరం చేయించుకున్న రోజు నాలాగే వుంటారని వాదించాను. సారథి నాతో ఏకీభవించాడు. అయితే ఇందులో ఒక సుఖంవుంది. క్షవరం చేయించుకున్న రోజు తలకి బాగా చెమట



పట్టిం తర్వాత ఫానుకింద నుంచుంటే ఆ సుఖం కేవలం అనుభవైకవేద్యం. ఇంకా వారంరోజులదాకా వర్లక్ష్మికి కనిపించకూడదు. రామాయణ కాలంలో క్షవరం దేనితో చేసుకునేవారో.

డిశంబరు 8:

భాస్కర్రావు నేడు 'కలలు - వాని పుట్టుపూర్వోత్తరములు' అను విషయమై ప్రసంగిస్తూ మానవుని తీరని కోరికలు, అణచివేయబడిన కోరికలు స్వప్నములలో తీరుచుండుననియూ, వాస్తవిక ప్రపంచమున అసంభవముగా గన్పట్టు పెక్కు విషయములు స్వాప్నిక ప్రపంచమున జరుగుచుండుననియూ ఉద్ఘాటించెను. అందులకే కాబోలును నన్ను కలలో పెక్కురు ఆడవాండ్రు ప్రేమించుచుందురు. కొండొకచో కలలు నిజమగునట. ఈ విషయమై నాకింకనూ ఆశాభావమున్నది. ఇవాళ సాయంత్రం అయిదుగంటలకు ఒక అందమైన అమ్మాయి కనిపిస్తే (ప్రయోగాత్మకంగా) వెనకాలే అనుసరించాను. నల్లద్దాల కూలింగ్ గ్లాసెస్ పెట్టాను. కాలరు పైకెత్తాను. నోట్లో పైపు, కాళ్ళకు ఫుల్ బూటు. బహుశ యమ ఫోజులో వుండి వుంటాను. అమ్మాయి వెనక్కి తిరిగినప్పుడల్లా ఏదో పనివున్నట్టు



నటిస్తూ, అమ్మాయి ఎన్ని సందులు తిరిగితే అన్ని సందులూ తిరిగాను. అమ్మాయి చివరికి ఒక ఇంట్లోకి వెళ్తూ నావంక కొరకొర చూసి 'రౌడీ వెధవ' అంటూ ఠఫ్ఫున తలుపు వేసేసింది. వెంటనే రిక్షా యెక్కి ఇంటికొచ్చి అద్దంలో చూసుకుంటే ఆశ్చర్యం వేసింది. అమ్మాయి చెప్పింది రైటే. దాదాపు దేవానందంత రౌడీలాగా వున్నాను. జనం మనని చూసి తిట్టినా ఫర్వాలేదు. నవ్వక పోతే చాలు.

*డిశంబరు :* **13**

ఈమధ్య ఒక మంత్రిగారు ఒక సభలో ప్రసంగిస్తూ దేశ ప్రజల జీవనప్రమాణం పెరిగిందని అన్నారు. ఆయన యిటీవల ఒక గ్రామానికి వెళ్ళి చూస్తే అక్కడి ప్రజలందరూ చొక్కాలు వేసుకుని వున్నారుట. జీవన ప్రమాణం పెరుగుదలకు యింతకంటే మంచి దాఖలా అక్కర్లేదన్నాడు ఆయన. మొరార్జీదేశాయ్‌గారు సిగరెట్లనికూడా లగ్జరీస్ (విలాస వస్తువులు)లో చేర్చారు. తనకి అవసరంలేని వాటినన్నింటినీ ఆయన లగ్జరీస్ అనే అంటారు. (ఆయన పక్కపొడికూడా వేసుకోరని అనధికార వార్త). అసలు ఈరోజుల్లో పెళ్ళి అంత లగ్జరీ యింకోటి లేదని నేను ఒక సందర్భంలో వాదించాను. అందుకే దానిమీద పన్ను వేయడం. ఈ ఎమర్జన్సీలో పెళ్ళిళ్ళు రద్దుచేస్తే బావుణ్ణు.

*డిశంబరు :* **17**

ఇవాళ సాయంత్రం సుల్తాన్ బజార్ బట్టల దుకాణంలో ఒక కాలేజీ అమ్మాయిని ప్రేమిస్తూవుండగా విలన్‌లాగా భాస్కర్రావు వచ్చాడు. పెద్ద అపరాధాన్ని పరిశోధించిన వాడిలాగా పోజుపెట్టి 'ఏం చేస్తున్నావు యిక్కడ' అని అడిగాడు. అబద్ధం చెప్పాల్సిన ఖర్మం నాకేంపట్టింది. గాఢంగా ప్రేమిస్తున్నానని చెప్పాను. అతను రాజనాలలాగా నవ్వి 'నిన్నెవరైనా ప్రేమిస్తారనేనా నీ ధైర్యం' అన్నాడు. వెంటనే పరువునష్టం దావా వెయ్యాలనిపించింది. 'సొంత మావయ్య కూతురే ప్రేమించగాలేంది పరాయివాళ్ళు ప్రేమించడం గొప్పా?" అన్నాను. "మీ మామ కూతురు నిన్ను ప్రేమిస్తోందనుకోడం ఆటో సజెషన్. నీకు సైకో ఎనాలిసిస్సు తెలీదు" అన్నాడు. నేను వేదాంతి పోజుపెట్టి "అయినా మనం యితరులతో పంతు పెట్టుకోకూడదు. మనవిధిని మనం నిర్వర్తించాలి. అవతలివాళ్ళు ప్రేమిస్తేనే నేనూ ప్రేమిస్తాననుకోడం సకామప్రేమ. ఏ తద్విరుద్ధమైనది నిష్కామప్రేమ. నాది ఆకోవకే చెందును"అన్నాను. అతను ఇహ వాదించకలేక వెళ్ళిపోయాడు. ఈమధ్య తర్కంలో ఆరితేరాను. ఓం తత్సత్!

□□□

— నండూరి పార్థసారథి



# మామూలు కథ

విహారి & శాలివాహన

మామూలుకథ !

"ఏమిటోనండి. ఈ కాలంలో ఏ కథ చదివినా మామూలు గానే వుంటున్నది"—

ఇలాంటి కామెంట్లు మామూలై పోయాయి మరీ యీ రోజుల్లో. రకరకాల పత్రికలు చదివే పాఠకులు వొకేరకపు కథలతో వినుగెత్తి మామూలుగా యిలాంటి వ్యాఖ్యానాలు చేయటం మొదలెట్టారు.

'ఇంతకీ ఏమిటండీ యీ మామూలు కథల గొడవ' అంటారా ?

ఫలానా పట్టణంలో వొక కాలేజీ. కో ఎడ్యుకేషన్ పద్ధతి అంతరించ లేదు కాబట్టి ఆ కాలేజీలో అమ్మాయిలూ, అబ్బాయిలూ వుంటారు. అబ్బాయిలకొక రాజా. అమ్మాయిల కొక రాణి. 'రాజా' వన్నీ కావ్యాలంకార సంగ్రహంలోని నాయక లక్షణాలైతే, అమ్మడు అచ్చు ప్రబంధ నాయిక. ఏదో సైకిల్ 'డాష్' తోనో, నాటకాల పోటీ తోనో, పుస్తకాల అభ్యర్థనతోనో బస్ స్టాప్‌లో పరిచయంతోనో ప్రారంభమౌతుంది వాళ్ళ ప్రణయగాథ. కాలేజీలో విద్యార్థుల గుసగుసలను, ఇంట్లో పెద్దవాళ్ళ రుసరుసలను లక్ష్యపెట్టక క్షణక్షణాభివృద్ధి పొంది తారాస్థాయి నందుకుంటుంది కథ. అక్కడో మలుపు. అమాంతం సుఖాంతం. ఇదొహ తరహా మామూలు కథ.

చిలకా గోరింకల్లాంటి నూతన దంపతులు. యూనివర్శిటీ వాళ్ళు కట్టబెట్టే అత్యధిక డిగ్రీలుంటాయి ఇద్దరికీ. సిటీలో వొంటరికాపరం ఆరంభిస్తారు. ఇద్దరికీ వ్యక్తిత్వాలు, ఆశయాలు, ఆశలు, ఆదర్శాలూ కూడా వుండటం సహజం. కాబట్టి నాగరికత పేరుతో స్వయం విహారాలు, అమ్మాయి ప్రవర్తన అబ్బాయికి నచ్చక పోవటం, ఏదేదో వూహించటం. అదీకాక పోతే మరో అనుమానం. దాంతో కుణ్ణాడేదో అనటం. మాటలమీద మాటలు విజృంభించి, చినికిచినికి గాలివానగా తయారవటం. ఇద్దరిలోనూ 'అహం' తగు మోతాదులో వుంటుంది కనుక, ఎవరూ మాటపడరు. చివరికి అమ్మాయి కాస్తా పుట్టింటికి చేరటం. ఇక్కడ అబ్బాయి స్నేహితుడో, అక్కడ అమ్మాయి శ్రేయోభిలాషో, వాళ్ళ తప్పుల్ని వాళ్ళు తెలుసుకునేలా చేయటం, అంతే. నూతన దంపతుల పునస్సమాగమంతో కథ కంచికి చేరుతుంది. (కంచి కెందుకో ?) ఇదొహ రకం.

ఈమధ్య మరోరకం మామూలు కథలు యెక్కువైనై. వాటినిండా మాతృప్రేమలు, పితృప్రేమలు, మిత్ర ప్రేమలు మరేదో అనురాగం, త్యాగం గట్రా వుంటాయి.

ఇలా ఏకథ చూసినా మామూలుగానే కనపడుతూ వున్నది పాఠకులకు. ఈ శోచనీయమైన పరిస్థితికి కారకు లెవరో మరి ?

అసలు కథకు పైదంతా నాంది.

మీరు చదవబోయే 'మామూలుకథ'లో యిలాంటి సంఘటనలంటూ వుండనే వుండవు. ఈ 'మామూలు' అనే పదానికి అర్థమే వేరు. అలాంటి అపురూపమైన 'మామూలు' కథ వ్రాయటానికి మాకు చేతనైన రీతిగా సాహసం చేస్తున్నాం. అవధరించమని విజ్ఞులకు మనవి :

ఇది ప్రస్తావన.

ఇక, మాయొనర్పం బూనిన 'మామూలు కథ'కు కథన ప్రకారం బెట్టిదనిన — (కథలో కావ్యలక్షణాలేవీ వుండవు గాని భయపడి చదవటం ఆపేయకండి).

మనదేశంలోని అసంఖ్యాకమైన పల్లెపట్టుల్లో అదొకటి. పేరేమిటని అడగక్కర్లేదు. రైల్వేస్టేషన్లో దిగితే, తుమ్మల్లోని కాలిబాటన మూడుమైళ్లు ఆ వూరిదూరం. దేశ విదేశ రాజకీయాలు విచ్చలవిడిగా సంచారం చేసి ఆవూళ్లో రచ్చబండమీద ఉపన్యాసాలిచ్చే లచ్చయ్యగారి దగ్గఱకు చేరతాయని అనుకుంటూ వుంటారు — ఆ గ్రామ ప్రజలు.

లచ్చయ్యగారు ఆవూళ్ళో పుట్టి, ఆ వూరి చెఱువులోనే యీతలుకొట్టి, ఆవూరి బళ్లోకల్లా పెద్దడిగ్రీ ఐన ఐదోతరగతిపట్టా పుచ్చుకుని, స్వయంగా వొక ఎకరం పొలాన్ని పాతికచే గుణించి, 'మోతుబరి' అనిపించుకుంటున్న ఘనుడు.

అంతటి మహా ఘనత వహించిన లచ్చయ్యగారికి స్వవిషయాలు తప్ప మరేవీ

తలకెక్కేవికాదు నాలుగేళ్ళ క్రితం వరకు. ఆ తర్వాతనయినా తప్పక యితర్లనిచూసి నేర్చుకుని, అలవాటు చేసుకున్నాడు రాజకీయ పరిజ్ఞానాన్ని, అంతతప్పక పోవటానికి కారణమేమిటంటే - ఆయన్ని అమాంతం ప్రజలంతా కలిసి బలవంతాన పంచాయితీ బోర్డు మెంబరుగా చేయటం, అలాంటి వాడ్ని అమాంతం అలా మెంబరుగా ఎందుకు చేశారో బహుశ ఆ ప్రజలకే తెలియాలి. అప్పట్నుంచి రాజకీయాలు అయన దగ్గఱ చేరటం మొదలెట్టాయి, దాంతోపాటేఆయన రచ్చబండమీద వుపన్యాసాలివ్వటంకూడా మొదలెట్టాడు. ఈయనగారి రాజకీయాల ధోరణిని చూసి, తప్పదని అయనకి ప్రెసిడెంటుగిరీ కట్టబెట్టారు. వోటరు మహాశయులు గడచిన ఎన్నికల్లో. లచ్చయ్యగారు ఆ వూరి పంచాయితీ ప్రెసిడెంటు యిప్పుడు.

మొన్న మొన్నటి వరకూ వూరి పొలిమేర దాటి (నారుకొనుక్కురావటానికితప్ప) బయటకు వెళ్ళని లచ్చయ్యగారు యిప్పుడనేక పనులమీద పట్నానికి పోవాల్సి వచ్చింది. ఆయనకలాంటి అవసరంకలగటం వల్లనే, మాకీ కథ వ్రాసే అవకాశం కలిగింది,

ప్రెసిడెంటు కాగానే లచ్చయ్యగారికి గ్రామ ప్రజల అవసరాల్ని తీర్చాలనే సదభిప్రాయం కలిగింది. తొలి ప్రయత్నంగా వూళ్ళో రోడ్లు వేయించటానికి నిశ్చయించారు. దానికి ముందు జరపవలసిన పద్ధతుల్ని గురించి భోగట్టా సేకరించారు లచ్చయ్యగారు. ఆ ప్రకారం బోర్డు తీర్మానాల కాపీలను, సర్కారు ఉద్యోగికి పంపించాడు ఎస్టిమేట్లు వేయమని ప్రార్థిస్తూ లేఖను జతబరచి మరీ. నెల గడిచిందిగాని, సదరు వుద్యోగి నుంచి జవాబు లేదు. ఏదో పనిమీద పట్నానికి పోయిన లచ్చయ్యగారు ఆ వుద్యోగి ఆఫీసుకు వెళ్ళాడు...

మర్యాదలైన తర్వాత చెప్పాడు ఆఫీసరుగారు. "అదేమిటండీ వారం రోజుల క్రితమే మీ పనులు పూర్తిచేసి పంపానే" అని.

"రాలేదండీ" అని చూపులు ఆకాశానికి సారించారు లచ్చయ్యగారు, వాళ్ళ వూరి పోష్టు పంతులేమైనా గల్లంతు చేశాడేమోననే సందేహంతో.

ఉత్తరాలు రవాణాలో గల్లంతయినా, ఆ దోషం పోష్టుమాష్టరు పంతులుదేనని ఆ వూళ్ళో వాళ్ళందరి ఉద్దేశం, అదే అనుమానం లచ్చయ్యగారికీ కలిగింది.

ఈయనగారి వాలకాన్ని గమనించి, ఆఫీసరే అన్నాడు "మరేం ఫర్వాలేదండి. పల్లెటూరు కదూ. చేరేసరికి ఆలస్యంకావచ్చు. రేపో మాపో వస్తాయి కాని, వాటిని తీసుకుపోయి పెద్దింజనీరుగారి ఆఫీసులో అప్రూవు చేయించుకోండి."

"వారి ఆఫీసుకు స్వయంగా వెళ్ళాలంటారా ?" ధర్మసందేహం వెలిబుచ్చారు లచ్చయ్యగారు.

"చూడండి లచ్చయ్యగారూ. మీరు బొత్తిగా అమాయకులు. పైగా వ్యవహారాలు తెలియనివాళ్లు. వెళ్ళకపోతే యెలాగవుతాయండి పనులు ?"

వింతగా కళ్ళింతవి చేసి, నోరుతెఱిచారు లచ్చయ్యగారు.

ఒక్క క్షణం ఆగి ఆదోలా పెదవి విరిచి "నాకొక్కొంచెం పనుంది. సెల విప్పిస్తారా" అంటూ లేచారు ఆఫీసరుగారు.

"చిత్త.... వెళ్ళొస్తానండి. "అనుకుంటూ బయల్దేరారు లచ్చయ్యగారు.

లచ్చయ్యగారు బయటకు రాగానే, వరండా స్తంభాని కానుకుని చుట్ట కాల్చుకుంటున్న జవాను చుట్ట ప్రక్కనపెట్టి లేచాడు. హడావిడిగా పైపంచె తలకుచుట్టుకుని, "వెళ్తున్నారా, ప్రెసిడెంటుగారూ ?" అంటూ లచ్చయ్యగారిని అనుసరించాడు.

రోడ్డుమీద కొచ్చారు యిద్దరూ.

"ఏవిఁటోనయ్యా. వారంరోజులనాడు పంపిన కాగితాలు యింతవరకూ చేరలేదు నాకు." యథాలాపంగా అన్నారు లచ్చయ్యగారు.

తమాషాగా నవ్వాడు జవాను కాశిం. "ఆరన్నీ అంతేనండీ. ఎవరొచ్చినా యింతే. చేసే సేనంటారు. అంతా అబద్ధమే అయ్యా. ఏదో అరి మామూలారికి వద్తేనే గాని కాగితంమీద కలమెట్టరు."

నిధినిక్షేపాల రహస్యాన్ని బయల్పరుస్తున్నవాడిలా నెమ్మదిగా అన్నాడు కాశిం.

"మామూలా!" లచ్చయ్యగారు 'కొశ్చన్ మార్కు' మొహం పెట్టారు.

"ఆఁ. మామూలేనండీ. ఏదో మీకు తోచినంతిస్తే చాలు. దాగా తింటం యీ అయ్యగారికింకా తెలవదు."

"మామూలేవిఁటయ్యా ?"

"అదేనండీ....మామూలే"

కాశిం కొంచెం హెచ్చు స్వరంలో హెచ్చరించేసరికి అర్థమైంది లచ్చయ్యగారికి. తనలో, తను 'ఒహో' అనుకుని "అయితే యిప్పుడే యిచ్చి పొమ్మంటావా" అన్నారు.

"అఖ్ఖర్లేదులెండి. ఈ సారి మిమ్మల్ని చూస్తామన్నారని నే చెప్తాలెండి అయ్యగారికి. ఎల్లుండీపాటికి ఎస్టిమేట్లు మీకందుతయ్. ఆఁ....". మాటల్లోనే తన పలుకుబడినంతా చూపిస్తున్న జవాను కాశింను చూసి ఆశ్చర్య పోయారు లచ్చయ్యగారు.

"చూడు కాశిం. జీతాలు పుచ్చుకుంటూ మీరు చేయాల్సిన పనికే యిలా మామూలు. మామూలంటే ఎలాగయ్యా ?"

"అదేంటిబాబూ. అలాగంటారు. జీతమని పేరేగానీ వచ్చే నాలుగురాళ్ళు బియ్యం. నూకలకే చాలటం లేదు గదండి. రోజులు మీకు తెలీనివా? ఏదో మీలాంటివారు కని పెట్టుండక పోతే యీ వుద్యోగాలతో బత కటమేనా ?"

"నిజమే కాబోలు" అనిపించింది? అచ్చయ్యగారికి. "సరే వస్తానోయ్. నువ్వుండు" అంటూ అడుగు ముందు కేశారు.

"ఇంతకీ నా మామూలు సంగతేంవి టంటారు; కాఫీ కన్నా డబ్బుల్లేవయ్యా. ఎదో మీదయ" చేతులు నలుపుకుంటూ వెంబడించాడు కాశిం.

ఒకసారి కాశింను తీక్షణంగా చూసి. చొక్కాగుండీలు వూడదీసి లోపలి జేబులో నుంచి రూపాయినోటు తీశారు అచ్చయ్య గారు.

దాన్నిచూసి కాశిం మొహం కళమార్చు కుంది. "ప్రెసిడెంటుగారూ ఓ హస్తమన్నా లేకుంటే...." అని నసిగాడు.

"పర్వా లేదులే కానీవయ్యా. పనిపూర్త యేలోపల ఎన్నిసార్లు రావాలోకదా. నువ్వా కాగితాలు వచ్చేటట్లుచూడు. నేనెక్కడికి పోతాను. యీ సారి వస్తాగా" అంటూ నడక సాగించారు అచ్చయ్యగారు.

"సరే .... కానీండి. మీ దయ" అని దణ్ణంపెట్టి వెనక్కు తిరిగాడు కాశిం.

అచ్చయ్యగారి రోడ్డు నిర్మాణ వ్యవహా రంలో యిది తొలిమజిలీ. తెల్లవారి లేచి నప్పట్నుంచి రాత్రి పడుకోబోయేవరకూ గొడ్డుచాకిరీ చేసే జీతగాడికి కూడా కూలి డబ్బులకు పైన కానీ యిచ్చి ఎఱుగని ఆయన, యిలా మామూళ్ళివ్వటం మొద లెట్టాడనే వార్త యెవరికి ఆశ్చర్యాన్ని కలి గించదు చెప్పండి ? కాశిం మాట్లాడుతూ వుంటే అదంతా సబబే అనిపించిఉంటుంది. అందుకేనేమో ఏటినీరు పల్లానికి పారు తుందంటారు. ఎంతటివాళ్ళయినా అవసరా నికి లొంగక తప్పేదేముంది ?

ఇంటికి చేరుకున్న అచ్చయ్యగారికి ఆలోచనలమీద ఆలోచనలు ముసిరినయ్, ఋణదాతను ముసురుకునే అప్పులవాళ్ళలా.

'కాశింలాంటి వాళ్ళకు యిచ్చేమామూ ళ్ళన్నీ ఏ ఖాతాకు ఖర్చురాయాలి ?'అనేది పెద్ద సమస్యయింది ఆయనకు. రికార్డులో యిలాంటివి రాయటానికి వీల్లేదు. రాయ కుండా చేతిసొమ్ము ఎంతని ఖర్చుపెట్టగలడు తను. ఇలాగైతే తనకొచ్చే ఆదాయం యీ మామూళ్ళకి చాలదు. ఈ ఆపదల్ని మిగతా ప్రెసిడెంట్లెలా తప్పించుకుంటారో తెలుసు కోవాలనుకున్నాడు. తీరాఆపద్ధతితెలుసుకునే సరికి, వెధవది 'కాన్షన్స్' అంటారే. అది అడ్డుతగిలింది. తనకింతవరకూ యితరుల్ని మోసగించి సంపాదించటం, తిమ్మిని బమ్మి చేయటం చేతకాదు. అలాంటివాడికి సంప త్సరంలో ఆయ్యే అదనపు ఖర్చులన్నీ చూసుకుని ఏవో నాలుగు పనుల్లో కలిపి రాయటం కన్నా గత్యంతరం లేదని చెప్తే బాధకదూ మరి.

గ్రామస్థుల అవసరంతీర్చటానికి ముందు పని పూర్తయితే తర్వాత చూసుకుందాం యీ విషయాలన్నీ అనుకుని అప్పటికా ఆలోచన విరమించుకున్నారు అచ్చయ్య గారు.

మూడోనాటికల్లా కాశించెప్పిన ప్రకారం వచ్చినయ్ ఎస్టిమేట్లు (రిజిష్టర్ పోష్టులో !)

ఇప్పుడు పోయి ఆ ఆఫీసర్ని "వారం క్రితమే పంపానంటిరే" అని అడిగితే ఏంవంటాడో' అనిపించింది అచ్చయ్యగారికి అంతలోనే "ఆఁ ఏంవంటాడు. మొహం మాడదూ...." అనిపైకే అనుకునిసంతృప్తి పడ్డాడు సన్నని నవ్వుతో.

"ఏం వీంటి అచ్చయ్యబావా. ఏదో నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్" అంటూ తయా రయ్యాడు సుబ్బయ్య.

"ఆఁ. ఏంలేదు సుబ్బయ్యా. రోడ్డు పను లకు ఎస్టిమేట్లు చేయించాను. పెద్దింజనీరు గారి ఆఫీసుకు పోయి అప్రూవు చేయించుకు రావాలి....ఏం నువ్వూ వస్తావాయేం. నాకూ కొత్తగా వ్యవహారం అర్థం కావటంలేదు. ఎట్టయినా నీబుర్ర కాస్త పెద్దదిగందా." అన్నారు అచ్చయ్యగారు, కొయ్యకుర్చీలో పైకి జరిగి.

"ఇదిగో చూడు బావా. రావటానికి నాకేం అభ్యంతరంలేదు. కాకపోతే మామూలు ఖర్చులు నువ్వే భరాయించాలి. అనక నీ యిష్టం. అంత్యనిష్ఠూరం కంటే అది నిష్ఠురం మేలని యిప్పుడే చెప్తున్నా" నిర్మొహ మాటంగా చెప్పి చుట్ట కొరికి తుపుక్కున వుమ్మాడు సుబ్బయ్య.

"ఆరి నీ దుంపతెగ. నీకూ మామూలే!" అనిపించి ఆశ్చర్యంగా సుబ్బయ్య వైపు చూశారు అచ్చయ్యగారు.

"అవునుమరి. మామూలు విషయాలకు ముసుగులో గుద్దులాటంటే నాకసలే గిట్టదు" కనుబొమ్మ లెగరేశాడు సుబ్బయ్య.

ఒక్క క్షణమాగి నెమ్మదిగా అడిగారు అచ్చయ్యగారు, "అయితే సుబ్బయ్యా. ఈ మామూలు ఖర్చులన్నీ ఏ ఖాతాలో రాయా లంటావ్ ?"

"ఏ ఖాతాలో రాయాలో తెలీకపోతే పెద రావూరు ఖాతాలో రాయిబావా?" హేళనగా అని నవ్వాడు సుబ్బయ్య.

ఈ మాటలకి మన ప్రెసిడెంటుగారికి చిరాకూ వేసింది. కోపమూ వచ్చింది "ఏ సలహా బాగుంది కాని. ప్రొద్దున్నే యిచే వచ్చినట్లున్నావ్ కాస్త కాఫీ తెప్పించనా సుబ్బయ్యా. తాగి పోదువుగాని. అఁహఁ ఫర్వాలేదులే. పెదరావూరు ఖాతా వుండనే వుందిగా. అలాంటిఖర్చులకి" అన్నారు.

సుబ్బయ్య మొహం మాడ్చుకుని వెళ్ళి పోయాడు.

● ● ●

తన మామూలుఖర్చులక్రింద. ఆఫీసులో మామూలు ఖర్చులక్రింద పాతికరూపాయలు భద్రంగా కాగితంలో పొట్లాం కట్టుకున్నారు లచ్చయ్యగారు. దాన్నిలోపలి జేబులోపెట్టు కుని, పై చొక్కా బొత్తాములు ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా చూసుకుని మళ్ళీ పట్నానికి బయల్దేరారు. ఇతః పూర్వం వారు వెళ్ళిన పట్నమొక తాలూకా కేంద్రమైతే. ఈ పట్నం జిల్లా ముఖ్య పట్టణం.

పెద్దింజనీరుగారి ఆఫీసులోకూడా జవానే విషయాలన్నీ వివరించాడు లచ్చయ్యగారికి. పని త్వరగా పూర్తి చేసుకుని పోవాలను కుంటే. నెఱవేర్చాల్సిన కనీస కర్తవ్యాల్ని జాగ్రత్తగా విన్నారు లచ్చయ్యగారు.

తత్ సందర్భంలో బయల్పడిన గొప్ప విశేషమేమిటంటే - ఏ పని జరగాలన్నా ఆఫీసులోఫైళ్ళు ఒకచోటినుంచీ మరోచోటికి జరగాలనీ. అలా జరగటానికి ముందు లాగుడో, వెనుక తన్నుడో వుండాలనీను.





ఈ పారిభాషిక పదాలకర్థం తెలియక తెల్లమొహం వేసిన లచ్చయ్యగారిపై కొన్ని లీటర్ల సానుభూతి ప్రదర్శించి. వాటి అర్థం వివరించాడు సదరు జవానే.

ముందు లాగుడంటే యీ 'మామూలు' తాడును పేనటమట. వెనక తన్నుడంటే పలుకుబడి పదికట్టు రాళ్ళతో మొట్టటమట. ఈ రెంటిలో ఏ పద్ధతీ యెరగని వ్యక్తులకు సంబంధించిన కాగితాలు ఏ ఆఫీసులోనూ అరంగుళం మేర జరగవనేది యీ (కలి) కాలంలోని సూత్రమట. చూశారామరి ! ఇంతకుపూర్వం లచ్చయ్యగారికి తెలియని విషయాలెన్ని వున్నాయో యీ వ్యవహారాలలో !

జవాను తెలియజేసిన విషయాలన్నీ విని బిత్తరపోయి. తత్తరపడి కుండలోనీళ్ళు సత్తు గ్లాసెడు త్రాగి తెప్పరిల్లుకున్నారు లచ్చయ్యగారు. మరోమారు త్రాగాలనిపించింది కాని, కుండలో నీళ్ళులేవు. 'ఈ మామూళ్ళ'కు పోయాలంటే. డబ్బుకూడా అంతేకాబోలు!

ఇంతకీ ఇంజనీరుగారి ఆఫీసులో లచ్చయ్యగారి కాగితాలు అన్ని రకాలైనా ముద్దర్లు గ్రుద్దించుకోవాలంటే. యమకింకరుల్లాంటి నలుగురి బల్లలమీద నుంచి జరగాలని తెలిసింది.

ఆ ఆఫీసంతా పరమపద సోపానపటంలా కనిపించింది ఆయన గారికి. ఆట పూర్తిచేసు కుని బయట పడాలంటే ఎన్ని పాముల్ని దాటాలి? దానికి లోటు నిచ్చెనలేవీ లేవు.

అందులో మొదటి వ్యక్తి - అదేదో నోరు తిరగని పేరు. ....ఏదో 'మన్న'ట. లచ్చయ్యగార్ని ఆయన దగ్గఱ కూర్చో పెట్టాడు జవాను. ప్రొద్దున పదిన్నరనుంచి 'సబ్జెక్టు'అని రాసి. అలాగేవుంచిన డ్రాఫ్టుల్ని ప్రక్కకి నెట్టి. ఆపద్బాంధవుడైన శ్రీమహా విష్ణువును చూసిన గజేంద్రంలా, లచ్చయ్య గారిని చూశారు 'గుమాస్తా' బురఖాలో దాక్కున్న, దాలిదాలని జీతంగాళ్ళు.

సదరు 'మన్న'గారేవేవో పెద్ద పుస్త కాలుతిరగేసి, ఎన్నిమేట్లమీద అక్కడక్కడా ఎఱ్ఱసిరా మరకలు చేసి ముద్దర వేశారు. ఈ శుభ సందర్భంలో లచ్చయ్యగారి చొక్కా అడుగు జేబులోని పొట్లంలో దాక్కున్న పదిరూపాయల కాగితానికి స్థాన చలనం కలిగి, బల్ల అడుగునుంచి సదరు ఉద్యోగి పంట్లాం జేబులోకి దూరింది.

ఈ కర్మకాండ జరిగేనరికి 'లంచి' టైమయింది.

'కాఫీ తాగొద్దామండీ' అన్న ఉద్యోగుల ఆత్మారాముళ్ళ ఆర్తారావాల నాలకించిన వాడై లచ్చయ్యగారు వెంట ఆరుగురు వ్యక్తులు తోడురాగా కాంటీన్‌కు బయల్దేరారు. ఆముదం త్రాగిన మొహం పెట్టు కుని. కాంటీన్‌లో ఉద్యోగుల 'విట్'లకు మధ్యమధ్య 'అహహ' అంటూ తెచ్చి కోలు నవ్వును ప్రదర్శించలేక ఆయనగారు యమబాధ పడ్డారనే చెప్పాలి. అర్ధగంట గడిచేసరికి మూడు మూళ్ళ (3—33) సంఖ్య కలిగిన బిల్లు లచ్చయ్యగారిని వెక్కిరిస్తూ వారిముందు ప్రత్యక్షమైంది. ఐదురూపాయల కాగితంతీసి ప్రక్కనేవున్న హోటల్ మేనేజరు కిచ్చారు బిల్లుతోసహా. ఆశాస్త్రీ చిల్లర ఇచ్చేలోపుగానే 'బ్రహ్మయ్యా! ఆచిల్లర తీసుకుని సిగరెట్లు. కిల్లీలూ పట్రా వోయ్" అని లోపల్నుంచి కేక. లచ్చయ్య గారాధ్వన్యనుకరణకు ప్రక్కకు తిరిగేలోగా బ్రహ్మయ్య నాబడు జవాను చిల్లరతీసుకోవ డమూ అయిపోయింది. బయటకువెళ్ళటమూ అయిపోయింది.

శాల్తీలన్నీ సీట్లలోకిచేరుకుని 'ఉస్సుర'ని భుక్తాయాసం తీర్చుకోవటం మొగలెట్టాయి.

ప్రెసిడెంటుగారి గుండెల్లోదడ ప్రారంభమైంది. తెచ్చిన డబ్బు ఐపోతున్నదికాని. పని కావటంలేదనే బెంగ. రాత్రికి వుండాల్సి వస్తే ఎలా అన్న భయం-ఆయన్ని వుక్కిరిబిక్కిరి చేస్తున్నై.

మరో అర్థగంట గడిచేసరికి మరో యిద్దరు గుమాస్తాల దగ్గరనుంచి విముక్తి పొందినై కాగితాలు. జవాను సలహా ప్రకారం వారిద్దరికీ కలిపి మరోహస్తం చెల్లించుకున్నారు 'మామూలు' క్రింద - వారు అభ్యర్థించకుండానే. అందుకేఆయన్ని ఆపద్బాంధవుడిగా 'ట్రీట్' చేశారు గుమాస్తాలు!

ఇక్కడ ప్రారంభమైంది లచ్చయ్యగారి చిక్కు. నాలుగో కింకరుడు లచ్చయ్యగారి జేబు ఖాళీకావటం పసికట్టాడో యేమో. మామూలు చేతిలో పడితేనేగాని. కలంచేత పుచ్చుకోనని మొండి కేశాడు. లచ్చయ్యగారేమో తన బాధ తను వెళ్ళబోసుకున్నాడు.

"అదిగాదండి. ఊరికే 'సైన్ ఇనిషల్స్' వేసే బచ్చాగాళ్ళందరికీ ముందుగా జమ కట్టి. అసలు పనిచేసే వాడికి నాకే లోకరా కొస్తే ఎలాగండి. పైగా పిల్లాడికి పుస్తకాలు కొనాలి కూడా యివాళ. ఇదేం లాభం లేదండీ ప్రెసిడెంటుగారూ. అసలు లోకమే యిలాగుందిలెండి...." అని సదరు నాలుగవ శాల్తీ తన ఆవేదనని వెళ్ళబోసుకుంది రుద్ధకంఠంతో.

ప్రెసిడెంటుగారు చేసేదిలేక బయట కొచ్చి "అన్యథా శరణంనాస్తి...." అని జవాన్ని సహాయం కోరారు.

అతనేం తక్కువ తిన్నాడ్రా "సరిసరి. ఇది మరీ బాగుంది. అసలు వాణ్ణి నాకే లేకుండా వాయిదావేస్తున్నారే. ఇలా చేస్తారను కుంటే యింతెందుకు చెప్పేవాణ్ణి. చేసేవాణ్ణి." అని వొంటి కాలుమీదలేచి. ఒక మార్గం సూచించాడు. "డబ్బు పుచ్చుకుని మళ్ళీ రేపురమ్మ"ని.

గత్యంతరం లేని పరిస్థితులు సంభవిస్తే ఎవరైనాఏంచేయగలరు చెప్పండి? కర్తవ్యం తోచక దిగులుపడి కొంపకు చేరారు లచ్చయ్యగారు.

మోకాలు లోతు బురదరోడ్డు మీదే నడవటానికి అలవాటు పడిన లచ్చయ్యగారు ఎట్టకేలకు యీ 'మామూలు'కార్యక్రమానికి దాసులై రోడ్డు పని ప్రారంభించారు. రాత్రింబవళ్ళు లారీల్లో క్వారీల చుట్టూ తిరిగి సరుకంతా రోడ్డుమీదికి తోలించారు. అప్పటికి చేతిలో డబ్బు అయిపోవటంతో 'పార్టు బిల్లు' కోసం బయల్దేరారు. మళ్ళీ 'మామూలు' కథ మామూలే కదా! ఈసారి పూర్వం కన్నా పెద్ద మొత్తాలు వదిలినయ్. ఎందువల్లనంటే జీపు డ్రైవర్ల దగ్గర్నుంచి. పెద్ద పెద్ద ఘటాల వరకూ తృణంకాకుండా పణం సమర్పించుకోవాల్సి వచ్చింది. అదీ కాక మరో రెండు ఆఫీసుల బెడద ఎక్కువైంది. అందులో వొకటి ప్రభుత్వంవారి కోశాగారపు కార్యాలయం. ఇక్కడ మరో రకం'మామూలు'ను చవిచూశారు లచ్చయ్యగారు. తను తీసుకు పోయిన బిల్లు మీద వూరికే ఆఫీసు ముద్ర కొట్టినందుకు జవానుకు మామూలు. సొమ్ము చెల్లించమనిరాసిన గుమాస్తాకు వరహా మామూలట. ఇక మూడవశాల్తీ ఆఫీసరుఘాయాలోకే వస్తాడు. ఆయనగారి 'మామూలు' కేవలం ధనరూపం లోనేకాకుండా.మరేవస్తురూపంలోనైనావుండ వచ్చునట. అందుకనివారి మామూలుకోర్కె "ఇంటిముందు బురద యెక్కువగా వుంటున్నది. ఒక అరలారీ కంకర సప్లయి చేయండి" అనేది.

దీనికి కాలవ్యవధి వుండికదా అని అర్ధాంగీకార సూచనగా మౌనంతో బయట పడ్డారు లచ్చయ్యగారు.

పోతే రెండవ ఆఫీసు 'బ్యాంకు'. ఇక్కడికి మాత్రం ఈ జాడ్యమింకా వ్యాపించక పోవటంతో. ఒక గంట ఆలస్యమైనా. సవ్యంగా సొమ్ముతీసుకుని యింటికి చేరారు లచ్చయ్యగారు.

ఆరోజు రాత్రి.... —.

ఆరుబయట పండువెన్నెల్లో పడుకున్న లచ్చయ్యగారి కళ్ళముందొక పెద్ద భూతం నాట్యమాడసాగింది. తను యింతవరకూ (సొంతఖర్చులుకాకుండా)ఖర్చుపెట్టినసొమ్ము అక్షరాలా పదిహేనువందల అరవైమూడు రూపాయల అరవైవొక్క నయాపైసాకాగా. తన చేతికి వచ్చిన సొమ్ము పదకొండు వందల తొంభైరూపాయల డెభైఒక్క నయాపైసా మాత్రమే. ఈరెండంకెలతేడా-మూడు వందల డెభైరెండు రూపాయల తొంభై నయాపైసలే. యిప్పుడాయన ముందున్న పెనుభూతం.

"మొత్తం రోడ్డుపనిలో మూడవవంతు ముగియకముందే యిలావుంటే. పూర్తయ్యే సరికి చేతిసొమ్ము యెంత వదుల్తుందో?."

ఈ ఆలోచన కలిగేసరికి శరీరమంతా చెమటలుపట్టింది. లేచి కూర్చుని పైపంచెతో మొహం తుడుచుకున్నారు.

ఇంతలో నెమ్మదిగా ప్రవేశించాడు సుబ్బయ్య. "ఏం లచ్చయ్య బావా పడుకున్నట్టున్నావే?" అనుకుంటూ.

"ఊఁ" లచ్చయ్యగారు నీరసంగా అన్నారు.

"ఏంటి బావా. సంగతులు?"-సుబ్బయ్య అరుగుమీద చతికిలబడుతూ ప్రశ్నించాడు.

"ఏమున్నయ్ సుబ్బయ్యా. రోడ్డుపనిలో యిప్పటికప్పుడేనాలుగొందలునష్టమొచ్చింది. హీనస్వరంతో విచారంగా అన్నారు లచ్చయ్యగారు.

"అంతే బావా. మోసేవాడికి కానీ తెలీదు బరువు" అని ఒక్క క్షణం తటపటాయించి "సరే గానీ బావా. మా పెద్దోడు ఆ మెట్రిక్ కాస్తా గట్టెక్కాడు గందా. ఏదో చేతికింద కొస్తాడని చూస్తున్నా. మన సమితిలో ఖాళీవుందట. కాస్త ఆ ప్రెసిడెంటుగారికిచెప్పి సాయం చెయ్యాలి బావా" అంటూ వచ్చిన పనిని వెళ్ళబెట్టాడు సుబ్బయ్య.

కొద్దిసేపు ఆలోచించారు లచ్చయ్యగారు చివరికెలాగో అన్నారు - మాటలుకూడ బలుక్కుని. "చూడు సుబ్బయ్యా. చేతనైన సాయం చేయటానికి నాకేం అభ్యంతరం లేదు....కాని....

"కానీ ఏంటి? చెప్పుబావా?"

"నా మామూలు నువ్వే భరించాల్సి వుంటుంది. అనక నీ యిష్టం. అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలుకదా అని ముందే చెప్తున్నా" అంటూ మంచం మీద వాలారు లచ్చయ్యగారు.

"అబ్బ! ఎంత 'మామూలు'గా నామాట నాకు అప్పజెప్పాడు లచ్చయ్య బావ!- అనిపించిందేమో సుబ్బయ్యకు? అలా అనిపించటం కూడా మామూలే మరి!

□□□



## మార్చి

1. ఈనాడు: వ్యాకరణంలోనే కాదు;
అంతర్జాతీయ వ్యవహారాల్లో కూడా
సంధులు పాటింప బడటంలేదు.

2. కాఫర్లవి అల్లా తప్పా మాటలంటారు
మహమ్మదీయ మతస్థులు

3. పారిశ్రామిక నాగరికత అంతా
వట్టి అయోమయం.

4. నెల్లూరుజిల్లా నెరజాణల
మొల గొలుసుల మీద
అందరికీ చాలా మోజు.

5. బడ్జెట్‌లో ముక్కాలు పాలు దండుగ

6. సినిమా వ్యాపారం బ్రహ్మాండమైన
లాటరీ.
అదృష్టం వున్నవాడు వాసన్.
లేనివాడు ఉపవాసన్

7. కేంద్ర ప్రభుత్వంలో చాలా
ఢిల్లీ డాలీయింగు

8. రష్యన్లకు నిండా తాగడం
వాడ్క

9. ఆశ్చర్యంగా వ్రాస్తాడు అహా రుద్ర

10. జీతం తగ్గిన జీవితం విశేషిస్తుంది
గుమాస్తాకు

11. హరి సేవవల్ల స్వర్గప్రాప్తి సందిగ్ధము;
మనోహరి సేవవల్ల
భూలోకమే స్వర్గతుల్యము.

12. కొందరికి పక్కలో బల్లెము మగడు
పక్కలో బెల్లము విటుడు

13. నిత్యమూ నాకు ఆలు
బహువచనంగానే ఇష్టము

14. రైల్లో అపరిమితంగా సిగరెట్లు
త్రాగడం నా కలవాటు.
పొగబండివిడిపించు పొగం జూచునరికి
నాకు ప్రోత్సాహం కలుగుతుంది

15. ముండ మోయుటకన్నా
బండ మోయుట మేలు

16. కులతత్వము ఖిలానికి హేతువు.
కులహీనులదే భవిష్యత్తు.



17. విధవకు గుదితీసి కొమ్ములు పెట్టేట్లు
చేశారు వీరేశలింగంగారు

18. మనస్సును స్వాధీన మందుంచుట
సులభమే నాకు;
దేహాన్ని స్వాధీన మందుంచుట
కష్టాతి కష్టమగు కార్యము.

19. కాంతల జయించుట ద్వివిధంబు
1. అందినచో జుట్టుపట్టి క్రిందకురమ్ము
2. అందనిచో కాళ్లపట్టి పయికిలెమ్ము

20. గణితము కన్నమా నాకు
మణితము ఇష్టము.

21. స్వార్థహీనుల వల్ల చాల కీడు;
పరార్థము మీదికే వారి కన్ను
నిత్యం ప్రసరించుతుంది.

22. నాయకుని కావాల్నని ఆసలేదు.
ఒక్క దక్షిణ నాయకునిగా తప్ప.

23. పురోకడన్న గానికి
తాళం వేస్తుంటాడు
బుర్ర లేనివాడు.

24. చెరకు చనుట కన్నను
చెరకు తినుట సులభము.

25. ముడి విప్పిన కోకశాస్త్రము
సులభంగా బోధ పడుతుంది

26. పణ్యాంగన పుణ్యానికి వస్తుందా.
ఏం. పాపం !

27. యుద్ధమ్ము వలన వసుధలోన
సువర్ణంబు లోపించి
పధ సూత్రము విలంబడి యున్నది

28. మరుని కయ్యానికి మదతి కాలు
దువ్వినాడు మనోహరుడు

29. కాంతతో ప్రశాంత జీవితం దుష్కరము
కాంతవినాప్రశాంతజీవితందుస్సాధ్యము

30. ఆ కామిని అతను అంటే చాలు
మన్మథుడే అని అనుకొంటుంది

31. కాముకి మనసు మెత్తమనసు

# మీరు, మీ సిగరెట్లు

ఈ క్రింది ముక్కలు చదివీ చదవగానే అంతా పొలోమని సిగరెట్లు మానేస్తారని, వాటిధరలు హఠాత్తుగా పడిపోతాయని, పొగచేలన్నీ వరిచేలుగా మారిపోతాయని,అమెరికన్ షేర్ మార్కెట్టు స్తంభించిపోతుందని మేము దురాశ పడడంలేదు. నిరాయుధీకరణలా, సైప్రస్ కల్లోలంలా ఈనాటి ప్రపంచ సమస్యల్లో ఒకటిగా తయారైన ఈవ్యసనాన్ని గురించి కొన్ని అర్థంటు విషయాలు పాఠకులకు జ్ఞాపకంచేయాలనే సదుద్దేశంతోనే దీన్ని ప్రచురిస్తున్నాము. ఈవ్యాసం మూలంగా కనీసం ఒక్కరైనా సిగరెట్ల పొగలోంచి బయట పడినందుకు సంతోషడుతున్నాము. ఆయన ఈవ్యాసరచయితే. వ్యాసం వ్రాయవలసిందిగా కోరగానే, దాన్ని గురించి ఆలోచించడంలో ఆయన తమ చిరకాలపు సిగరెట్ల అలవాటును మానుకోవడం విశేషమే

అసలు సిగరెట్లు ఎందుకు కాల్చాలనిపిస్తుంది? ప్రపంచంలో యిన్నికోట్లమంది యెందుకు అభ్యాసం చేసుకుంటున్నారు? అన్న విషయం ఆలోచిద్దాం. నాజూగ్గా, జేబులో ఇమిడే అందమైన చిన్న పెట్టెలో, ముత్యబంగారం రేకులమధ్యనుంచి సిగరెట్ తీసి ఠీవిగా కాల్చే విధానం చూస్తే ముచ్చటపడని యువకులుండరు. అలా కాల్చడం, ఒక నాగరిక చిహ్నంగాను, ప్రత్యేకమైన పురుషలక్షణంగాను కనిపిస్తుంది.

చుట్టూ ఎంతోమంది ఏదో తృప్తితో సిగరెట్లు కాల్చడం చూస్తాము. రకరకాల సిగరెట్ల ఎడ్వర్‌టైజ్‌మెంట్లు మనల్ని ఆకర్షిస్తాయి. మనతాతలు, తండ్రులు,బంధుమిత్రాదులు కాలుస్తున్నారు. మనం చవిచూడని ఏదో ఆనందం వాళ్ళందరూ అనుభవిస్తున్నారు, లేకపోతే వాళ్ళెందుకు కాలుస్తారు, ఇలాంటి భావాలుకలగటంతోటే రహస్యంగా కాల్చాలన్న కోరిక కలుగుతుంది. పదిహేనునుంచి ఇరవైఐదు సంవత్సరాలమధ్య ముఖ్యంగా యౌవనారంభంలో యీకోరిక మొలకెత్తుతుంది. విచక్షణాజ్ఞానం, బాధ్యతలులేని యీకొంటె వయస్సులో కలిగే యీమనోవైకల్యానికి ఫలితమే ఈవ్యసనం. ఈనాడు ఈ వ్యసనానికి బానిసలైన వాళ్ళందరూ ఇలా మొదలెట్టినవాళ్ళే.

సిగరెట్టు కాల్చడం నేర్చుకోడానికి యెంతో మనోబలం కావాలి. మొదటిసారిగా సిగరెట్ కాల్చినప్పుడు, నోరు చేదు, తల దిమ్ము, కళ్ళల్లో నీరు తిరగడం, పొగ లోపలికి పీలుస్తే దగ్గుతో ఉక్కిరిబిక్కిరవడం యిన్ని జరుగుతాయి. ఈ అనుభవంతో నిరుత్సాహ పడము. ఎంతో పట్టుదలతో, మిత్రుల సహాయ సహకారాలతో, కాల్చడంలోవున్న బాధలన్నీ సంతోషంతో భరిస్తూ ఈ వ్యసనాన్ని 'ఫేషన్' పేరిట అభ్యాసం చేసుకుంటాము.

సిగరెట్టు కాల్చడం మరల్చుకోలేనంత అలవాటుగా ఎందుకవుతుందో పరిశీలిద్దాము. పొగాకులో "నికోటిన్" అనే పదార్థంవుంది. సిగరెట్ కాల్చినప్పుడు పొగద్వారా యిది నాసికారంధ్రాలనుంచి ఊపిరి తిత్తులూ,

అక్కడ్నుంచి రక్తనాళాల గుండా రక్త ప్రవాహంలోకి ప్రవేశిస్తుంది. ఎంత మనం పొగ బయటకి విడిచి పెట్టేశామనుకున్నా, తగు మాత్రంగా ఉఛ్వాస నిశ్వాసాలద్వారా రక్తంలోకి 'నికోటిన్' సరఫరా జరుగుతూనే వుంటుంది. "నికోటిన్"కి మెదడు నాడీ మండలాలను ఉత్తేజ పరిచే స్వభావం వుంది. మెదడు నరాల కార్యకలాపాలు ఒక స్థాయిలో వుంటాయి. ఇలాంటి ఉత్తేజక పదార్థాల మూలంగా వాటి స్థాయిని పెంచినట్టయితే, ఆ పదార్థాల ప్రభావం తగ్గిపోగానే సహజంగా వుండే స్థాయికంటే దిగజారిపోతాయి. (Depression) సిగరెట్ కాల్చగానే 'నికోటిన్' ప్రభావంతో ఒక రకమైన ఉత్సాహాన్ననుభవిస్తాం. నికోటిన్ ప్రభావం కొన్ని నిముషాలు మాత్రమే వుంటుంది. అంచేత కొంతసేపయిన తర్వాత ఈ ఉషారు తగ్గిపోవడమే కాకుండా 'నీరసం' వస్తుంది. వెంటనే మరో సిగరెట్టు కాల్చబుద్ధవుతుంది. క్రమేపీ "నికోటిన్" యిచ్చే ఉత్తేజం యొక్క ఉద్రిక్తత తగ్గుతూ వుంటుంది. ఈ అసంతృప్తిని భర్తీ చెయ్యడానికి సిగరెట్లు ఎక్కువ కాల్చవలసి వస్తుంది. రాను రాను మెదడుకూ, నరాలకూ ఈ ప్రేరేపణ అలవాటయి, "నికోటిన్" లేకపోతే మంద కొడిగా పని చెయ్యడం మొదలెడతాయి. ఈ విధంగా సిగరెట్లు కాల్చడం తప్పని సరిగా వ్యసనమవుతుంది.

ఇక, సిగరెట్లు కాలిస్తేవచ్చే ప్రమాదాలేమిటి? పొగంటే ఏమిటి? ఇదిఒకమిశ్రమం. ఇందులో గాలిలో తేలిపోయే సూక్ష్మమైన, నికోటిన్‌తో కూడిన భస్మరేణువులూ, కార్బన్‌మోనాక్సైడు, సల్ఫర్‌డయాక్సైడ్, హైడ్రోసయానిక్ ఏసిడ్ వుంటాయి. ఇవన్నీ విషపదార్థాలే. అయితే వీటంతట ఇవి వెంటనే ప్రాణహాని చేయ కలిగినంత మోతాదుల్లో వుండవు. పొగ నోటినుండి రక్తనాళం వరకూ ప్రయాణం చేసే దార్లో, నాచుతంటి (మ్యూకస్ మెంబ్రేను) పదార్థంతో కప్పబడి రక్షించ బడుతున్న నాసికారంధ్రాలూ, గొంతుక, వాయు నాళముల సున్నితమైన ఉపరితలాలమీద ఈవిష పదార్థ మిశ్రమం దాడిచేసి ఆ రక్షణ పదార్థాన్ని కందేటట్లో, వాచేటట్లో చేస్తుంది. ఇలా తొలగించబడ్డ రక్షణ పదార్థమే దగ్గూ, గురక రూపాలలో వెలుపలికి వచ్చే కఫము (మ్యూకస్). ఈ స్థితిలో వ్యాధి కారక సూక్ష్మజీవులు సులభంగా ఈ సున్నితమైన భాగాలను చేరి ఊపిరి తిత్తుల వరకు వ్యాపిస్తాయి.

సిగరెట్లను వ్యసనం చెయ్యడమే కాకుండా, 'నికోటిన్' ప్రభావం 1. రక్తపు పోటు, 2. నరాల సత్తువ, 3. రుచి, వాసన గ్రహించే మస్తిష్క కేంద్రాలు, 4. గర్భకోశంలో అమ్లస్రావం, 5. దృష్టి-వీటన్నిటి మీదా వుంటుంది. అమెరికాలో జరిగిన పరిశోధనలను బట్టి సిగరెట్లు కాల్చడం మానేసిన నెలరోజుల్లో నూటికి డెబ్బై మందిలో కనిపించినమార్పులివి: 1. ఆకలి, జీర్ణశక్తి యెక్కువయ్యాయి. 2. నిద్రబాగా పడుతుంది. 3. విసుగు, చిరాకు తగ్గాయి. 4. అలసట తగ్గి యిదివరకుకంటే దేహ పరిశ్రమ యెక్కువ చెయ్యగలుగుతున్నారు. 5. పువ్వులూ, పళ్లూ, కూరగాయలూ వీటిలో వున్న రుచి, పరిమళం యిదివరకుకంటే యెక్కువ గ్రహించగలుగుతున్నారు.

సిగరెట్లు కాల్చే వాళ్ళకి, కాల్చనివాళ్ళకి ఊపిరి తిత్తులకు సంబంధించిన 'క్షయ,' కేన్సర్ రోగాలకి గల నిష్పత్తి పరిశీలిస్తే సిగరెట్లు మానెయ్యడం యెంత అవసరమో తెలుస్తుంది. సిగరెట్లు కాల్చనివాళ్ళకంటే కాల్చేవాళ్ళల్లో 'క్షయ' ఏడురెట్లు కనబడుతుంది. సిగరెట్లు కాల్చే ప్రతి 15 మంది





లోనూ ఒకళ్ళకి కేన్సర్ వచ్చే అవకాశం వుంది. సిగరెట్లూ, చుట్టలూ, పైపు, యీ మూడింటిలోనూ సిగరెట్లు ప్రమాదకరమైనవని తేలింది. మామూలు పొగాకును సిగరెట్లలో దట్టించడానికి అనుకూలమైన పొగాకు తునకలుగా తయారుచేసే విధానంలో రసాయనిక మార్పులయితే నేమి, చుట్టబడిన కాగితం తాలూకు పొగలోవున్న విషపదార్థాలైతేనేమి సిగరెట్లు చాలా అపాయకరమైనవని నిర్ధారణ చేశాయి.

"ఆరోగ్యభంగం కాకుండా రోజుకు ఎన్ని సిగరెట్లు కాల్చవచ్చు?" అనే ప్రశ్నకి సమాధానం చెప్పడం కంటె చెప్పకపోవడమే మంచిది. మనచుట్టూవున్న వాతావరణంలో 'కేన్సర్', క్షయ రోగాలకి సంబంధించిన సూక్ష్మ జీవులెప్పుడూ వుంటూనే వుంటాయి. ఆ వ్యాధులు మనకి రాకపోవడానికికారణం మనరక్తంలోనివ్యాధి నిరోధక శక్తి. ఈ శక్తి, వాతావరణాన్నిబట్టి శరీర స్వస్థతను బట్టి మారుతూ వుంటుంది. ఇవి మనం గ్రహించలేని మార్పులు. మన శరీర స్థితికి, వాతావరణం మనకి ప్రతికూలంగా వున్నప్పుడు, మనరక్తం సూక్ష్మజీవుల దాడి నెదుర్కోవలసి వచ్చినప్పుడు, ఊపిరి తిత్తులను బలహీనపరుస్తూ, రక్తంలో విషంకలిపే పొగ పీలుస్తూ ఒక్కసిగరెట్ మాత్రం ఎందుకు కాల్చాలి? కేవలం ఆ ఒక్క సిగరెట్టు పొగ వల్లనే ప్రమాదం వచ్చే అవకాశం లేదా?

వ్యసనంయొక్క ప్రాబల్యం మెదడు యొక్క విచక్షణాశక్తికి అతీతం. త్రాగుడు, నల్లమందు, సిగరెట్లు - ఇవన్నీ వ్యసనాలే. వీటికి లోబడినవారిలో ఎంతోమంది మేధావులున్నారు. త్రాగుడు మనిషిని సర్వనాశనం చేసే ఘోరమైన వ్యసనమని తెలుసుండీ కూడా త్రాగుడు మానలేరు. కారణమేమిటంటే వాళ్ళ వ్యసనం వశంలో వున్నారు. కాని మెదడు వశంలో లేరు. ఏవ్యసనమైనా యింతే. సిగరెట్లు కాల్చే ప్రతివ్యక్తి ఏదో అనుభవంతో, ముందో వెనకో తను యీ వ్యసనంయొక్క కబంధ హస్తాల్లో యిరుకున్నానని గ్రహించి మానేద్దామనుకుంటాడు. మనోబలం చాలక నిస్పృహతో మానెయ్యాలన్న ఆలోచనల్ని చంపుకుంటాడు.

డబ్బుకోసం యిబ్బందిపడే రోజుల్లో సయితం, ఏ ఖర్చయినా తగ్గించుకుంటాం కాని సిగరెట్ల ఖర్చు తగ్గించుకోలేము. ఇది అత్యవసరాల్లో జమ. ఈసిగరెట్లకోసం రోజుకెంత ఖర్చుపెడుతున్నామో జ్ఞాపకం తెచ్చుకుని, నెలకెంతో ఖర్చవుతుందీ, సంవత్సరానికెంత ఖర్చవుతుందీ లెక్కవేసి చూసుకుంటే, ఆ డబ్బుతో, మన ఆర్థిక స్తోమతకి అతీతమనుకున్న యెన్నో వస్తువులను కొనుక్కో కలుగుతాం అనిపిస్తుంది. నూరురూపాయలు సంపాదించే ఆసామీని, నెలకి 10 రూపాయలు చొప్పున జీవిత భీమాకి కట్టమంటే శక్తిలేదంటాడు. కాని పది పదిహేను రూపాయలు నెలకి సిగరెట్ల కోసం ఖర్చుపెట్టడానికి వెనుదీయడు. ఈనాడు సామాన్య మానవుడుచేసే ఒకే ఒక్క అనవసరపు ఖర్చు - సిగరెట్లు.

సిగరెట్లు మానెయ్యడం ఎలా సాధ్యమౌతుందో ఆలోచిద్దాం. దీనికి మూడు మార్గాలు కనబడుతున్నాయి. 1 కొద్దికొద్దిగా తగ్గిస్తూ చివరకి పూర్తిగా మానెయ్యడం. 2. ఈ అలవాటునుంచి తప్పించుకోడానికి. యింతకంటే తక్కువ అపకారం చేసే అలవాట్లలోకి దిగడం. 3 వెంటనే ప్రతిజ్ఞ తీసుకుని మానెయ్యడం.

మొదటి పద్ధతి, అంటే, రోజురోజుకీ కాల్చే సిగరెట్లసంఖ్య తగ్గించుకుంటూ పూర్తిగా మానెయ్యడం సులభ మార్గంగా తోస్తుంది. కాని యీ పద్ధతిని మానెయ్యడం అసంభవం. మానెయ్యాలనుకుంటూ కొద్దికొద్దిగాకాల్చాలను కోవడంలోనే మనమనో దౌర్బల్యం వ్యక్తమౌతుంది. సిగరెట్లు కొంతవరకూ తగ్గించడం జరుగుతుంది. కొన్నాళ్ళలో మళ్ళీ మామూలు ధోరణికి రావడం తథ్యం.

రెండోమార్గమేమిటంటే మానెయ్యడానికి నిశ్చయించుకుని సాధ్యమైనంతవరకూ, కొన్నాళ్ల సిగరెట్ల వాతావరణానికి దూరంగా

వుంటూ. మనస్సు సిగరెట్ల మీదకి లాగి నప్పుడు జరదాకిళ్ళీయో. ముక్కుపొడుం పీల్చడమో మొదలెట్టటం. షూ మూ లు తాంబూలం. వక్కపొడిలాంటివి వేసుకుంటే సిగరెట్లు మరింత కాల్చబుద్ధవుతుంది. దీనిలో వున్న ప్రమాదమేమిటంటే సిగరెట్లు విజయవంతంగా మానేసి వాటిస్థానే ముక్కుపొడుం కారాకిళ్ళీ లాంటి దురభ్యాసాలు తగులుకొనడం.

మూడోపద్ధతిఅత్యుత్తమం, కఠినం, సులభం కూడాను. దీనికి కావలసింది అచంచలమైన మనోబలం. మిమ్మల్ని మీరీ ప్రశ్నలు వేసుకోండి - "నేను సిగరెట్టెందుకు కాలుస్తున్నాను? ఆరోగ్యమా? బలమా? సువాసనా? ఆనందమా? ఈ వ్యసనానికి నేనెందుకింత బానిసనవ్వాలి? ఇది మానేస్తే ఇంతకంటె మంచి ఆరోగ్యం పొందగలిగే అవకాశమున్నప్పుడు నేనెందుకు కాల్చాలి? డబ్బు తగలేస్తూ, ఆరోగ్యం నాశనం చేసుకుంటూ వ్యర్థమైన ఈ వ్యసనాన్నుంచి విముక్తుణ్ణయ్యి ఆరోగ్యంగా, గర్వంగా ఎందుకు జీవించకూడదు? కేవలం ఒక దుర్వ్యసనాన్ని విడిచి పెట్టలేని క్షీణ మనోబలంతో నేనీ జీవితంలో సాధించేదేముంది?" ఈ ప్రశ్నలకి సమాధానంగా మీలో సిగరెట్లు మానెయ్యాలన్న చైతన్యం, సంకల్పం కలిగితే. వెంటనే ఇక కాల్చనని శపథం చెయ్యండి. కనపడ్డ మీ మిత్రులందరికీ సిగరెట్లు మానేశానని చెప్పండి. వాళ్ళు నవ్వుతారు. హేళన చేస్తారు. నిరుత్సాహ పడకండి. వాళ్ళు మిమ్మల్ని అభినందించే రోజులు ముందున్నాయి. వాళ్ళాక్షేపించినకొద్దీ మీ పట్టుదల ఎక్కువవ్వాలి, సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె మీ దగ్గరే వుంచుకోండి. అది మీ నిగ్రహానికి మరో పరీక్ష. మీ ఎదురుగుండా సిగరెట్లు కాల్చేవాళ్ళని గురించి జాలి పడండి. అసూయ పడేదేమీ లేదు. చేతనయితే మానెయ్యాలని బోధించండి.

ఈ వ్యాసం చదివిన పాఠకుల్లో సిగరెట్ అభ్యాసమున్నవాళ్ళంటే వెంటనే ఆ వ్యసనాన్ని "జ్యోతి"కి అర్పించెయ్యండి "జ్యోతి" వారిని హృదయ పూర్వకంగా అభినందిస్తుంది. □□□

— బి. ఏ. రమణారావు





# స్వరపరాయణ శ్రీ ఆదినారాయణ

రచన : పి. బి. శ్రీనివాస్

మల్లెపువ్వులాంటి పొడుగు చేతుల షర్టూ, సిల్కైన పాంటూ ధరించి, నిర్మలమైన హార్టూ అప్రతిమానమైన ఆర్ధగల ఆదినారాయణరావుగారిని సన్నిహితులూ, మిత్రులూ, ఆప్తులూ అయిన అందరూ ఆప్యాయంగా 'అబ్బాయి' అంటారు. వీరి సతీమణి అయిన శ్రీమతి అంజలీదేవిగార్ని 'అమ్మాయి' అంటారని వేరే చెప్పనవసరం లేదనుకుంటా. ఈ అబ్బాయి. అమ్మాయిలది తెలుగు చిత్ర రంగంలో సాటిలేని జంట.

శ్రీఆదినారాయణ 1918వ సంవత్సరంలో శ్రీ కృష్ణాష్టమినాడు విజయవాడలో అవతరించారు. బాల్యంనుండీ వీరికి సంగీతాభిలాష మెండుగా వుండేది. దానికి తోడుగా. అబ్బాయిగారి నాన్నగారు కూడా సంగీత ప్రియులే అవడం వీరికి చాలా ఉపకరించింది. వీరి తండ్రిగారు అనేక నాటక ప్రదర్శనలు జరిపించేవారు. అంతేకాక వారివద్ద అనాటి సుప్రసిద్ధ గాయక శిఖామణుల రికార్డులెన్నో వుండేవి. ముఖ్యంగా బాలగంధర్వ. దీనానాథ్, నారాయణరావ్ వ్యాస్, కరీంఖాన్ మున్నగు వారి పాటలంటే ప్రాణం వారికి. ఆ రికార్డులన్నీ అబ్బాయి క్షుణ్ణంగా నేర్చుకుని కంఠతా పట్టి వప్ప జెప్పేవారు. వీరు ఏక, తప్పితే. ద్విసంతగ్రాహి. ఆ రోజుల్లో ఏ రికార్డయినా సరే ఎన్ని బిరకాలూ సంగతులూ గల పటుతరగీతాలైనా సరే ఒకటి రెండుసార్లు విన్నంత మాత్రానే వెంటనే పాడి అచ్చంగా అదే రీతిగా వినిపించ గలిగేవారు.

విశాఖపట్టణంలో రాజరాజేశ్వరీ నాట్యమండలివారు. 14సంవత్సరాలలోపు వయస్సుగల బాలురతో 'సావిత్రి' నాటకం ప్రదర్శించడానికి నిర్ణయించుకున్నారు. నారదుని వేషానికి పనికొచ్చే విధాన బాగా పాడగలిగే కుర్రాడికోసం గాలిస్తున్నారు. ఆ నాటక సమాజపు కార్యదర్శి వూరంతా తిరిగాడు. ఓచోట ఓ అమ్మాయి పాట వినిపించింది. సన్నగా తీగలా మెత్తగా హాయిగా తీయగా వున్న ఆ అమ్మాయిగొంతు వినేసరికి కార్యదర్శికి కళ్ళకెదురుగా వైకుంఠం కనిపించినట్లయింది. వీధిగుమ్మం ముందు కూర్చుని కాలిమీద కాలేసుకుని దర్జాగా మజాగా చుట్ట కాల్చుకుంటూ ఆపాట వింటూ ఆనందిస్తున్న ఓ ఆసామీని అడిగాడు. "ఎవరయ్యా

"అద్భుతంగా ఆలపిస్తున్న ఈ అమ్మాయి" అని, "భలే కోకిలకంఠం. వాళ్ళ అమ్మానాన్నా ఒప్పుకుంటే మా డ్రామాలో నారదుడి వేషం వేయింపిస్తా" అన్నాట్ట. దానికా ఆసామీ ఇతగాణ్ణి ఎగాదిగాచూసి—"అబ్బాయిని పట్టుకుని అమ్మాయంటా వేంటయ్యా. భలే తంటాగా వుండాదే నీతో. ఆ పాడేది అమ్మాయని యెవడు చెప్పాడు నీకు"— అన్నాడు.

అది విని లోపలికివెళ్ళి చూసిన కార్యదర్శి ఆశ్చర్యానికి అంతులేదు. ఓ ఏడు సంవత్సరాల బాలగాయకుడు కుర్చీ లో కూర్చుని, బాలగంధర్వపాట"మూర్తిమంత" దంచేస్తున్నాడు. ఆ అబ్బాయి మన అబ్బాయిగారే. ఆ కార్యదర్శి వేరెవరో కాదు. శోభనాచల రాజరాజేశ్వరీ సంస్థలకి తదుపరి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసి పేరుపొందిన, ఆమధ్యనే స్వర్గస్థులైన కె.వి. సుబ్బారావు.

ఎలాగైతేనేం, అబ్బాయి తల్లి దండ్రులకి నచ్చచెప్పి ఒప్పించి, కె. వి. సుబ్బారావు ఈకుర్రాడిచేత 'సావిత్రి'లో సావిత్రి చెలికత్తె వేషం, నారదుడి వేషం రెండూ వేయించారు. ఈ అర్భకుడి అభినయానికి, గానానికి సభికులందరూ ముగ్ధులై, కరతాళ ధ్వనులతో హాలు దద్దరిల్లజేశారు. తదాదిగా ప్రహ్లాదుడూ, చిన్నికృష్ణుడూ, చిరుతొండడూ వంటి బాలపాత్రలెన్నో అభినయించారు అబ్బాయిగారు. చోడవరంలో ఈ బాలుర 'సావిత్రి' ప్రదర్శనానికి హాజరైన అప్పటి జిల్లాకలెక్టరు రూథర్‌ఫోర్డు దొరగారు అబ్బాయికి స్వర్ణపతకం బహూకరించారు.

సాలూరులో నాలుగు సంవత్సరాలపాటు, ఘంటసాల గురువులైన శ్రీ పాత్రాయని సీతారామశాస్త్రిగారి వద్దా, వారితండ్రివద్దా, అబ్బాయి కృతులవరకూ కర్ణాటక సంగీతం అభ్యసించారు. సంగీతపాఠం నేర్పిన పిమ్మట, గురువుగారు, "ఏదిదాబూ, 'మూర్తిమంత' పాడు" అని వాత్సల్యంతో అడిగి పాడించుకుని విని తన్మయులయేవారు. ఈ హిందీ పాటలు సరిగా అర్థంచేసుకోగలందులకని అబ్బాయి ఆనాడే హిందీ నేర్చుకున్నారు.

పదవ ఏట కాకినాడకి మకాంమార్చారు. అక్కడ యంగ్మెన్సు హ్యాపీక్లబ్‌లో చేరి డ్రామాలు రాయడం అర్గనైజ్ చేయడం, హార్మోనీ వాయించడం వగైరా సాగించేవారు. నేటి మేటి నటీ నటులైన అంజలి, రేలంగి, రంగారావు మున్నగు పలువురు కళాకారులు నాటి ఈ యంగ్మెన్సు హ్యాపీక్లబ్‌లో తరిఫీదు నొంది మెరుగొందినవారే.

బోర్న్ ఏక్టర్ ఐన శ్రీ ఎస్. వి. రంగారావుగారి బంధువైన డైరెక్టర్ బి.వి. రామానందం వీరిని 'వరూధిని' కోసం సేలం తీసుకొచ్చారు. కాని వీరా చిత్రానికి కొన్ని గీతాలు వ్రాసి, వరసలు చేసి యిచ్చి, కారణాంతరాలవల్ల సగంలోనే వదిలి వచ్చేశారు.

తొలిసారిగా వీరు స్వతంత్రంగా సంగీత సారధ్యం నెరపిన చిత్రం శ్రీ సుబ్బారావుగారి 'పల్లెటూరి పిల్ల'. ఈ చిత్రానికి కథావస్తువు సమకూర్చడంలో కూడా అబ్బాయి కొంత భాగం పంచుకున్నారు. ఆంగ్లనాటకం "పిజారో" ఆధారంగా కొన్ని చక్కని సన్నివేశాలని సృష్టించారు. పల్లె వాతావరణానికి తగిన జానపదగీత పద్ధతిలో పాటలల్లివరస అమర్చి, ప్రథమ ప్రయత్నంలోనే పాప్యులర్ హిట్స్ అందీయగలిగారుప్రజావీకానికి. తన ప్రథమ సంగీత దర్శకత్వంలో, ప్రథమంగా రికార్డు చేయించిన పాట తనే వ్రాశారు. అదే 'పల్లెసీమల అందమోయీ' అన్నది. శ్రీ దేవి. నరేంద్ర అనే నూతన





అబ్బాయిగారు, అమ్మాయిగారు, హాస్యకర్తగారు, వ్యాసకర్తగారు

గాయకీ గాయకులకీ చిత్రంలో అవకాశమిచ్చి ప్రోత్సహించారు. ఈ చిత్రంలో శ్రీశ్రీ వ్రాయగా, ఘంటసాల జోరుగా హుషారుగా పాడగా, అబ్బాయి స్వరరచనలో అలరారిన "శాంతవంటి పిల్లలేదోయ్" వంటి పాటకూడా లేదోయ్ లేదోయ్ అని ధీమాగా అనవచ్చు.

"తిలోత్తమ"కు ఉత్తమ సంగీతం సమకూర్చి శ్రీమతి ఎమ్. ఎల్. వసంత కుమారిచేత, బేప్ మాష్టర్ సౌమిత్రి చేతా పసందుగా పాడించారు.

అశ్వనీ పిక్చర్సు పేరిట వీరు 'మాయలమారి' 'మాయక్కారి' చిత్ర నిర్మాణం సాగిస్తున్న రోజుల్లో, అళ్వారు పేటలోని ఆఫీసుకి నేను తరుచూ వెడుతూ వుండేవాడిని. పిఠాపురం, బాలసరస్వతులచే ప్రణయద్వంద్వగీతం రిహార్సల్సు చేయిస్తూ వుండే సమయాన నేను ప్రక్కనే వింటూ కూర్చునేవాడిని తన్మయుడినై. తీగలాసాగి వీణలా పలికే శ్రీమతి బాలసరస్వతి గొంతు చిలికే సంగతుల ఒడుగులు గమనిస్తూ విస్తుపోయే వాడిని. ఈ జంటే ఈ చిత్రంలోనే మరో వీధి భాగవతం పాటకూడా పాడారు. "రాజా వెడలివచ్చే సభకు, రవి తేజములలరగరాజా" అని మొదలయే ఆ గీతం ఆతాణాలో మిఠాయిలా అందించారు అబ్బాయిగారు. అంతేకాక, "అంతా అంతాయింతేరా" అనే పాట కడు పుబ్బ నవ్వు పుట్టించే విధాన వ్రాసి, ట్యూనుచేసి, గమ్మత్తుగా పాడించారు శ్రీ కస్తూరి శివరావుచేత. ఈ పాట రిహార్సలుచేస్తూ, శ్రీ శివరావు చేసే అల్లరీ గల్లంతూ, ప్రదర్శించే హావభావాలూ, నేటి రాక్ ఎండ్‌రోల్ కేమాత్రమూ తీసిపోయేవికావు. నాకీనాటికి మరపురావు.

వీరి "పరదేశి" చిత్రంలోనే ప్రథమంగా నేను వీరిని కలుసుకున్నాను నేపథ్య గాయకుని హోదాలో. 'అబ్బనకడి అదాం అదాం' అనే విలక్షణమైన హాస్యగేయం నాచేపాడించారు కాని అది తదుపరి కత్తెర కెర అయింది. చిత్రంలోలేదు.

'పరదేశి' చిత్రంలో శ్రీ మల్లాది కృష్ణశర్మ విరచితమైన 'నే నెందుకు రావాలి' అనే గీతం శ్రీమతి జిక్కి చక్కగా పాడారు. 'నా హృదయంలో యెవరో పొంచి పలుకరించేరు' అని శ్రీమతి కోమల మిశ్ర మధ్యమావతిరాగంలో తిశ్రతాళంలో ఆలపించిన గీతం మలయమారుతం (రాగం కాదు)లా పులకింపజేస్తుంది.

"అనార్కలీ" తెలుగు చిత్రంలోని పాట ప్రతీదీ హిందీ "అనార్కలీ" చిత్రంలో వలెనే. ప్రజల పెదవులమీద నిరంతర నృత్యం సలిపింది. "కలవోలె ప్రేమ కరిగిపోవునా" అని మాయామాళవ గౌళలో జిక్కి గళం వినిపించిన గీతం విని కరగని హృదయమే వుండదు. మిశ్రకీరవాణిలో 'అనార్‌కలీ అనార్‌కలీ' అని వినిపించిన టైటిల్ సాంగ్ నా గుండెని కదలించివేసింది. "భీంపలాస్"లో 'జీవితమే సఫలమూ'; "మాండ్"జిల్లాలో. సంచరించిన "నను దయగను మా కొనుమా"; 'మా కథలే ముగిసెనుగా ఈగతి' అనే శోకగీతి; 'తాగి తూగేనని తలచెను లోకము' అని మత్తుగా చిత్తుచేసే త్రాగుడు పాటా; ఇవన్నీ సాహిత్య సంగీత పరంగా పరిపాటిలేనివి శ్రీమతి జిక్కిగారి చక్కెర గొంతునుండి స్రవించిన మధుర సంగీత మధురసధారలు.. "సోజా రాజకుమారీ సోజా" (సైగల్ పాడినదికాదు), అని "రాజా"గారు తాజాగా మృదువుగా, మెత్తగా, హాయిగా పాడిన జోలపాట అనార్కలీతో పాటు ఆదీయన్నుని కూడా జోకొట్టింది, ఈజోల మధ్యమావతిఛాయలో సాగింది మాల్కోస్‌లాగేమధ్యమావతికూడా తరుచు వినిపిస్తుంది అబ్బాయిగారి అనేక గీతాలలో.

జిక్కి ఘంటసాలల ద్విగళ గీతి "రాజశేఖరాసీపై మోజుతీరలేదురా"పాటవింటున్న వారి కెంతకీ ఆ పాటపై మోజు తీరదు. మాల్కోస్ రాగంలో మధురాతి మధురంగా మలచబడిందీ గేయ శిల్పం. "కలిసె నెలరాజు కలువ చెలినీ, కలిసె యువరాజు అనార్కలినీ" అని శ్రీ సముద్రాల కలం చిగురింప జేసిన "పల్లవము" (పల్లవి) శ్రోతల ఉల్లాన్ని ఉల్లాసంతో నింపింది. అదే పల్లవిని పదే పదే పలవింప జేసింది.

అశ్వరాజ్" వారి "అన్నదాత"లో "కాటకం, కాటకం" 'జయ జయయదు వీర;' "స్వర్గమిదేనోయి; "రింగురింగున సాగిపోవె రంగు రంగుల బోటా" అన్న జిక్కి పియన్నార్ల హాస్యగీతం. అబ్బాయిగారి కలంనుండి వెలువడినవే. ఈ చిత్రంలోని, 'ప్రళయ పయోధిజలే' అని సుశీలగా రాలపించిన అష్టపదిని రాగాష్టకంలో పదిల పరిచారు. కళ్యాణి, కమాచి, హిందోళం (మాల్కోస్) మోహన, ధన్యాసి, అఠాణా కేదారగౌళ, మధ్యమావతుల చేరికయే ఈ వర్గ రాగ మాలిక, రాగమాలికలంటే అపారమైన అనురాగం అబ్బాయిగారికి. సువర్ణ సుందరి, స్వర్ణమంజరి చిత్రాల్లోనే కాక హిందీ చిత్రంలోకూడా రాగమాలికలున్నాయి.

"సువర్ణ సుందరి"కిచ్చిన సంగీతంతో వీరి కీర్తి సౌరభం వింధ్యాచలాగ్రాలనుదాటి హిమాచలాగ్ర శిఖరాలనందుకుంది. తెలుగు తమిళ, హిందీ భాషలలో మూడింటిలోనూ వీరి సంగీతం ప్రజల్ని ముగ్ధుల్ని కావించింది. హిందీసుందరి కందించిన సశాస్త్రీయమైన సంగీతం విని ఉత్తరాదివారు ముక్కుమీద వేలేసుకున్నారు. 1958 లో వీరిని ఉత్తమ సంగీతదర్శకులుగా ఎన్నుకున్నారు. ఎవార్డిచ్చారు. ఇహ దక్షిణాదివా రూరుకుంటారు ? అనేక సన్మాన సభలు జరిపారు. వీరి నభినందిస్తూ ఈ గౌరవం దాక్షిణాత్య ఫిలిం పరిశ్రమ కంతటికీ చెందుతుందన్నారు వారందరూ.

పిలువకురా (తెలుగులో జిక్కిపాడినది).

అప్పైక్కాదే (అరవంలో సుశీల పాడినది).

ముఝే నాఖులా (హిందీలో లత పాడినది).

మూడూ, మూడు దేశాల్లోనూ మార్మోగాయి మాల్కోస్ రాగంలో. ఈపాట వినే ప్రతి రసికుడికీ, పిలవొద్దని బతిమాలినా, పిలవాలనే అనిపిస్తుంది. "మాల్కోస్' రాగం అంటే నాకు మహాప్రీతి. పైగా సెంటిమెంటుకూడాను. ప్రతీ చిత్రంలోనూ ఈరాగాన్ని ఉపయోగించకపోతే నామనసు తృప్తిచెందదు. ఒకవేళ నేను మరిచినా, నాసహాయకులునన్ను మరవనీయరీరాగాన్ని. కాని డ్రామాల కాలంలో భీంప్లాస్ పై మక్కువ యెక్కువగా వుండేది." అన్నారు మాటలమధ్య. "హాయిహాయిగాఆమనిరేయి" గేయాన్ని (హిండోల్) హంసానంది, బహార్, అసావేరి, యమన్ రాగాల మాలతో అలంకరించారు. లీలగారి "బంగారు వన్నెల రంగారు రంగేళీ!" సుశీల యమ్మెస్ రామారావుల యుగళగీతి; పియెన్నార్, సత్యం వగైరా పాల్గొన్న కామెడీసాంగ్, 'పాహిపరమేశ్వరా జగదీశ్వరా' అన్న సుశీలగారి మొరలిడే భక్తిగీతం శ్రోతల హృదయాలని రంజింపజేసి, లాలించి, నవ్వించి, కవ్వించి, కరిగిస్తాయి, కరిగించాయి.

నాకు వీరితో పరిచయం అధికమైనది "అడుత్తవీట్టుపెణ్" (పక్కింటమ్మాయి) అరవచిత్రం తాలూకు పాటల రికార్డింగు సందర్భంలోనే. ఆ చిత్రంలో నేను చాలా పాటలు పాడాను. ప్రతీపాటా హిట్టే.

"వాణాదపుష్పమే....వనితామణియే...." అని ప్రారంభించి సంగీతం మాష్టారు, పాఠం చెప్పుకుంటున్న అమ్మాయిని చూస్తూ వెకిలిచేష్టలు చేస్తూ వుండగా యెవరో వస్తూన్న అలికిడి వినబడడంతో, వెంటనే ప్లేటు మార్చి 'వాతాపి గణపతిం భజే' వా వా వా (రా, రా, రా) అని ద్వంద్వార్థంతో, గణపతి స్తోత్రంతో తెలివిగా ముగించే రసవత్తర సన్నివేశాని కనుగుణంగా, ఆపాటని "హంస ధ్వని"లో పలికించడం వీరి ఔచిత్యానుసరణకి ఉదాహరణలు.

వీరి "ఋణానుబంధం"లో కూడా నేను నాలుగుపాటలు పాడాను. మొదటిది సుశీల గారితో పాడిన 'దీపావళి' పాట "ఓహో ఒయ్యారిలాహిరి, వచ్చింది దీపాలపండగ" అన్నది. రెండవది జానకిగారితో కలిసి ఆలపించిన "అందమైన బావా ఆవుపాల కోవా" అనే జూనియర్ సముద్రాల రచించిన హాస్యగీతం. ఇందులో రాగాలరవ్వట్లు, భోగాల బొబ్బట్లు, నాప్రేమ పెసరట్టు లాంటి పదాల ప్రయోగం హైలైటు. జూనియర్‌కి యివ్వవలసిన మార్కు సెవరేటు. మూడవదీ జూనియరుదే. "రావేల అందాల బాలా" అ. శ్రీనివాస్సుశీలా ఘంటసాలల త్రిప్లెట్టు నాల్గవది మొదటి పండగ పాట వ్రాసిన శ్రీ కొసరాజు రచన "ఎహేఁ ఎహేఁ ఒహోఁ ఒహోఁ నీక్కుతోడాలే" అని. గుమ్మడికి నేను పాడినపాట ఇదొక్కటే యింతవరకూ. ఈపాట పక్కా జానపదరీతిలో సాగిన గానపదం.

ఇవికాక ఘంటసాల సోలో "ఋణానుబంధం" అనే థీంసాంగ్‌ని మరవలేము. "నిండు పున్నమి నెలా - పండెతీయని కలా" అని కమ్మగా శుకపికాలుగా కలిసి ఆలపించిన గాయనీ ద్వయం గానం అద్వితీయం.

"స్వర్ణమంజరి"లో కూడా బంగారం లాంటి పాటలు కుదిరాయి. "ఇదియే జీవితానందమూ" అన్న సుశీలా ఘంటసాలల యుగళగీతం అరవంలో నేనూ సుశీలగారూ రాగమాలికతో ఆలపించాం.

తిలక్, బసంత్, కమాస్, కళ్యాణి రాగాల సమ్మిశ్రణంతో రసోత్పత్తి కావించారు. ఈ రాగ సాగర సంగమంలో స్నానమాడి రంజిల్లింది రసిక లోకం. మాల్కోస్‌లో సుశీలా నాగయ్యలు మధురంగా పాడిన "మధురమైన గురుదీవెన" నిజంగా మరపురాని ప్రియ భావన. జానకిగారి "మైమరపించే యీ సొగసూ, మురిపించే యీ వయసూ నీవెలే" గేయం అమృతోపమేయం. సాటిమైన నటభైరవిలో నటరాజుని ఎలుగెత్తి పిలిచిన సుశీలగారి తరలిరావా - ననూ కావా - మహాదేవా" అన్న పిలుపు విని పరమ శివుడు పలికాడంటే (చిత్రంలో) మానవ మాత్రులమైన మనం. వేరేమన గలం? ఆ పాట ఎంతటిదని చెప్పగలం? "అమ్మా! నీ ఆశలన్నీ తీరెనా" అన్న ఘంటసాల వేవత్యగానం నిరుపమానం. "ఏనో ఏనో ఎన్నాళమిల్లా ఆనందం" అనే జానకి శ్రీనివాస్సుశీలల త్రిగళగీతం (Triplet) రసభరితం, ఇదే తాళమాలిక తెలుగులో "ఏమో ఏమో ఎదలోన పొంగే ఆనందం" అని జానకి సుశీలా ఘంటసాలలు వినిపించారు.

వీరు ప్రస్తుతం నిర్మిస్తున్న (పూలశయ్య) "పూలోంకీసేజ్" హిందీ చిత్రంలోకూడా విచిత్రమైన రాగతాళ మాలికలున్నట్లు తెలుస్తోంది. లతా మన్నాడేలచే పాడించిన "అఖీజారసియా "అనేరసవత్తర రాగమాలికలో దర్బారీ కానడా, మిశ్రకాఫీ, మాల్కోస్ వుపయోగించామన్నారు. అతూ, ఆ మేరే దిల్ మేఁఆ "అనే మరో ప్రేమగీతం లతాతో "సరళరేఖా సంగీతం"లో స్పెషలిస్టుఅయిన ముఖేశ్ చేత పాడించారట. ఈ "నవకోమల సుమశయ్యను" రాగమాలికా ధోలికగాచేసి రసికలోకాన్నంతటినీ వూపివూపి జోకొట్టబోతున్న ఆదినారాయణరావుగారు చలన చిత్ర సంగీత రంగానికి ఇతోధిక సేవ చేయగలరని, చేయాలని ఆశిస్తున్నాను.

□□□





# చిత్రరథుని చైత్రయాత్ర

## "మూగ మనసులు"

తెలుగులో సాంఘిక చిత్రాలు లెక్కకు మిక్కుటంగా వస్తున్నాయి కాని - వచ్చని తెలుగు దేశం నడిగడ్డమీద, అచ్చమైన తెలుగు వాతావరణానికి సంబంధించిన కథలతో స్వచ్ఛమైన తీయనైన తెలుగు భాషలో తీయబడిన చిత్రాలను వ్రేళ్ళమీద లెక్క పెట్టవచ్చు.

ఇటీవలి కాలంలో వచ్చిన అలాంటి చిత్రాలలో బాబూ మూవీస్ "మూగమనసులు" చిత్రం ప్రత్యేకంగా పేర్కొనదగింది.

దేశ భాషలన్నింటిలో తెలుగు లెస్స అన్న నానుడి సత్యవిదూరం కాదని చెబుతూ తెలుగు భాష తీయదనాన్ని చక్కగా వ్యక్తంచేసిన ఆచార్య ఆత్రేయ, ముళ్ళపూడి వెంకటరమణ మాటలు, జానపద గేయాలలో, పల్లెపాటలలో ఎంతటి మధురిమ ఉన్నదో తెలిపే ఆత్రేయ, కొసరాజు, దాశరధి పాటలు చిత్రానికి మంచి వరవడి తెచ్చాయి.

ఆత్మజ్యోతి అమర జ్యోతి అని, దానికి చావుపుట్టుకలు లేవని పెద్దవాళ్ళ నమ్మకం. (ఇప్పటి వారిలో కూడా కొంతమందికి ఈ విశ్వాసంవుంటే ఉండవచ్చు) ఈఆత్మ అనేది మరలజన్మఎత్తుతుందనిఅంటారు. గతజన్మలో ఏయే ఆశలతో అనుబంధాలతో జీవించామో నూటికి కోటికి ఏ ఒక్కరికో తెలుస్తుంది. దానిని పూర్వజన్మ పరిజ్ఞానమని పిలుస్తారు.

ఇలాంటి పరిజ్ఞానంకల ఒకవ్యక్తి చెప్పిన కథ "మూగమనసులు" చిత్రం.

పట్టభద్రులైన గోపీనాథ్, రాధాదేవి పాణిగ్రహణం చేసుకొని హనీమూన్‌కు బయల్దేరుతారు. గోదావరిలో నౌకా విహారం చేస్తుండగా, గోపీకి ఓపాడుభవంతికన్పిస్తుంది. దీనితో అంతవరకు సరికొత్త వధువుతో తొలినాటి భావాలను తెలిసి కొనడానికి ప్రయత్నిస్తున్న అతనికి ఏవేవో గుర్తుకు వస్తాయి.

నావనాపి ఆ భవంతివేపు పరుగిడుతాడు "నా గౌరిఏది, అమ్మాయిగారెక్కడ" అంటూ. అక్కడవున్న ఓ ముసలివ్యక్తివల్ల గౌరి ఆచూకీని తెలిసికొని గోదావరి తీరంలో రెండు సమాధుల దగ్గర అంత్యదశలోవున్న గౌరిని కలుసుకొంటాడు. "నేను గౌరీ! నీ గోపీని" అంటూ ఆమెను చేతులలోనికి తీసుకొంటాడు.

వార్ధక్యం పైబడి దేనికోసమో పలవరిస్తున్న గౌరి గోపీని తదేక దీక్షగా చూసి చిరునవ్వుతో ప్రాణాలు విడుస్తుంది.

ఇక్కడనుంచి అసలు కథప్రారంభమవుతుంది. గోపీ తన పూర్వజన్మలో జరిగిన సంఘటనలను రాధకు వివరిస్తాడు.

గత జన్మలో గోపీ గోపన్న. గోపన్న అంటే ప్రయాణీకులను ఆ గోదావరిపై ఆదరి నుంచి ఈ దరికి ఈదరినుంచి ఆ దరికి చేరవేసే పడవ కలాసీ; అతడి పడవ ప్రయాణీకులలో "అమ్మాయిగారు" ఒకరు. ఆమెను చూస్తుంటే గోపన్నకు ఎనక జల మదాసలు యెన్నో గుర్తుకు వస్తుంటాయి.

అమ్మాయిగారంటేగోపన్నకువల్లమాలిన అభిమానం. ఆమెకు పెళ్ళయిపోతే ఏదో పోగొట్టుకున్నట్టుగా దిగులు పడతాడు. ఆమెకు వైధవ్యం ప్రాప్తిస్తే తన బ్రతుకే పోయిందనుకుంటాడు.

కాకిలాంటి లోకం గోపన్న, అమ్మాయి గారలకు అక్రమ సంబంధాన్ని అంటగడుతుంది. ఇందులో గోపన్న ప్రేమించిన పిల్ల గౌరిపాత్ర యెక్కువగా వుంది.

అమ్మాయిగారి పై కళంకాన్ని తొలగించడానికి చచ్చిపోవాలని గోపన్న నిశ్చయించుకుంటాడు. అతనిని కాపాడడానికి అమ్మాయిగారు వెడుతుంది. ఆమెమేనమామ రాజేంద్ర వాళ్ళను కాల్చివేయడానికి బయల్దేరుతాడు. తన మామను రక్షించమని కళ్ళు తెరచిన గౌరి రాజేంద్రను ప్రార్థిస్తుంది. అందుకు తన శీలాన్ని పణంగా పెడుతుంది.

అయినా గోపన్న, అమ్మాయిగారలు నదిలో సుడిగుండాలలో పడి ప్రాణాలను విడుస్తారు.

— ఇది కథకాగా-ఈ కథలో ఎక్కువ భాగాన్ని శ్రీ అదుర్తి సుబ్బారావు గోదావరి తీరానా; గోదావరి నదిపైన ప్రశంసనీయంగా చిత్రీకరించారు.

గోపన్నగా నాగేశ్వరరావు, అమ్మాయిగారుగా సావిత్రి తమ నటనలో క్రొత్త పోకడలను సృష్టించారు.

"గోదారి గట్టుంది: గట్టుమీద పిట్టుంది: ఒగరు ఒగరుగా పొగరుంది" అంటూ తిరిగే గౌరిగా జమున అద్భుతమైన నటనను ప్రదర్శించింది.

మహదేవన్ గూర్చిన బాణీలు దాదాపు అన్నీ శ్రావ్యంగా వున్నాయి. 'నాపాట నీ నోటపలకాల సిలకా: నీబుగ్గలో సిగ్గులొలకాల సిలకా' "గౌరమ్మా నీ మొగుడెవరమ్మా" అనేవి యిప్పటికే బహుళ ప్రజాదరణ పొందాయి.

సి. సుందరం నిర్మించిన ఈ చిత్రానికి పి. యల్. రాయ్ డైరెక్టర్ ఆఫ్ సినిమాటోగ్రఫీ. దీనిని శ్రీ ఫిలిమ్స్‌వారు విడుదల చేశారు.

## మురళీకృష్ణ

అనుమానం కారణంగా నవయువ దంపతుల మధ్య కలిగిన ఎడబాటును పద్మశ్రీ వారు "మురళీకృష్ణ"లో చిత్రీకరించారు.

చిత్రంలో నాయిక మురళీ కార్నివాల్‌కు వెళ్ళినప్పుడు తల్లిప్రేమ అనే చిత్రాన్ని చూచి దానిని చిత్రించిన లక్ష్మీకాంతం అనే అమ్మాయే ననుకుని ఆ అడ్రసుకు ఉత్తరాలు వ్రాస్తుంటుంది. అదే కార్నివల్‌లో పరిచయమైన డాక్టర్ కృష్ణతో ఆమెకు వివాహం జరుగుతుంది.

పెళ్ళయినతరవాత మురళి లక్ష్మీకాంతం పురుషుడేనని తెలుసుకుంటుంది. తనస్నేహితురాలు లత బదులుగా తాను ఉత్తరాలు వ్రాస్తూ వుంటుంది.

ఒకసారి కలకత్తా వెళ్ళిన కృష్ణకు తన మిత్రుడు లక్ష్మీకాంతంద్వారా ఈవిషయం తెలుస్తుంది. లక్ష్మీకాంతానికి మురళికి వివాహం చేస్తానని మాట యిచ్చి ఇంటికి వచ్చిన కృష్ణకు లత గృహంలో కాంతానికి లేఖ వ్రాస్తున్న మురళి కన్పిస్తుంది. అతనిలో అనుమానం ప్రబలమైపోతుంది. మురళి క్షేమాన్ని కాంక్షించి యిల్లువిడచి వెళ్ళిపోతాడు.



జూపిటర్ పిక్చర్స్ "మర్మయోగి"లో ఎన్. టి. రామారావు కృష్ణకుమారి

చివరకు అనుమానం పటాపంచలై మురళీ కృష్ణలు కలుసుకొనడంతో కథ ముగుస్తుంది. మురళిగా జమున, కృష్ణగా నాగేశ్వరరావు చక్కటి భావవ్యక్తీకరణ చేశారు.

ఇతర పాత్రలను ధరించిన శారద, గీతాంజలి, హరనాధ్, రంగారావు, గుమ్మడి ప్రభృతులు యధోచితంగా నటించారు.

వేణు కూర్చిన రెండు మూడు బాణీలు వినసొంపుగా వున్నాయి.

చిత్రానికి వాస్తవికతను తేవడంకోసం కృష్ణ కలకత్తా వెళ్ళినప్పుడు నిజంగా కలకత్తాలోనే ఆఘట్టాన్ని చిత్రీకరించినందుకు దర్శకుని అభినందించాలి. ఇది విజయావారి విడుదల.

## మర్మయోగి

చిత్రాన్ని జనం యెక్కువగా చూడాలనుకున్నప్పుడు అందుకుతగిన మర్మమేదో గ్రహించితదనుగుణంగాచిత్రం తీయడం ఒక విశేషమే! జూపిటర్ పిక్చర్స్‌వారి "మర్మయోగి" చిత్రంలో సామాన్య ప్రేక్షకుడు మూడు గంటలసేపు కూర్చొని "ఎంజాయ్" (ఆనందించడానికి) చేయడానికి కావలసిన ఆర్భాటం అంతా ఉన్నది.

కత్తియుద్ధము, ముష్టియుద్ధము, ప్రేమ గీతాలు, అంతఃపుర స్త్రీల ఆటల పోటీలు, గుర్రపుస్వారీలు, మాయలు, మంత్రాలు యింకా ఇలాంటివి ఈ చిత్రంలో చాలా వున్నాయి.

చంచల అనే నర్తకిచేత వంచితుడైన ఒక మహారాజు మర్మయోగియై వ్యవహరించడం, చంచల ఆటలను కట్టించడానికి కత్తి పట్టిన ప్రభాకర్ అనే యువకుడు, అతనిని మోసం చేయబోయి ప్రేమవల్ల తానే మోసపోయిన ప్రభావతి అనే యువతి, ప్రభుసేవా పరాయణుడైన భాస్కర్ ఇత్యాదులంతా చిత్రంలో కనుపిస్తారు.

ప్రభాకర్‌గా రామారావు తన సహజ నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. మిగిలిన పాత్రలను ధరించిన కృష్ణకుమారి, కాంతారావు, గుమ్మడి, లీలావతి ప్రభృతులు సమర్థంగా నటించారు.

ఘంటసాల సంగీత దర్శకత్వాన్ని, బి. ఏ. సుబ్బారావు దర్శకత్వాన్ని నిర్వహించారు. "నవ్వుల నదిలో పువ్వులపడవ" లాటి రెండుమూడు పాటలు బావున్నాయి.

ఈ చిత్రం ఈస్టిండియా రిలీజ్.



విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి పూర్తి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం
"అమరశిల్పి జక్కన్న"లో బి. సరోజాదేవి





జూపిటర్ పిక్చర్స్‌వారి 'మర్మయోగి'లో లీలావతి

## *గుడిగంటలు*

వాసుదేవరావుకు మంచితనం, దీనితో పాటు ధనం ఘనంగావుంది. అయితే అందమైన చందమామలో ఏదో మచ్చ వున్నట్లు అతనిలోగూడా బయటకు తెలియని రాక్షసత్వం వున్నది. తాను ప్రాణప్రియంగా చూసుకొనే వస్తువుపై ఎవరి కన్నయినా పడితే అప్పటివరకు అతి సుకుమారంగా వుండే అతని హృదయం వల్లరాయి అయ్యేది. ఆ సమయంలో తాను ఏమి చేస్తున్నాడో కూడా తెలిసికొనలేక పోయేవాడు.

వాసులో ఈ రాక్షసత్వం. అతని జీవితంలో రెండేరెండుసార్లు వికృత రూపాన్ని దాల్చింది. చిన్నప్పుడు ప్రాణస్నేహితుడు తన బొమ్మ కస్తూరిని లాగివేసికొన్నాడన్న కోపంతో అతడు ఊబిలో దిగి చచ్చిపోతున్నా కోపంగా నవ్వుతూ వూరుకొన్నాడు.

పెద్దయిన తర్వాత తాను వివాహం చేసికొనబోతున్న కస్తూరిని మిత్రుడు హరి కళ్ళప్పగించి చూస్తుంటే సహించలేక పిక్నిక్ పేరుతో మరణగుండానికి తీసుకొని వెళ్ళి తన సోదరునిలా చూసుకొంటూన్న అతనిని సముద్రంలోనికి త్రోసివేస్తాడు.

హరి అదృష్టవశాత్తు బ్రతికి బయటపడి కస్తూరిని తాను ప్రేమించిన మాట నిజమని అందువల్ల ఆరోజు అలాచూడవలసి వచ్చిందని మిత్రుడు కస్తూరిని వివాహం చేసికొనగోరడంవల్ల ఆమెను తన దృష్టిపథం నుంచి తొలగించివేసుకున్నానని చెప్పడంతో వాసు పశ్చాత్తాపంచెంది. తానే సముద్రంలో పడిపోతాడు.

పడిపోతూ కస్తూరిని వివాహం చేసికొనవలసిందిగా హరికి చెబుతాడు. సముద్రంలో పడిన వాసు చచ్చిపోడు. బెస్తవాళ్ళు అతనిని రక్షిస్తారు. కస్తూరికి హరికి పెళ్ళవుతోందనుకొని ఇంటికి వొచ్చి చూస్తే హరి ఇంకొక అమ్మాయిని వివాహంచేసుకొనడం కన్పిస్తుంది.

చివరకు కస్తూరి వాసు వివాహంతో కథ ముగుస్తుంది.



విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి పూర్తి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "అమరశిల్పి జక్కన్న"లో నాగేశ్వరరావు



వాసుగా రామారావు. హరిగా జగ్గయ్య. కస్తూరిగా కృష్ణకుమారి సమర్థంగా నటించారు. ఇతర పాత్రలను ధరించిన నాగయ్య. రేలంగి. గిరిజ. రమణారెడ్డి వాసంతి తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు. చిత్రానికి ముళ్ళపూడి వెంకటరమణ వ్రాసిన మాటలు. మధుసూధనరావు దర్శకత్వం. రామారావు నటననిండు తెచ్చాయి.

● ● ●

## అమరశిల్పి జక్కన

విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి పూర్తి ఈస్ట్‌మన్ కలర్‌చిత్రం "అమరశిల్పి జక్కన" మార్చి మొదటివారంలో విడుదల అవుతున్నది. బి.ఎస్. రంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాజేశ్వరరావు సంగీతం ఒక ఆకర్షణ అని అంటున్నారు. బేలూరు దేవాలయాలలోని ప్రపంచ ప్రసిద్ధిచెందిన శిల్పాలను చెక్కిన జక్కనాచార్యుని కథను ఆధారంగా తీసికొని నిర్మించిన యీ చిత్రంలో నాగేశ్వరరావు. బి. సరోజాదేవి. హరనాథ్ ప్రభృతులు నటించారు. ఇది నవయుగ విడుదల.

## కర్ణ

పద్మినీ పిక్చర్స్‌వారు భారీవర్ణ చిత్రం "కర్ణ"ను తెలుగులోనికి అనువదించి తెలుగునాట మార్చిలోనే విడుదల చేస్తున్నారు. ఇందులో పెక్కుపాత్రలను తెలుగునటులే అంటే రామారావు. దేవిక. సావిత్రిమున్నగువారు నటించారు. కర్ణపాత్ర శివాజీగణేశన్ నిర్వహించారు. ఇది రాజశ్రీ విడుదల.

రఘురాం ఫిలిమ్స్‌వారి "కలవారికోడలు" చిత్రం వాణీవారిద్వారా మార్చిలో విడుదల అవుతుంది.



గౌరి ప్రొడక్షన్స్ "బంగారు తిమ్మారాజు" (శ్రీ వెంకటేశ్వర పూజామహిమ)లో వాసవిగా అనూరాధ

ఇందులో రామారావు. కృష్ణకుమారి ముఖ్యపాత్రలను ధరించారు.

మంచిమనసులు. మూగమనసులు. చిత్రాలను తీసిన బాబూ మూవీస్ వారు 'తేనెమనసులు' చిత్రాన్ని తీయడానికి సంకల్పించారు. ఇందులో అందరూ కొత్త నటులే వుంటారని వినికిడి.

వీరే నాగేశ్వరరావు నాయకుడుగా "విశాలనేత్రాలు" అనే చిత్రాన్ని తీయడానికి నిశ్చయించారు.

"విశాల నేత్రాలు" నవలా రచయిత పి. గణపతిశాస్త్రి.

ఆచార్య ఆత్రేయ స్వయంగా "శ్వేత మనసులు" చిత్రం నిర్మించడానికి నిర్ణయించినట్టు రూఢిగా తెలుస్తోంది.

J Venkateswara Rao

JVRao

